ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 14.10.2026 | సంపుటి : 13 సంచిక : 85 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




కొత్త, ముసాయిదా జాబితాలో లేని ఓటర్ల కోసం

## ప్రత్యేక క్యాంప్‌లు

సీఈవో సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): ఈనెల 15, 16 తేదీల్లో కొత్త, ముసాయిదా జాబితాలో లేని ఓటర్ల కోసం ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. యువ ఓటర్లు ఫారమ్‌–6 సమర్పించి ఓటు నమోదు చేసుకోవాలని, డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేనివారు ఫారమ్‌–6 ఇవ్వాలని సూచించారు. అర్హులైతే నవంబరు 9న తుది జాబితాలో చేరుస్తామని తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు

# ఐక్యఉద్యమం

## ఇండియాకూటమి, పౌరసంఘాల ప్రతిజ్ఞ

"సుప్రీంకోర్టు, సీజేఐ, న్యాయ వ్యవస్థపై మాకు అత్యంత గౌరవం ఉంది. తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తాయని ఆశిస్తున్నాం. విజయం సాధించేవరకు రాజకీయ, ప్రజాపోరాటం కొనసాగుతుంది. రాజ్యాంగాన్ని దెబ్బతీసి ఎవరూ తప్పించుకోలేరు. ఓట్ల చోరీకి పాల్పడిన వారిని విడిచిపెట్టబోం. ప్రధాని మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ తదితరుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. సోమవారం సుప్రీంకోర్టుకు నిర్వహించిన ర్యాలీలో కనిపించిన దృశ్యం కేవలం పార్టీల ప్రదర్శన కాదు. అది దేశ ప్రజల గొంతుక. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే ఈ పోరాటంలో వేర్వేరు నిరసనలంటూ ఏమీ లేవు. అంతా ఏకతాటిపై ఉన్నాం" - రాహుల్



ఢిల్లీలోని తన నివాసంలో 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల సభ్యులతో సమావేశమైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

- విజయం సాధించేవరకు రాజకీయ, ప్రజాపోరాటం కొనసాగుతుంది
- రాజ్యాంగాన్ని దెబ్బతీసి ఎవరూ తప్పించుకోలేరు.
- మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ తదితరుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది
- ఓట్ల చోరీకి పాల్పడిన వారిని విడిచిపెట్టబోం.. దేశ ప్రజలంతా మాతో ఉన్నారు
- జ్ఞానేశ్ రాజీనామా చేసే వరకు నిరసనలు: రాహుల్
- జంతర్‌మంతర్‌ను కేంద్ర ప్రభుత్వం డినోటిపై చేయడాన్ని ఖండించిన కాంగ్రెస్ అగ్రనేత

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఐక్యంగా పోరాడతామని విపక్ష 'ఇండియా' కూటమి పౌరసంఘాలు ప్రతిజ్ఞ చేశాయి. ఈ విషయంలో రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుందని.. కచ్చితంగా విజయం సాధిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల సభ్యులతో సమావేశమైన రాహుల్.. వారికి తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఓటు చోరీకి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు."సుప్రీంకోర్టు, సీజేఐ, న్యాయ మిగతా 2లో..

జంతర్‌మంతర్ వద్ద

## మళ్లీ ఉద్రిక్తత

- కాక్రోచ్ పార్టీ నిరసన
- పోలీసుల అదుపులోకి సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య శిందే
- మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆగ్రహం




న్యూఢిల్లీ(జనంసాక్షి):నిరసనలు, అలర్ల నేపథ్యంలో జంతర్ మంతర్‌ను ధర్నా వేదికగా డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసులు ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్కడ ఎలాంటి ఆందోళనలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అక్కడ నిరసన చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ మంగళవారం యత్నించింది. దీంతో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినందుకు గానూ.. సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య శిందేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మా ప్రతిఘటనను నిషేధించడం మీకు సాధ్యం కాదు" అంటూ వ్యాఖ్యానించారు. ఈ పోస్టుకి ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ మిగతా 2లో..

విదేశీ చొరబాటు దారుల కోసమే 'సర్'

## వద్దంటున్నారు

- దేశ ప్రజలంతా మోదీ, ఎన్డీఏ వైపే
- వరుసగా నాలుగోసారీ కాంగ్రెస్ ఓడిపోవడం ఖాయం: అమిత్ షా



2లో..

అధికారం కోసం రాజ్యాంగ సంస్థలను

## కించపరుస్తున్నారు

మీకు అనుకూలంగా ఆదేశాలు ఇవ్వలేదని సీజేఐనీ బెదిరిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఈసీ, సీజేఐ కాదు:కిషన్‌రెడ్డి

సింగరేణి కార్మికుల సొంతింటి కల

## సాకారం చేస్తాం

- కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక
- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు
- రూ.5,500 బోనస్
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు
- 15 రోజుల్లో పరిష్కారం
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు : ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్(జనంసాక్షి): సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ?ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయలను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందించామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు. 'సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి మిగతా 2లో..

ఎఫ్‌టీఈలకు

## గ్రాట్యుటీ భరోసా



- 3800 మంది ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం
- 20 ఏళ్ల పోరాటానికి ఫలితం
- ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక
- రిటైర్మెంట్ వేళ కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ




హైదరాబాద్(జనంసాక్షి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుక అందించింది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనం కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గత రెండు దశాబ్దాలుగా గ్రా ట్యుటీ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారమైంది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ అందే అవకాశం ఉండగా, పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రూ.10 లక్షల వరకు ప్రయోజనం చేకూరనున్నట్లు ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. మంత్రి సీతక్క చొరవతో పరిష్కారం మిగతా 2లో..

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు

## పచ్చజెండా



- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ శంకుస్థాపన ప్రతిపాదనకు ఆమోదం
- 'హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూలం
- కేంద్ర మంత్రి గడ్కరీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయ్యారు. తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు. ఈ భేటీలో ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ శంకుస్థాపన ప్రతిపాదనకు ఆమోదం చెప్పారు. హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సంబంధించి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించే ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు గడ్కరీని కోమటిరెడ్డి ఆహ్వానించారు. మిగతా 2లో..

భారత్‌లో స్టార్‌లింక్

## ఆపేయండి

ఆర్ఎస్ఎస్ అనుభంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ డిమాండ్




న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశంలో స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులను నిలిపివేయాలని ఆరెస్సెస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ కేంద్ర మిగతా 2లో..



సాంకేతికత, జ్ఞానం, ఆవిష్కరణలు

## శక్తి కేంద్రాలు

వాటిని ఎలా ఉపయోగిస్తారనేదే అత్యంత కీలకం

డిజిటల్ నైపుణ్యాలు గేమ్ ఛేంజర్‌గా నిలుస్తాయి

పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం: మోదీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్ సాధిస్తోన్న విజయాల వల్ల ప్రపంచదేశాలు లబ్ధి పొందుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ తనతో పాటు ఇతరులూ ఎదగాలని కోరుకుంటుందన్నారు. దేశ వృద్ధి అంచనాలను అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) 7 శాతానికి పెంచిన నేపథ్యంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ సదస్సులో పాల్గొన్న ప్రధాని.. దేశ వృద్ధి, సాంకేతికతపై మాట్లాడారు. "సాంకేతికత, జ్ఞానం, ఆవిష్కరణలు శక్తి కేంద్రాలు. అవి ఎవరి చేతుల్లో ఉన్నా.. వాటిని ఎలా ఉపయోగిస్తారనేదే అత్యంత కీలకం. ఆ శక్తికేంద్రాలు కోట్లాది మంది ప్రజలకు కొత్త అవకాశాలను సృష్టించడానికి ఉపయోగపడాలి. ప్రస్తుత కాలంలో ఈ తత్వాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మన సంప్రదాయాలు మనకు ఇవే నేర్పాయి. పాలనలో ప్రభుత్వాలూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి" అని మోదీ పేర్కొన్నారు. మరోవైపు, ప్రస్తుతం భారత వృద్ధి రేటు చైనా కంటే మెరుగ్గా ఉండటంపైనా ప్రధాని స్పందించారు. పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానమని తెలిపారు. డిజిటల్ నైపుణ్యాలు మన దేశానికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తాయన్నారు. భారత్ ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను సృష్టించగలదని పునరుద్ఘాటించారు.

**దీర్ఘకాలిక పెట్టుబడులు కీలకం: చంద్రశేఖరన్**

సెమీకండక్టర్ల వంటి వ్యూహాత్మక రంగాల్లో పెట్టుబడులు దీర్ఘకాలంలో కొనసాగించాల్సిన ఆవశ్యకతను టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ప్రస్తావించారు. "రెండు మూడేళ్లలో మనం సరైన మార్గంలో వెళ్లి లక్ష్యాలను చేరుకుంటామా లేదా మిగతా 2లో..

ఆమ్రపాలి పిటిషన్‌పై

## హైకోర్టులో తీర్పు రిజర్వ్



2లో..

హాస్టళ్లలో సరకుల సరఫరా..

## పీఎంయూ టెండర్లను రద్దు చేయాలి

పాఠశాలలకు స్థానిక వెండర్ల ద్వారానే సరకులు పంపాలి:హరీశ్‌రావు

12లో..



## దీపావళి తర్వాతే 'ఎండీఆర్'

అక్టోబర్ 15వ తేదీకి బదులు దీపావళి తర్వాత ఛార్జీల అమలు ఉంటుందని ప్రకటించిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ (జనంసాక్షి): పండగ సీజన్‌లో వ్యాపారులకు కేంద్రం ఊరట కల్పించింది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు అమలును వాయిదా వేసింది. అక్టోబర్ 15వ తేదీకి బదులు దీపావళి తర్వాత ఈ ఛార్జీల అమలు ఉంటుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మిగతా 2లో..

లద్దాఖ్ భారత్‌లో

## అంతర్భాగమే

చైనా వాదనలకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్



న్యూఢిల్లీ(జనంసాక్షి): లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమేనని భారత్ మరోసారి స్పష్టం చేసింది. చైనా వైపు నుంచి ఎన్ని తిరస్కరణలు వచ్చినా ఆ వాస్తవాన్ని మార్చలేవని గట్టిగా సమాధానం ఇచ్చింది. లద్దాఖ్ విషయంపై చైనా చేస్తున్న వాదనలను భారత్‌గట్టి బదులిచ్చింది. లద్దాఖ్‌భారత్‌లో అంతర్భాగమేనని మిగతా 2లో..

కేంద్రమంత్రి పదవికి

## ఎల్.మురుగన్ రాజీనామా

ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ



2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
14.10.2026

## జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఉద్రిక్తత

జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతోన్న నేపథ్యంలో దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జంతర్ మంతర్, ఈసీ కార్యాలయం, పార్లమెంట్ హౌస్ వంటి ప్రాంతాల్లో కేంద్ర బలగాలను భారీగా మోహరించారు.

## దీపావళి తర్వాతే 'ఎండీఆర్'

ప్రకటించింది. పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని.. యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎండీఆర్ ఛార్జీల అమలుకు సంబంధించి కచ్చితమైన తేదీని త్వరలో వెల్లడిస్తామని ఎన్‌పీసీఐ వెల్లడించింది. యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ప్రవేశపెట్టడాన్ని హోల్‌సేల్, రిటెయిల్ వ్యాపారులు వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా పండగ సీజన్‌లో ఎండీఆర్ ఛార్జీల వల్ల ఖర్చులు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న ఎన్‌పీసీఐ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీ.. ఛార్జీల అమలును తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించింది. యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటును నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఖరారు చేసిన సంగతి తెలిసిందే. రూ.2వేలు పైబడి వ్యాపారులకు వ్యక్తులు చేసే చెల్లింపులపై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని స్పష్టంచేసింది. అయితే, సాధారణ వినియోగదారులు ఎప్పటిలాగే యూపీఐ లావాదేవీలను ఉచితంగానే కొనసాగించవచ్చని పేర్కొంది. అలాగే, వ్యక్తుల మధ్య జరిగే నగదు లావాదేవీలు , రూ.2000లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావని స్పష్టంచేసింది.

## కేంద్రమంత్రి పదవికి ఎల్.మురుగన్ రాజీనామా

**ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు ఎల్.మురుగన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఆయన కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. తమిళనాడులో భాజపా బలోపేతానికి పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నట్లు ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 'కూలీ కుటుంబం నుంచి వచ్చి కేంద్రమంత్రి వర్గంలో చోటు సంపాదించాను. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్‌కు సేవ చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది జీవితంలో లభించిన గొప్ప అనుభూతి. ఇప్పుడు సొంత ప్రాంతానికి సేవ చేయాలనుకుంటున్నాను. వచ్చే లోక్‌సభ ఎన్నికల ముందు పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నా. తమిళనాడులో పార్టీ బలోపేతానికి పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకున్నాను" అని తన లేఖలో పేర్కొన్నారు.

## ఆమ్రపాలి పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వ్

హైదరాబాద్(జనంసాక్షి): ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఆమ్రపాలిని తెలంగాణకు బదిలీ చేయడాన్ని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ సమర్థించింది. ఈ తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును.. అదే కోర్టులో ఆమ్రపాలి సవాల్ చేశారు. తాజాగా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆమ్రపాలిని ఏపీ క్యాడర్‌కు కేటాయించగా.. ఆమెను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలంటూ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై క్యాట్ విచారణ చేపట్టి తీర్పు వెలువరించింది.





# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్య ఉద్యమం

వ్యవస్థపై మాకు అత్యంత గౌరవం ఉంది. తమవంతు బాధ్యతను నిర్వర్తిస్తాయని ఆశిస్తున్నాం. విజయం సాధించేవరకు రాజకీయ, ప్రజాపోరాటం కొనసాగుతుంది. రాజ్యాంగాన్ని దెబ్బతీసి ఎవరూ తప్పించుకోలేరు. ఓట్ల చోరీకి పాల్పడిన వారిని విడిచిపెట్టబోం. ప్రధాని మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ తదితరుల చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. సోమవారం సుప్రీంకోర్టుకు నిర్వహించిన ర్యాలీలో కనిపించిన దృశ్యం కేవలం పార్టీల ప్రదర్శన కాదు. అది దేశ ప్రజల గొంతుక. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే ఈ పోరాటంలో వేర్వేరు నిరసనలంటూ ఏమీ లేవు. అంతా ఏకతాటిపై ఉన్నాం" అని రాహుల్ పేర్కొన్నారు.అంతకుముందు రాహుల్ తన నివాసంలో 'ఇండీ' కూటమి నేతలకు, పౌర, విద్యార్థి సంఘాల ప్రతినిధులకు తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ, ఓటు చోరీకి బాధ్యులైన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అఇఅ జ్ఞానేశ్ కుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టడమే ప్రతిపక్షాల లక్ష్యమన్నారు. సుప్రీం కోర్టుతో పాటు ప్రధాన న్యాయమూర్తిపై తమకు అత్యంత గౌరవం ఉందన్నారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థ తన పాత్రను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నట్లు రాహుల్‌గాంధీ తెలిపారు.మోదీ సారథ్యంలోని ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. జంతర్ మంతర్?ను డినోటిఫై చేయటాన్ని ఆయన ఖండించారు. దేశ ప్రజలంతా తమతో ఉన్నారని రాహుల్ గాంధీ చెప్పారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాటం చేస్తున్నామన్నారు. సోమవారం జరిగిన నిరసనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. సోమవారం దిల్లీ వీధుల్లో తాము చేపట్టిన నిరసనలకు హాజరై, మద్దతు తెలిపిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీ వెనుక ఎవరున్నా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. అఇఅ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు."మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం. నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు. అది ఒకే ఒక్క నిరసన. ఆ నిరసన లక్ష్యం కూడా ఒకటే. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు నాశమయ్యాయి. రాజ్యాంగాన్ని చింపివేశారు. నిజమైన ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు మేమంతా కలిసి పోరాటం చేస్తున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియను నాశనం చేశారు. ధ్వంసమైన ప్రజాస్యామ్యాన్ని పునరుద్ధరించడమే మా లక్ష్యం. జంతర్‌మంతర్‌ను డినోటిఫై చేయడాన్ని ఖండిస్తున్నాం. దేశ ప్రజలంతా మాతో ఉన్నారు. దేశ భవిష్యత్తు కోసమే మేము పోరాటం చేస్తున్నాం. నిన్న జరిగిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఓటు చోరీ వెనుక ఎవరు ఉన్నా శిక్ష అనుభవించాల్సిందే. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగుతాయి."అని అన్నారు. "దేశానికి ఉన్న ఒకే ఒక శత్రువు బీజేపీ. నిరసనలు తెలిపే హక్కును కూడా బీజేపీ లాక్కుంది. ప్రజాస్వామ్యం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ఓటు చోరీతోనే బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. స్వేచ్ఛాయుత ఎన్నికల వ్యవస్థను జ్ఞానేశ్‌కుమార్ నాశనం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ చోరీ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే ఆపాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ప్రజలు కోపంగా ఉన్నారు. నిరసనలను అణిచివేయాలని చూస్తున్నారు. జంతర్‌మంతర్‌లో నిరసనలు చేయకుండా డీనోటిఫై చేశారు. జంతర్‌మంతర్‌ను డీనోటిఫై చేస్తే నిరసనలు ఎక్కడ చేయాలి? రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారాయి." అని ఇండియా కూటమి నేతలు విమర్శించారు.ఈ తేనీటి విందు భేటీకి ంఎఅఅ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేష్, శశిథరూర్, పవన్ ఖేఢాతోపాటు ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, జేఎంఎం నుంచి మహువా మాజీ, టీఎంసీ నేత మహువా మొయిత్రా, లెఫ్ట్ నేతలతోపాటు విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ భేటీకి ముందు రాహుల్ గాంధీ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే ఈ ప్రజా ఉద్యమంలో ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉన్నాయని చెప్పారు. తమ పోరాటం కొనసాగుతుందన్నారు. తేనీటి విందు తర్వాత మీడియాతో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఆందోళనలన్నీ ఒక్కటే అని రాహుల్ పేర్కొన్నారు.

## విదేశీ చొరబాటు దారుల కోసమే సర్ వద్దంటున్నారు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్షాల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ సాధిస్తున్న అపారమైన ప్రజాదరణను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎౄఎఖీ సాకుతో దేశంలోకి చొరబాటుదారులను ఓటర్లుగా మార్చాలనే కాంగ్రెస్ కుట్రలను దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని స్పష్టం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కూటమికి ఘోర పరాజయం తప్పదని అమిత్ షా జోస్యం చెప్పారు. బీజేపీ, మోదీల విజయాన్ని ఏదో ఒక కారణం చెప్పి కొట్టిపారేసే బదులు, కాంగ్రెస్ పార్టీ తమ వైఫల్యాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సుదీర్ఘకాలం ఏలిన రాష్ట్రంలోనే గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నిక కూడా గెలవలేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. కల్పిత మీడియా ఈవెంట్లు, నిరంతర అబద్ధాల ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడం సాధ్యం కాదని హితవు పలికారు. వచ్చే 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్‌డిఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించబోతోందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ఆయన మిత్రపక్షాలు వరుసగా నాలుగో ఓటమికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు."బీజేపీ, మోదీ సాధిస్తున్న ప్రజాదరణను కేవలం ఒక ఎస్ఐఆర్ కారణమని కొట్టిపారేస్తున్నారు. మీరు నిజానికి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు మీరు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న ఒక పెద్ద రాష్ట్రంలో(గుజరాత్‌లో), గత 41 ఏళ్లుగా ఒక్క ఎన్నికల్లో కూడా గెలవలేకపోయారు. ఇది మీ పార్టీ తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. ఇటీవలే దేశంలో మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఎౄఎఖీ ముసుగులో చొరబాటుదారులకు రక్షణ కల్పించే మీ వ్యూహాన్ని దేశప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారు. ఇకపై వారు మీ కుతంత్రాలకు లొంగరని నేను రాహుల్ గాంధీకి చెప్పాలనుకుంటున్నాను.

## సాంకేతికత, జ్ఞానం, ఆవిష్కరణలు శక్తి కేంద్రాలు

అన్నది ముఖ్యం కాదు. మెమొరీ చిప్‌లు ప్రాథమికంగా అవసరం కాబోతున్నాయి. చిప్‌ల వంటి రంగాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు ముఖ్యం" అని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.

## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన రైలు.. ఆరుగురి దుర్మరణం

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**



పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్సులో ఘోర రైలు ప్రమాదం జరిగింది. ఓ ప్యాసింజర్ రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు దుర్మరణం చెందారు. సుమారు 30 మంది గాయపడ్డారు. మంగళవారం ఉదయం కరాచీ నుంచి పెషావర్ వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్.. ముల్తాన్‌లోని షేర్ షా బ్రిడ్జి సమీపంలో పట్టాలు తప్పింది. 14 కోచ్‌లు పట్టాలు తప్పాయని అధికారులు తెలిపారు.

## భారత్‌లో స్టార్‌లింక్ ఆపేయండి

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అనుమతుల జాప్యం విషయంలో భారత ప్రభుత్వంపై, వ్యాపారులపై స్టార్‌లింక్ అధిపతి ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. మస్క్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్వదేశీ జాగరణ్ మంచ్ జాతీయ కో–కన్వీనర్ అశ్వినీ మహాజన్ తప్పుబట్టారు.దేశ జాతీయ భద్రతకు సంబంధించిన ఆందోళనలను కారణంగా చూపుతూ స్టార్‌లింక్‌ను నిరోధించే హక్కు భారత్‌కు ఉందని మహాజన్ పేర్కొన్నారు. తద్వారా అమెరికా వంటి వాణిజ్య భాగస్వాములకు సైతం ఒక సందేశం పంపొచ్చని అభిప్రాయపడ్డారు. స్టార్‌లింక్ సేవలు కమర్షియల్ సేవల ప్రారంభానికి మస్క్ అనుమతులు మాత్రమే కోరారని, భారత ప్రభుత్వం దాన్ని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదని పేర్కొన్నారు. అనుమతుల జాప్యంపై ఆరా తీయాలే తప్ప... భారత ప్రభుత్వం, వ్యాపారులు లక్ష్యంగా విమర్శలు చేయడం తగదని అభిప్రాయపడ్డారు. అవసరమైన అనుమతులు పొందకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న ప్రయత్నం కనిపిస్తోందన్నారు. ఉక్రెయిన్, ఇరాన్, రష్యా, చైనా, తైవాన్..తదితర దేశాల్లో స్టార్‌లింక్ విషయంలో భద్రతాపరమైన ఆందోళనలు ఉన్నాయని మహాజన్ పేర్కొన్నారు. జాతీయ భద్రతా కారణాలు చూపుతూ స్టార్ లింక్‌కు అనుమతులు నిరాకరించడం వల్ల దేశీయంగా అభివృద్ధి చేసిన శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను మారుమూల గ్రామాలకూ అందించడడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## అధికారం కోసం రాజ్యాంగ సంస్థలను కించపరుస్తున్నారు

కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఈసీ, సీజేఐ కాదు:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అధికారం కోసం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు."పార్లమెంట్‌లో విపక్షాలు నవ్వులపాలవ్వడం దేశ ప్రజలు చూశారు. ఇప్పుడు మోదీ, అమిత్‌షా, మోహన్ భాగవత్, అజిత్ ధోబాల్ దేశానికి ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి కూడా గద్దె దిగాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే.. ఈసీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌ది బాధ్యతా?. ఆ పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఈసీ, సీజేఐదా..? మీకు అనుకూలంగా ఆదేశాలు ఇవ్వలేదని సీజేఐని బెదిరిస్తున్నారు. భారత్ ఏమైనా సోనియా కుటంబ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాపర్టీనా?. భారత్‌లో కాంగ్రెస్ మార్కు నియంతృత్వపు రాజకీయం నడవదు" అని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## సింగరేణి కార్మికుల సొంతింటి కల సాకారం చేస్తాం

కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని" సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. ??సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్ , అలవెన్స్ లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరపున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు."సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తాం. ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం. సామాన్య కార్మికుడు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. అవసరమైతే వైద్యుల వేతనాలు, పారితోషికాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమిస్తాం. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని" వెల్లడించారు.?బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఖరీదైన పట్టణ, వాణిజ్య భూములను సోలార్ ప్లాంట్లకు వినియోగించకుండా, పట్టణాలకు వెలుపల ఉన్న నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VII

**రూఢీ ప్రకటన**
**(పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)**

గెజిట్ నెం: 93/2026 తేది: 07.10.2026
ఫైల్ నెం: G/1056/2025

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1)న ననుసరించి)

తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు ప్రజా ప్రయోజనార్థం అవసర నిమిత్తం "RBLISP-RBLI-Package No.17 లోని రంగ సముద్రం బలెన్సింగ్ రిజర్వాయర్" నిర్మాణం కొరకు వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల రెవిన్యూ గ్రామ పరిధిలో ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదాహరించిన భూమి 4804 చ.మీ. గల గ్రామకంఠంలోని ఖాళీ స్థలం పట్టా/ప్రభుత్వ భూములు సేకరించనైనది.

పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల గ్రామము పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ 4804 చ.మీ గల గ్రామకంఠంలోని ఖాళీ స్థలం కొలిచే డివిజన్ భూమి, భూసేకరణ ద్వారా సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.

**షెడ్యూల్**

గ్రామం : నాగరాల మండలం : శ్రీరంగాపూర్ జిల్లా : వనపర్తి

| క్ర. సం. | RS BR No | భూమి స్వభావం | భూమి వర్గీకరణ | భూసేకరణ చేయు ప్రతిపాదిత గ్రామకంఠం లోని భూ విస్తీర్ణం చ.మీ. | పట్టాదారు పేరు/ అనుభవదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు | చెట్లు/ బోర్/ పైప్ లైన్ & ఇతరములు |
|---|---|---|---|---|---|---|
| 1 | OS | పట్టా | ఖాళీ స్థలం | 1201 | శ్రీమతి నందిని కుదుకుంట్ల భర్త కే.ధర్మేందర్ | - |
| 2 | OS | పట్టా | ఖాళీ స్థలం | 1201 | శ్రీ కే.ధర్మేందర్ తండ్రి కే.నారాయణ | - |
| 3 | OS | పట్టా | ఖాళీ స్థలం | 1201 | కుదుకుంట్ల హేమశ్రీ తండ్రి కే.ధర్మేందర్ | - |
| 4 | OS | పట్టా | ఖాళీ స్థలం | 1201 | కుదుకుంట్ల భరత్‌కుమార్ తండ్రి కే.ధర్మేందర్ | - |
| | మొత్తం విస్తీర్ణం ఎ-గు | | | 4804 చ.మీ | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) ప్రకారం సంబంధిత భూమి యజమానుల/ఆసక్తి కలిగిన వారి నుండి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప, సెక్షన్ 19(1) ప్రకారం రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయునైనది. ఇట్టి భూసేకరణ కారణంగా పునరావాసం కల్పించవలసిన కుటుంబాలు ఉన్నాయి.

భూసేకరణలోని సదరు ప్రాజెక్ట్ యొక్క నిర్మాణ సమయంలో భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూమిలలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టుకు నిర్మాణములకు ఉపయోగితమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/ భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, (భూసేకరణ), ఆర్.ఎల్.ఐ.ఎస్.పి-2 పెబ్బేర్, హెడ్ క్వార్టర్ ఐ.డి.ఓ.సి, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.పి.ఎస్.ఐ.ఎల్., యూనిట్-2, పెబ్బేర్.
సం/- అదనపు కలెక్టర్, వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 996/LA/PP/Advt/Pub/2026-27

## లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

మరోసారి స్పష్టం చేసింది. చైనా వైపు నుంచి ఎన్ని తిరస్కరణలు వచ్చినా ఈ వాస్తవాన్ని మార్చలేవని గట్టిగా సమాధానం ఇచ్చింది. లద్దాఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాల పేర్లను భారత్ అధికారికంగా ప్రామాణీకరించడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ దౌత్యపరమైన వివాదం చెలరేగింది. అయితే, చైనా చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తీవ్రస్థాయిలో స్పందించారు. లద్దాఖ్‌కు సంబంధించి సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లలో చేర్చిన ఈ భౌగోళిక పేర్లను లద్దాఖ్ పరిపాలనా విభాగం, స్థానిక ప్రజలు, వాటాదారులతో సుదీర్ఘంగా సంప్రదింపులు జరిపిన తర్వాతే ఖరారు చేశాం. ఈ ప్రదేశాలను అధికారిక మ్యాప్‌లలో స్పష్టంగా గుర్తించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. అలాగే, ఆయా ప్రాంతాలను కచ్చితంగా గుర్తించడానికి వీలవుతుంది."మరోవైపు, లద్దాఖ్?లోని ప్రదేశాలు, భౌగోళిక లక్షణాలకు ప్రామాణిక పేర్లను కేటాయించాలన్న భారత నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని చైనా ఎన్నడూ గుర్తించలేదని పేర్కొంది. అలాగే, భారత్ ప్రచారం చేస్తున్న ప్రామాణిక పేర్లను సైతం గట్టిగా వ్యతిరేకించింది. ఈ మేరకు బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడారు. "భారత్ తీసుకున్న ఈ చర్య చట్టవిరుద్ధం. చైనా– భారత్ సరిహద్దులోని పశ్చిమ భాగం చైనాకు చెందినది అనే వాస్తవాన్ని ఇది మార్చదు. ఈ నిర్ణయం వల్ల సరిహద్దు ప్రాంతాలపై మా వైఖరి మారదు"అని పేర్కొన్నారు. లద్దాఖ్‌లోని కీలక ప్రాంతాలను భారత అధికారిక మ్యాప్‌లో గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 2న నిర్ణయం తీసుకుంది. ఆ జాబితాలో లద్దాఖ్?లోని 28 కీలక ప్రాంతాలు, పర్వతాలు, లోయలు, మంచు కొండలు, పర్వత మార్గాలకు భారత్ పేర్లు ఖరారు చేసింది. కేంద్ర హోం శాఖ, లద్దాఖ్? పాలన యంత్రాంగం సంయుక్తంగా ఈ చర్యలు తీసుకున్నాయి. ఆ జాబితాలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. తూర్పు లద్దాఖ్?లో భారత్, చైనా మధ్య 2020లో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడిన నేపథ్యంలో అదే ఏడాది మే 5న పాంగాంగ్ సరస్సు ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇరుదేశాల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగాయి. అయితే, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇరు దేశాలు చర్చలు జరిపాయి. 2022లో కొన్ని ప్రాంతాల్లో సైనిక బలగాలను వెనక్కి తీసుకునే ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి ప్రాంతాలకు ప్రాధాన్యం ఉంది. సరిహద్దులో ఎక్కడెక్కడ కీలక ప్రాంతాలు ఉన్నాయో స్పష్టంగా గుర్తించడం భారత సైనిక గస్తీకి, అధికారిక రికార్డుల నిర్వహణకు ఉపయోగపడుతుంది.గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ ప్రాంతాలు ఎల్ఏసీ వెంబడి భారత సైన్యం గస్తీ నిర్వహించడానికి కీలకంగా ఉంటాయి. వీటిలో అలీషా గిరి, బ్రంగ్సా, చాప్పింగల్ పాస్, కనిష్క శిఖరం, కరుణ్ పీర్ పర్వతం, కుక్సెల్, మార్తాండ్ గిరి, పర్విక్ హిమానీనదం, స్వామి హిమానీనదం, షాచ్మిరిక్ పాస్, షోర్గా వ్యాలీ, జోరావర్ శిఖరం, డెహ్రా కంపాస్, డ్రాక్ కార్పో, జోల్మోరి, ఝనాంగ్, కుమారాయనా పోలింట్, పాన్‌కియాంగ్‌ల్ ఉన్నాయి. గిరి, గురు రిన్‌పోచే, షామల్ లుంగ్‌పా, యాంగ్‌పా నది, మార్ప లోత్సవ రి, మిలరేప కాంగ్రి, శివ రి, మహేశ్వర రి ప్రాంతాలు ఉన్నాయి.

## ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు పచ్చజెండా

ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీ వర్తింపజేసే విషయంలో మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకున్నారని ఉద్యోగుల సంఘం తెలిపింది. సుమారు 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌ను పరిష్కరించడంలో చొరవ చూపిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రాట్యుటీ మంజూరుకు సహకరించిన సీఎం,ఉప ముఖ్యమంత్రికు ఉద్యోగులు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ నిర్ణయంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉద్యోగుల హక్కులకు ప్రాధాన్యంఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సం కల్పమని ఆమె పేర్కొన్నారు. జీవిత చరమాంకంలో ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి స్పష్టం చేశా రు. గ్రాట్యుటీ మంజూరుతో ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనం చేకూ రడమే కాకుండా, వారి దీర్ఘకాలిక పోరాటానికి గుర్తింపు లభించినట్లయిందని ఉద్యోగుల సంఘం అభిప్రాయపడింది.

## డ్రగ్స్ అమ్ముతున్నాడని ప్రశ్నిస్తే.. లైవ్‌లో కాల్చేశాడు..!

**ఛండీగఢ్(జనంసాక్షి):**మెడికల్ షాపుల్లో మత్తుపదార్థాల విక్రయాలను ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రశ్నించడం ఓ ఉద్యమకారుడి ప్రాణాలు తీసింది. ఒక మెడికల్ షాపు యజమాని జరిపిన కాల్పుల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్విందర్ సింగ్ జోటా మృతి చెందారు. పంజాబ్‌లోని మాన్సా జిల్లా ఈ ఘటన చోటుచేసుకుంది. మందుల దుకాణాల్లో డ్రగ్స్ అక్రమ విక్రయాలను పర్విందర్ ప్రశ్నిస్తుంటారు. అలాంటి దుకాణాలను ఫేస్‌బుక్ లైవ్ ద్వారా బయటపెడుతుంటారు. అలాగే మంగళవారం అక్రమ విక్రయాలపై మాన్సాలోని ఓ దుకాణదారుడిని ప్రశ్నించారు. దానిని ఫేస్‌బుక్‌లో లైవ్ చేయడం ప్రారంభించారు. దాంతో యజమానికి, పర్విందర్‌కు మధ్య వాగ్వాదం తీవ్రరూపం దాల్చింది.ఆ సమయంలో మెడికల్ స్టోర్ యజమాని చేతిలో పిస్టల్ కనిపించింది. అతడు కాల్పులు జరపడంతో పర్విందర్ నేలపై పడిపోయినట్లు ఆ దృశ్యాల్లో రికార్డయింది.

# నిఘా పెట్టి .. వేటగాళ్లను పట్టి



మెదక్/పాపన్నపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి) : నిఘా పెట్టి అటవీ వేటగాళ్ళను అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. అధికారులే సాధారణ వ్యక్తుల వలే మారి మెదక్ అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో నేరానికి చెక్ పెట్టారు. వివరాలు ఇలా .. అడవి పందులను అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న నేరగాళ్ల పై వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 నిబంధనల మేరకు నిందితులపై కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పాతేపూర్ గ్రామానికి చెందిన సంపత్, దుర్గయ్య, యాదగిరి, ఆనంద్, అంజనేయులు తదితర వ్యక్తుల నుంచి అడవి పందులను సేకరించి ఖమ్మం ప్రాంతానికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు, మాంసం విక్రయం జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు, నేరగాళ్ళను, అడవి పందులు,వాహనాలను అధికారులు పట్టుకున్నారు. ఈనెల 10 న కొత్తపల్లి, జంబికుంట, ముస్లాపూర్, గొల్లపల్లి తదితర ప్రాంతాల్లో జరిగిన దాడిలో ఫారెస్ట్ బీట్ అధికారులు క్షేత్ర స్థాయిలో చక్కటి ప్రతిభతో వ్యవహారించినట్లు సమాచారం. ఈ నేరంపై చట్టపరమైన తదుపరి చర్యలకు రాష్ట్రస్థాయి ప్రధానాధికారి వినయ్ కుమార్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. అడవి జంతువులను వేటాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మెదక్ అటవీ రేంజ్ అధికారి గణేష్ వెల్లడించారు.

# రాష్ట్రంలో ప్రతీకార పాలన

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో ప్రతీకార పాలన నడుస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జీవో 134 లో తప్పిదాలు చోటు చేసుకున్నాయని.. 16 భూములపై విచారణ జరపాలని ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని.. జీవోలో బీఆర్ఎస్ నాయకుల భూములను పెట్టారని అన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో పెట్టిన భూములు, రాజకీయాల్లోకి రాక ముందు ఉన్న భూములను సైతం జీవో 134 కింద పెట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు సంబంధం లేని వ్యక్తులకు సంబంధించిన భూములను జవోలో పెట్టారన్నారు. నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్‌కు సికింద్రాబాద్‌లో ఉన్న భూములను ఈ జీవోలో పెట్టారని పేరకొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 134 రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. దీనిపై చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజుకు లెటర్ రాసినట్లు చెప్పారు. 22ఏపై అసెంబ్లీలో జరిగిన చర్చ ఏకపక్షంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ నేతలు మల్‌రెడ్డి రంగారెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య భూముల వివరాలను ఎపిసోడ్ కింద బయటపెడతామని హెచ్చరించారు. నైమిషారెడ్డి రూ80 కోట్లు విలువ చేసే భూమిని పది కోట్లకు కొనుక్కున్నారన్నారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వట్టినాగులపల్లిలో 27 ఎకరాల భూమి ఉననదని.. నానక్‌రామ్‌గూడ, పుప్పాలగూడలో ఆయన ఫ్యామిలీకి భూములు ఉన్నాయని ఆరోపించారు. ఖాజాగూడలో 3 ఎకరాల భూమిని అక్రమంగా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని.. ఖానామెట్‌లో 26 ఎకరాల భూమి ఉన్నదని తెలిపారు. సీఎస్ సంజయ్ జాజు చట్ట ప్రకారం పనిచేయాలని.. రేవంత్‌రెడ్డికి, పొంగులేటికి అభ్యంతరాలు ఉంటే నోట్ ఫైల్ చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో మల్‌రెడ్డి రంగారెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భూదందా చేస్తున్నారని ఆరోపించారు. 2,600 ఎకరాల్లో కాంగ్రెస్ నేతలు భూ దందా చేస్తున్నారన్నారు. ఓట్ చోరీ జరుగుతున్నదని ఢిల్లీలో ఫ్లెక్సీలు పెట్టారని.. తెలంగాణలో భూమి చోరీ జరుగుతున్నదని చెప్పారు. రాయదుర్గంలో చామల బినామీలు విల్లాలు కడుతున్నారని.. తాము కాంగ్రెస్ లాగా కక్ష సాధింపు రాజకీయాలు చేయబోమని తెలిపారు. రేవంత్‌రెడ్డి గోవాలో భూ కుంభకోణం గురించి మాట్లాడటం అంటే చార్లెస్ శోభ రాజ్ కథలా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు అభిలాష్ రంగినేని, తొట్ల స్వామియాదవ్, కల్వకుర్తి శ్రీనివాస్ యాదవ్, పి.రాజ్‌కుమార్, వి.రాజు, రాజేష్ పాల్గొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం

- రూ.2 కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత



హైదరాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిషేధిత హైడ్రోపోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఓ ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ అధికారులు తనిఖీ చేయగా.. రూ. 2 కోట్ల విలువ చేసే హైడ్రోపోనిక్ గంజాయి లభించడం కలకలం రేపింది. ప్రయాణికుడి ఎలక్ట్రిక్ గీజర్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గీజర్‌లో దాచిన 73 హైగ్రేడ్ గంజాయి ప్యాకెట్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుంచి మొత్తంగా 7.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నార్కోటిక్ డ్రగ్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించి గంజాయి అని నిర్ధారణ చేసుకున్న అనంతరం ప్రయాణికుడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

# కాసం షాపింగ్ మాల్‌లో చిన్నారి బంగారం చోరీ!

- రూ.50 వేల విలువైన బంగారు బిళ్ల అపహరణ?
- చిన్నారి మెడలోని తాడును కత్తితో కోసిన వైనం..
- మెడపై గాయం.. భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు..





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి పట్టణంలో ఇటీవలే ప్రారంభమైన కాసం షాపింగ్ మాల్‌లో చిన్నారి బంగారం మాయమైన ఘటన కలకలం రేపింది. పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కొత్త బట్టలు కొనుగోలు చేసేందుకు వెళ్లిన ఓ ఉద్యోగి కుటుంబానికి చేదు అనుభవం ఎదురైంది. సుమారు రూ.50 వేల విలువైన బంగారు బిళ్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధిత కుటుంబం అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనపై మంగళవారం భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టణంలోని మైసమ్మ కాలనీలో నివాసముంటున్న బాలాజీ అనే ఉద్యోగి ఆదివారం తన కుటుంబంతో కలిసి కాసం షాపింగ్ మాల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారి చిన్నారి మెడలో తాడుతో కట్టిన బంగారు బిళ్లను ధరించింది. షాపింగ్ ముగిసిన తర్వాత చిన్నారి మెడలో బంగారం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పరిశీలించగా, చిన్నారి మెడలోని తాడును చాకుతో కోసినట్లుగా ఉండటంతో పాటు మెడపై కత్తి గాయం కూడా కనిపించినట్లు బాధితులు తెలిపారు. దీంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారి మెడలోని తాడును కోసి బంగారు బిళ్లను అపహరించి ఉంటారని అనుమానిస్తున్నారు. సుమారు రూ.50 వేల విలువైన బంగారం పోవడంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. చిన్నారి మెడపై గాయం ఉండటం ఈ ఘటనలో మరింత ఆందోళన కలిగిస్తోంది. షాపింగ్ మాల్‌లో రద్దీని ఆసరాగా చేసుకొని ఈ ఘటనకు పాల్పడ్డారా? చిన్నారి మెడలోని తాడును కత్తితో కోసింది ఎవరు? అన్న కోణాల్లో విచారణ జరగాల్సి ఉంది. ఘటన జరిగిన సమయంలో షాపింగ్ మాల్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తే కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పండుగ వేళ కుటుంబంతో కలిసి సరదాగా షాపింగ్‌కు వెళ్లిన చిన్నారికి ఇలాంటి అనుభవం ఎదురుకావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, బంగారం మాయమైన తీరును గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.



# ఖర్గేను కలిసిన మంత్రి వాకిటి శ్రీహరి

న్యూఢిల్లీ (జనంసాక్షి) : ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఢిల్లీలో సోమవారం జరిగిన చలో సుప్రీంకోర్టు కార్యక్రమం నేపథ్యంలో ఖర్గేతో కాసేపు చర్చించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కులు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, సి ఈ సి జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు సంబంధించిన అంశాలపై జాతీయ స్థాయిలో ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో ఇరువురు కాసేపు సమావేశమయ్యారు.

# సమస్యలు పరిష్కరించాల్సిందే..



- కలెక్టరేట్ ముందు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఆందోళన..
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మద్దతు..

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా తదితర 9 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 272 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నామని, కోవిడ్ సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్లుగా పని చేశామని జేఏసీ నాయకులు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, గౌరవప్రదమైన సర్వీస్ రూల్స్, బడ్జెట్ నిధుల సక్రమ విడుదల, కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎస్‌హెచ్‌ఎస్‌లో భాగస్వాములను చేయడం, 2022 నుంచి 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం రిస్క్ బోనస్, మహిళా సిబ్బందికి 180 రోజుల ప్రసూతి సెలవులు, ప్రతి ఉద్యోగికి ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, పెండింగ్ లో ఉన్న 9 నెలల పీఆర్సీ బకాయిల విడుదల, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాల చెల్లింపు, జీఓ నం.60, 1195 అమలు, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నేతలు, టీఎన్జీవోస్ యూనియన్ నేతలు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, సెక్రటరీ మధుబాబు, వైస్ ప్రెసిడెంట్ రఘురాం, ట్రెజరర్ శ్రీను, కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, సోషల్ మీడియా ఇంచార్జ్ రాజు పాల్గొన్నారు.

## హల్దీ వేడుకలో సంతోషంగా గడిపి..

# తెల్లవారుజామున గుండెపోటుతో మృతి

- కూతురు పెళ్లి చూడకుండానే తండ్రి మరణం



నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) : కూతురి పెళ్లిని ఘనంగా జరిపించి, అత్తవారింటికి సాగనంపాలనుకున్న ఆ తండ్రి కలలు కలలయ్యాయి. పెళ్లికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, హల్దీ వేడుకలో కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన ఆయన.. తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశాడు. దీంతో పెళ్లి ఇంట్లో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ సాహెబ్ హుస్సేన్ భైంసాలోని యూనియన్ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. పిల్లలకు మంచి చదువులు చెప్పించి, ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడ్డారు. తన కూతురి పెళ్లిని ఘనంగా జరిపించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 11న జరిగిన హల్దీ వేడుకలో బంధువులతో కలిసి ఆనందంగా గడిపారు. అయితే, అక్టోబర్ 12న తెల్లవారుజామున సుమారు 4 గంటలకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒకవైపు కుటుంబ పెద్దను కోల్పోయిన బాధ.. మరోవైపు జరగాల్సిన కూతురి పెళ్లి. ఈ పరిస్థితుల్లో అదే రోజు వివాహం జరిపించారు. కూతురి మెడలో మూడు ముళ్లు పడాల్సిన వేళ తండ్రి లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కూతురి పెళ్లిని కళ్లారా చూడాలన్న తండ్రి కోరిక తీరకపోవడంతో సారంగాపూర్‌లో ఈ ఘటన అందరినీ కలచివేసింది.

# విద్యుత్ తీగలపై అటవీ అధికారుల తనిఖీ

- అజాంనగర్ అటవీ ప్రాంతంలో ఎఫ్‌డీఓ క్షేత్రస్థాయి పరిశీలన
- అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం అజాంనగర్ నార్త్, సౌత్ బీట్ పరిధిలోని యామన్‌పల్లి నుంచి నిమ్మగూడెం వరకు ఉన్న అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగల ఏర్పాటు అంశంపై అటవీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. భూపాలపల్లి ఎఫ్‌డీఓ అప్పలకొండ అటవీ ప్రాంతంలో పర్యటించి, వన్యప్రాణులకు ప్రమాదకరంగా మారే విద్యుదీకరణపై పరిశీలన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నేరంలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అటవీ సిబ్బందికి ఎఫ్‌డీఓ సూచనలు జారీ చేశారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# వీబీజీ రాం జీ పథకంలో పనిదినాలను పెంచాలి

- జలసిరి కార్యక్రమంలో ఉన్న అన్నీ పనులను ప్రారంభించి పూర్తి చేయాలి
- కలెక్టరేట్ లో వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 13 (జనం సాక్షి) : ప్రస్తుతం ఉన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వీబీజీ రాం జీ పథకంలో భాగంగా కూలీలకు ఉపాధి పనిదినాలను పెంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్డీవో, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విబిజి రాంజి పథకం ద్వారా పనిదినాలు కల్పించడం, వీవో భవనాలు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్స్, తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ..జలసిరి కార్యక్రమంలో ఉన్న అన్నీ పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. మంజూరైన గ్రామైక్య సంఘ (వీవో) భవనాల పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో వీవో బిల్డింగ్ ఉండేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ తీర్మానంతో వీవో భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు అధికారులు ఇవ్వాలన్నారు. ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్స్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాల పెంపునకు బోర్ వెల్ పాయింట్ల మంజూరుకు ప్రతిపాదనలను అందించాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో గుర్తించిన పనులకు త్వరగా అంచనాలను తయారుచేసి మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, డీపీవో లక్ష్మీ రమాకాంత్, పంచాయతీరాజ్ ఈఈ రాజ్ గోపాల్ రావు, డీఈలు శ్రీనివాస్ రావు, శిరీష, యుగంధర్, ఎంపీడీవోలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పంట కుంటల పనులు చేపట్టాలి

- జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

పాలకుర్తి, అక్టోబరు 13 (జనంసాక్షి) : ఎల్-నినో ప్రభావంతో రైతులు నీటి కుంటల పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీపకుమార్ ఝూ అన్నారు. మంగళవారం మండలంలోని పాలకుర్తి, అయ్యంగారిపల్లి గ్రామాల్లో వీబీజీ రాంజీ పథకం కింద చేపడుతున్న నీటి కుంటల పనులను సందర్శించి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం, లోటు వర్షపాతం నమోదుతో ప్రతి ఒక్క రైతు నీటి కుంటలను నిర్మించుకొని వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. దీంతో భూగర్భ జలాలు పెంపొందించబడతాయని అన్నారు. నీటి కుంటల ద్వారా నీటి నిల్వ పెరిగి క్లిష్ట పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవడమే కాకుండా భూగర్భ జలమట్టం సైతం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. రైతులు మందుకు వచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నీటి కుంటలు బహుళ ప్రయోజకరంగా ఉపయోగపడుతాయని అన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచి పంటలను కాపాడుకుందామనే సంకల్పంతో గ్రామ స్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కలిగి ఉండాలని ఊచించారు. ఆయన వెంట డి ఆర్ డి ఓ భాస్కర్. ఎంపీడీవో వర్కల వేదవతి. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోతుల బెడద నుండి విముక్తి



నడికూడ, అక్టోబర్ 13 (జనం సాక్షి) నడికుడ గ్రామంలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గానికి ప్రజలు విన్నవించుకోగానడికూడ గ్రామంలో సర్పంచ్ కుడ్ల. మలహల్ రావు ఆధ్వర్యంలో మంగళవారం కోతులను పట్టించారు. కోతుల బెడద నుండి విముక్తి జరుగుతుందని గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నడికూడ పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కేయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా శ్రీనివాస్



హనుమకొండ (జనంసాక్షి) : కాకతీయ విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం నూతన అధిపతిగా డాక్టర్ పి.శ్రీనివాస్ నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల కాలం ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం నూతన అధిపతిగా డాక్టర్ పి.శ్రీనివాస్ నియమితులయ్యారు. రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మంగళవారం ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుత విభాగాధిపతిగా ఉన్న టి.శాస్త్రి నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

# చొరబాట్లను అడ్డుకోలేక..
## ఓటర్ల పేర్ల తొలగింపే పరిష్కారమా?

ఓటర్ల జాబితా శుద్ధి ఎన్నికల స్వచ్ఛతకు అవసరం కావచ్చు. కానీ చొరబాట్ల నిర్మూలనకు అది ప్రత్యామ్నాయం కాదు. సరిహద్దులను కాపాడలేకపోతే, అక్రమ ప్రవేశాలను అడ్డుకోలేకపోతే, ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకు జాబితా సవరణను ముందుకు తెస్తున్నారన్న ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాల్సిందే!

సంపాదకీయం

చొరబాట్లను అడ్డుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. సరిహద్దులను కాపాడాల్సిన బాధ్యత హోంశాఖది. మరి చొరబాటుదారులు దేశంలోకి ఎలా వస్తున్నారు? ఏళ్ల తరబడి ఎలా నివసిస్తున్నారు? నకిలీ పత్రాలతో భారతీయులుగా ఎలా చలామణి అవుతున్నారు? వారిని గుర్తించి పంపించడంలో ప్రభుత్వం సాధించిన ఫలితాలెన్ని? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడమే చొరబాట్లకు పరిష్కారమన్నట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం?

ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉండకూడదు. కానీ ఆ పేర్లను తొలగించే క్రమంలో నిజమైన భారతీయుల ఓటు హక్కు బలికాకూడదు. పేదలు, వలస కార్మికులు, మహిళలు సరైన పత్రాలు చూపలేక ఓటు హక్కు కోల్పోతే బాధ్యత ఎవరిది? చొరబాటుదారులను గుర్తించడం ఒక ఎత్తయితే, అర్హులైన పౌరులను అనుమానితులుగా మార్చడం మరో ఎత్తు. ఈ రెండింటి మధ్య తేడాను ప్రభుత్వం గుర్తించాలి.

అసలు ప్రశ్న ఓటర్ల జాబితాలో పేర్లు ఎన్ని తొలగించారన్నది కాదు.. దేశంలోకి అక్రమంగా ప్రవేశించకుండా ఎంతమందిని అడ్డుకున్నారన్నది! సరిహద్దుల వద్ద భద్రతా వైఫల్యాలను సరిదిద్దకుండా, నకిలీ పత్రాల ముఠాలను కట్టడి చేయకుండా, బహిష్కరణ ప్రక్రియను సమర్థంగా అమలు చేయకుండా జాబితా సవరణతోనే చొరబాట్ల సమస్య తీరుతుందా?అమిత్ షా సమాధానం చెప్పాలి. చొరబాట్లు జరిగితే బాధ్యత ఎవరిది? కేంద్ర హోంశాఖ ఇప్పటివరకు ఏం చేసింది? దేశ భద్రతపై ప్రకటనలు చేయడం సులభమే.. కానీ క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే!

చొరబాటుదారులకు ఓటు హక్కు ఉండకూడదు. అదే సమయంలో అర్హులైన భారతీయుల ఓటు హక్కును ఎవరూ హరించకూడదు. చట్టబద్ధమైన విచారణ, పారదర్శక ప్రక్రియ, అప్పీల్‌కు అవకాశం తప్పనిసరి.

# పండగ పూట 'డిస్కౌంట్' చమత్కారాలు - వాస్తవాల పూలదండ!

పండగలు వస్తున్నాయంటే చాలు... ఊరూ వాడా 'డిస్కౌంట్' ఆఫర్ల హడావుడి మొదలవుతుంది. కంటికి ఇంపుగా కనిపించే రంగురంగుల ప్రకటనలు, మెరిసే ఫ్లెక్సీలు వినియోగదారులను ఆకర్షిస్తుంటాయి. హాయిగా నవ్వుకోవడానికి ఒక చమత్కారంగా మొదలైన ఈ డిస్కౌంట్ ముచ్చట, కాస్త లోతుగా పరిశీలిస్తే వ్యాపార ప్రపంచంలోని రకరకాల గారడీలను, మోసాలను, కొన్ని నిజమైన వెసులుబాట్లను, చివరకు భారీ ఆర్థిక సూత్రాలను కళ్లకు కట్టే ఒక "వాస్తవాల పూలదండ"లా మారుతుంది. రూ. 10 సాక్స్ వ్యాపారం నుండి రూ. కోట్లలో సాగే రియల్ ఎస్టేట్ రంగానికి ఈ డిస్కౌంట్ సూత్రం ఎలా వర్తిస్తుందో తెలిపే కొన్ని ప్రత్యక్ష అనుభవాలు ఇవి:

**బోర్డుల ఆకర్షణ... తీరా వెళ్తే ఏమీ లేదు!**
మియాపూర్ దాటిన తర్వాత ఒక పెద్ద బట్టల షాపు ముందు భారీ డిస్కౌంట్ బోర్డు మెరుస్తూ కనిపించింది. లోపలికి వెళ్లి బట్టలు ఎంపిక చేసుకున్నాక చూస్తే... "వీటికి డిస్కౌంట్ లేదు సార్! ఆ మూలన ఉన్న టేబుల్ మీద పరిచిన వాటికే ఆఫర్" అని షాపు సిబ్బంది చెప్పారు. తీరా ఆ టేబుల్ వద్దకు వెళ్లి చూస్తే చిరిగినవి, పాతబడిపోయినట్లున్న బట్టలు పడేసి ఉన్నాయి. కస్టమర్లను షాపు గడప తొక్కిస్తే చాలు అనుకునే ఇలాంటి వ్యాపారులు, ఒక్కసారి మోసపోయిన వినియోగదారుడు జీవితంలో మళ్లీ ఆ వైపు చూడడనే సత్యాన్ని మర్చిపోతుంటారు.
మరోచోట డిస్కౌంట్ పేరిట పెట్టిన బట్టలపై పాత ధరల స్టిక్కర్లను తీసివేసి, ఎక్కువ ధరలు ముద్రించిన కొత్త స్టిక్కర్లను అంటించి ఆఫర్లు ఇస్తున్నట్లు బురిడీ కొట్టించే దందాలూ ఉన్నాయి.

**లోపల దాచే సరుకు - డిస్ప్లే మార్చే తంత్రం**
హిమాయత్ నగర్‌లోని ఒక ప్రముఖ చెప్పుల షాపు రేపటి నుండి డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. "రేపు ఎలాగూ ఆఫర్ ఉంది కదా, ఈరోజే నచ్చినవి ఎంపిక చేసుకుంటే రేపు వచ్చి తేలికగా తీసుకెళ్లవచ్చు" అని భావించి లోపలికి వెళ్లి కొన్ని చెప్పులు సెలెక్ట్ చేసుకున్నాం. "రేపు ఆఫర్‌లో వీటిని తీసుకుంటాం" అని చెబితే... "సార్, డిస్కౌంట్ ఇచ్చేవి ఇవి కాదు! అదిగో ఆ డబ్బాలో ఉన్న పాత సరుకు. ఈ రాత్రికి రాత్రే ఈ మంచి సరుకును లోపల పెట్టేసి, ఆ డబ్బాలోని అమ్ముడుపోని, లోపాలున్న సరుకును డిస్ప్లేలో పెడతాం" అని నిస్సిగ్గుగా చెప్పారు. అంటే ఆఫర్ల పేరిట వచ్చేది చాలావరకు చెత్తేనని అర్థమైంది!

**వీధి మోసాలు - విప్పి చూడనివ్వరు!**
ఢిల్లీలోని లాల్ ఖిలా, చాందినీ చౌక్ వీధుల్లో వంద రూపాయల లోపే కొత్త షర్టులు దొరుకుతుంటాయి. అక్కడ వేరే రకం చమత్కార మోసాలుంటాయి. పది రూపాయలకే రెండు లేదా నాలుగు జతల సాక్స్ అని అమ్ముతారు. కానీ ఇంటికి వచ్చి చూస్తే ఒక్కటీ కాళ్లకు తొడుక్కోవడానికి పనికిరాదు. అక్కడ విప్పి చూడడానికి అస్సలు ఒప్పుకోరు. ఇక పాత కోట్లను రంగులు మార్చి, కొత్త కోట్లని నమ్మించి అమ్మడం మరో విచిత్రం. (ఈ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకునే రాజయ్య గారు 'లండన్ కోటు' అనే కథ రాశారు. ఆ కథల సంపుటికి నేను ముందుమాట రాయడం ఒక జ్ఞాపకం).

**వినూత్న ప్రయోగాలు - నిజమైన తక్కువ ధరలు**
అన్ని చోట్లా మోసాలే ఉంటాయనుకుంటే పొరపాటే. వినియోగదారులకు నిజంగానే కలిసివచ్చే వినూత్న వ్యాపార నమూనాలూ ఉన్నాయి.
**కిలోల లెక్కన చీరలు:** దిల్‌సుఖ్‌నగర్‌లో చీరలు, డ్రెస్సులను కిలోల లెక్కన తూకం వేసి డిస్కౌంట్ ధరలకు అమ్మడం ఒక సంతోషకరమైన అనుభవం. అక్కడ మంచివి సెలెక్ట్ చేసుకోవడానికి మహిళలు పెద్ద ఎత్తున గుమిగూడుతుంటారు.
**స్పష్టమైన వర్గీకరణ:** నాంపల్లి తాజ్ మహల్ హోటల్ పక్కనున్న రెడీమేడ్ షాపులో ఎప్పుడూ ఒక డిస్కౌంట్ సెక్షన్ ఉంటుంది. నాంపల్లి తరిమాయి షాపుల్లో ప్రీమియం ధరల బట్టలు ఒకవైపు, అందరికీ అందుబాటులో ఉండే పాపులర్ ధరల బట్టలు మరోవైపు వర్గీకరించి పారదర్శకంగా అమ్ముతుంటారు.
**దశాబ్దాల నమ్మకం:** కాచిగూడ చౌరస్తా నుండి రైల్వే స్టేషన్ వెళ్లే తోవలో ఉన్న 'కుమార్స్' రెడీమేడ్ షాపు దశాబ్దాలుగా రూ. 200 లకే షర్ట్, ప్యాంట్ అందిస్తూ ఎంతోమంది పేద, మధ్యతరగతి కాలేజీ విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది.

**ప్రచురణ రంగంలో 'నష్టాల' డిస్కౌంట్**
ఈ మధ్య ఒక సుప్రసిద్ధ రచయిత తన పెద్ద కథల సంపుటిపై ఏకంగా 75 శాతం డిస్కౌంట్ ప్రకటించారు. ప్రచురణ సంస్థలు లేదా రచయితలు తమ దగ్గర నిల్వ ఉండిపోయిన స్టాక్‌ను వదిలించుకోవడానికి, ఆర్థిక నష్టాన్ని భరిస్తూనే ఇలాంటి భారీ ఆఫర్లు ఇస్తుంటారు. వ్యాపారపరంగా ఇది నష్టమే అయినప్పటికీ, పుస్తక ప్రియులకు మంచి సాహిత్యం చౌకగా లభించడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి.
డిస్కౌంట్ల వెనుక ఉన్న అతిపెద్ద ఆర్థిక తత్వాన్ని 2008-2010 నాటి హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనంలో చూడవచ్చు. ఆ సమయంలో చదరపు అడుగు రూ. 2,500 నుండి రూ. 4,500 వరకు ఉన్న అపార్ట్‌మెంట్లలో మిగిలిపోయిన ఫ్లాట్లను బిల్డర్లు 40 నుండి 50 శాతం డిస్కౌంట్‌తో అమ్మకానికి పెట్టారు.
"ఆఫీసు కిరాయిలు, సిబ్బంది జీతాలు, నెలవారీ ఖర్చులు తట్టుకుని కొత్త వెంచర్లు ప్రారంభించాలంటే... మిగిలిపోయిన అపార్ట్‌మెంట్లతో 'డెడ్ క్యాపిటల్' (స్తంభించిన మూలధనం)గా మారిన నిధులను నష్టానికైనా సరే 'వర్కింగ్ క్యాపిటల్' (నిర్వహణ మూలధనం)గా మార్చుకోక తప్పదు" అని దెవలపర్లు స్పష్టంగా చెప్పారు. అయితే, ఆ సమయంలో "ధరలు ఇంకా దిగివస్తాయి" అని భావించిన చాలామంది కొనుగోలుదారులు నిర్ణయం తీసుకోలేకపోయారు. ఆ తర్వాత కాలంలో సీన్ తలకిందులైంది. అప్పట్లో రూ. 23 లక్షలకు ఇస్తామన్నా కొనని 2000 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్ ధర నేడు రూ. రెండు కోట్లకు పైగా పలుకుతోంది! అపుడే కొని వుంటే 16 సంవత్సరాలకు నెలకు 50 వేల కిరాయ చొప్పున ఏడాదికి 6 లక్షలు, పదేళ్లకు 60 లక్షలు, ఆరేళ్లకు మూడు లక్షలు కలిసి మొత్తం 90 లక్షల కిరాయ . అందులో సగం 25 వేలు టఅనుకున్నా 45 లక్షల కిరాయ నష్టం, ఇపుడు 2 కోట్లకు కొనాల్సి రావడం చూస్తే సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఎంత అవసరమో తెలుస్తుంది. ఆ సమయంలో 1100 రూపాయలకు గజం ఉన్న ప్లాట్ ఇపుడు 50 వేలకు గజం అయింది. యువతరం కొత్త ఉద్యోగుల పై ఎంత భారం పెరిగిందో ! మొదట కొన్న వాళ్లకు అంత లాభం వచ్చింది.

**ఫోన్లు కార్లు టీవీలు ఆఫర్లు**
సెల్ ఫోన్ల ముచ్చటైతే వెయ్యి రూపాయల ఫోన్ పోయి స్మార్ట్ ఫోన్లు అంటూ మూడు లక్షల రూపాయలు. దానిమీద లోన్ల ఆఫర్, నగదు ఆఫర్ అని ప్రకటనలు. కార్లలో రకరకాల కొత్త కార్లు. ఉన్నవారు అమ్మలి, కొత్తవారు కొనాలి అని ఈ యం ఐ వివరాలతో సహా ఆఫర్లు. షాపింగ్ మాల్ లోని చిన్న చెప్పుల షాపు నుండి మొదలైన 'డిస్కౌంట్' ముచ్చట... శ్రామికుల కష్టం, మార్కెట్ మోసాలు, వ్యాపార వ్యూహాలు దాటుకుని, చివరకు రియల్ ఎస్టేట్ డెడ్ క్యాపిటల్ వ్యాపార సూత్రాల వరకు సాగుతుంది. పండగ పూట ఆఫర్ల వెనుక ఉన్న ఈ 'వాస్తవాల పూలదండ'ను గ్రహించి అడుగు వేయడమే వినియోగదారునికి అసలైన పండగ!



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# ఉద్వేగం కాదు.. క్రూరత్వపు వ్యవస్థ



చిన్నారులపై లైంగిక దాడులు, ఆ తర్వాత జరిగే హత్యలను కేవలం క్షణిక ఉద్వేగానికి ఆపాదించడం నేర తీవ్రతను తగ్గించి చూపడమే. ఒక చిన్నారి భయాన్ని, బాధను పట్టించుకోకుండా తన కోరికను తీర్చుకోవడం, నేరం బయటపడుతుందనే భయంతో ఆమె ప్రాణాలను హరించడం, సాక్ష్యాలను చెరిపివేయడానికి మరో నేరానికి పాల్పడ డం ఇవన్నీ క్షణికావేశంతో మాత్రమే వివరించలేం. వీటి వెనుక బాధితులను మనుషులుగా గుర్తించని వికృత మనస్తత్వం, ఆధిపత్య భావన, నైతిక పతనం, నేరాన్ని నిరోధించడంలో వ్యవస్థల వైఫల్యాలు ఉండవచ్చు. అందుకే చిన్నారులపై లైంగిక హింసను కేవలం పోలీసు, న్యాయస్థానాల సమస్యగా కాకుండా సమాజపు మానవత్వానికి ఎదురైన తీవ్రమైన పరీక్షగా చూడాలి.
ప్రతి దారుణం తర్వాత దేశంలో ఆగ్రహం వ్యక్తమవుతుంది. కొవ్వొత్తుల ప్రదర్శనలు జరుగుతాయి. నిందితులను ఉరి తీయాలనే డిమాండ్లు వినిపిస్తాయి. రాజకీయ నాయకులు ప్రకటనలు చేస్తారు. వార్తా మాధ్యమాలు కొన్నిరోజులపాటు సంఘటనను ప్రధానాంశంగా చూపిస్తాయి. ఆ తర్వాత మరో ఘటన జరిగే వరకు ప్రజా చర్చ చల్లారిపోతుంది. కానీ అసలు ప్రశ్న మిగిలిపోతుంది: నేరం జరిగిన తర్వాత శిక్ష గురించి మాట్లాడుతున్నాం; నేరం జరగకుండా నిరోధించడానికి ఏం చేస్తున్నాం? బాధిత కుటుంబానికి న్యాయం చేయడం ఎంత ముఖ్యమో, మరో చిన్నారి ఇలాంటి హింసకు గురికాకుండా వ్యవస్థలను నిర్మించడం కూడా అంతే ముఖ్యం.
జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) తాజా క్రైమ్ ఇన్ ఇండియా-2023 నివేదికలో నమోదైన వివరాలు పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నాయి. 2023లో దేశ వ్యాప్తంగా పిల్లలపై 1,77,335 నేరాల కేసులు నమోదయ్యాయి. 2022లో నమోదైన 1,62,449 కేసులతో పోలిస్తే ఇది 9.2 శాతం పెరుగుదల. 2023లో పిల్లల అపహరణ, కిడ్నాప్‌కు సంబంధించినవి 79,884 కేసులు కాగా, పిల్లలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) కింద 67,694 కేసులు నమోదయ్యాయి. మొత్తం పిల్లలపై నేరాల్లో పోక్సో కేసుల వాటా 38.2 శాతం. ఒక కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారునికి ఈ పోక్సో కేసులో అరెస్టు అయినా కొద్ది కాలానికే బేయిల్ దొరికింది.ఇది అందరికీ సాధ్యమా. ఆ పిల్ల మీద,వారి తల్లితండ్రులు మీద ఈ బేయిల్ ప్రభావం ఎలా ఉంటుందో కోర్టు ఆలోచించి లేదా!?, పిల్లల జనాభాలో ప్రతి లక్ష మందికి నమోదైన నేరాల రేటు 2022లో 36.6 ఉండగా, 2023లో 39.9కి పెరిగింది.
ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కావు; రక్షణ కోసం పెద్దలను, కుటుంబాన్ని, సమాజాన్ని నమ్మే పిల్లల భద్రతపై తీవ్రమైన హెచ్చరికలు. అయితే నమోదైన కేసుల పెరుగుదల ఒక్కటే వాస్తవ నేరాలు అదే స్థాయిలో పెరిగాయని నిరూపించదు. అవగాహన పెరగడం, బాధితులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం, పోలీసుల కేసుల నమోదు విధానాల్లో మార్పులు కూడా సంఖ్యలను ప్రభావితం చేయవచ్చు.
మరోవైపు భయం, కుటుంబ ఒత్తిడి, పరువు పోతుందనే ఆందోళన, నిందితుల బెదిరింపుల వల్ల బయటపడని ఘటనలు ఉండవచ్చు. అందువల్ల నమోదైన గణాంకాలను సమస్యకు పూర్తి కొలమానంగా చూడకూడదు.
లైంగిక నేరాలన్నింటినీ ఒకే మానసిక కారణంతో వివరించడం కూడా శాస్త్రీయంగా సరైంది కాదు. ప్రతి నేరస్థుడూ ఒకే రకమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉండడు. ఇతరుల బాధను పట్టించుకోకపోవడం, బలహీనులపై ఆధిపత్యం చెలాయించాలనే ధోరణి, హింసాత్మక ప్రవర్తన, తనకు శిక్ష పడదనే నమ్మకం వంటి అంశాలు కొన్ని ఘటనల్లో పాత్ర పోషించవచ్చు. కానీ మానసిక సమస్యలు ఉన్నవారందరినీ నేరస్థులుగా చూడటం తప్పు. అలాగే నేరస్థుడి చర్యలను కేవలం మానసిక వికృతిగా పేర్కొని అతని బాధ్యతను తగ్గించలేం. నేరానికి కారణాలను అర్థం చేసుకోవడం, నేరానికి బాధ్యత వహింపజేయడం రెండూ అవసరమే.
మరో ప్రమాదకరమైన అపోహ ఏమిటంటే, నేరస్థుడు ఎప్పుడూ అపరిచితుడే అయి ఉంటాడని భావించడం. పిల్లలకు తెలిసిన వ్యక్తులు, కుటుంబ పరిచయస్తులు, పొరుగువారు లేదా నమ్మకమైన స్థానాల్లో ఉన్నవారు కూడా తమ పరిచయాన్ని దుర్వినియోగం చేయవచ్చు. ఎన్‌సీఆర్‌బీ నివేదికల్లో పోక్సో చట్టంలోని సంబంధిత నేరాలకు సంబంధించి నిందితులకు, బాధిత పిల్లలకు మధ్య ఉన్న సంబంధాల వివరాలను కూడా నమోదు చేస్తారు. అందువల్ల పిల్లల రక్షణను అపరిచితుల పట్ల జాగ్రత్తలకే పరిమితం చేయడం సరిపోదు. పరిచయస్తులైనా సరే, పిల్లల వ్యక్తిగత హద్దులను గౌరవించాలి. అనుచిత స్పర్శ, రహస్యంగా ఉంచాలని ఒత్తిడి చేయడం, బెదిరింపులు, అసౌకర్యం కలిగించే ప్రవర్తన గురించి పిల్లలకు అర్థమయ్యే భాషలో నేర్పాలి. వారు చెప్పినప్పుడు నిందించకుండా, శ్రద్ధగా విని, తక్షణ భద్రత కల్పించాలి. అయితే బాధ్యతను కుటుంబాలకే పరిమితం చేయడం అన్యాయం. పాఠశాలల్లో పిల్లల రక్షణకు స్పష్టమైన విధానాలు, సిబ్బందికి తగిన శిక్షణ, సురక్షిత ఫిర్యాదు వ్యవస్థలు, అవసరమైన నేపథ్య పరిశీలనలు ఉండాలి. పిల్లలకు అందుబాటులో ఉండే కౌన్సెలింగ్, నమ్మకమైన ఉపాధ్యాయులు, బాధితులకు వైద్య, మానసిక సహాయం అత్యవసరం. లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించే చట్టం (పోక్సో చట్టం) అమలులో ఫిర్యాదు స్వీకరణ నుంచి దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, విచారణ వరకు ప్రతి దశ బాధితుడి గౌరవాన్ని కాపాడాలి. బాధితురాలి దుస్తులు, ప్రవర్తన లేదా కుటుంబ నేపథ్యాన్ని ప్రశ్నించడం నేరానికి బాధ్యతను బాధితురాలిపైకి నెట్టడమే.
చట్టాలు ఉన్నాయంటే న్యాయం అందుతున్నట్టేనా? ఇక్కడే న్యాయవ్యవస్థ పనితీరును ప్రశ్నించాల్సి వస్తుంది. కేంద్ర న్యాయశాఖ 2026 ఫిబ్రవరిలో పార్లమెంటుకు సమర్పించిన సమాచార ప్రకారం, తెలంగాణలో 2023 సంవత్సరానికి పోక్సో కేసుల్లో దోష నిర్ధారణ రేటు కేవలం 10.23 శాతం. అదే ఏడాది రాష్ట్రంలో పిల్లలపై నమోదైన మొత్తం నేరాల్లో దోష నిర్ధారణ రేటు 20.61 శాతంగా ఉంది. దోష నిర్ధారణ రేటు తక్కువగా ఉండటానికి ప్రతి సందర్భంలో ఒకే కారణం ఉండదు; కేసుల స్వభావం, సాక్ష్యాలు, దర్యాప్తు నాణ్యత, విచారణ ప్రక్రియ ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ ఈ గణాంకం దర్యాప్తు, సాక్షుల రక్షణ, న్యాయ సహాయం, విచారణ నాణ్యతపై తీవ్రమైన సమీక్ష అవసరాన్ని సూచిస్తుంది.
దేశవ్యాప్తంగా అత్యాచారం, పోక్సో కేసుల సత్వర విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసినప్పటికీ పెండింగ్ కేసుల సమస్య కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వ పార్లమెంటరీ సమాధానం ప్రకారం, 2025 డిసెంబరు 31 నాటికి దేశంలో 774 ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానాలు పనిచేస్తుండగా, వాటిలో 398 ప్రత్యేక పోక్సో కోర్టులు ఉన్నాయి. ఆ తేదీ నాటికి పోక్సో నేరాలకు సంబంధించిన 2,24,572 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టుల ఏర్పాటు మాత్రమే సరిపోదు; న్యాయమూర్తులు, న్యాయ సహాయక సిబ్బంది, ఫోరెన్సిక్ సదుపాయాలు, శిక్షణ పొందిన దర్యాప్తు అధికారులు, సాక్షుల రక్షణకు అవసరమైన వనరులు కూడా సమకూరాలి. ఆలస్యమైన న్యాయం బాధిత కుటుంబాల బాధను మరింత పెంచుతుంది.
కఠిన శిక్షలు అవసరమే. కానీ శిక్ష తీవ్రత ఒక్కటే నేరాలను అరికడుతుందని భావించడం సరైంది కాదు. ఫిర్యాదు వెంటనే స్వీకరించడం, శాస్త్రీయంగా సాక్ష్యాలు సేకరించడం, నిందితులపై నిష్పక్షపాత దర్యాప్తు, కేసుల వేగవంతమైన విచారణ, బాధితులకు నిరంతర సహాయం మరింత కీలకం. అదే సమయంలో, న్యాయస్థానం తీర్పు వెలువడకముందే వ్యక్తులను దోషులుగా ప్రకటించడం, బాధితుల గుర్తింపును బయటపెట్టడం నివారించాలి. న్యాయం అంటే ఆగ్రహానికి ప్రతీకారం తీర్చుకోవడం కాదు; నేరాన్ని నిరూపించి, చట్టబద్ధంగా బాధ్యులను శిక్షించడం.
చిన్నారులపై లైంగిక హింసను అరికట్టాలంటే ఆధిపత్యాన్ని పురుషత్వంగా భావించే సంస్కృతిని, సమ్మతి పట్ల నిర్లక్ష్యాన్ని, బలహీనులపై అధికారం చెలాయించే ధోరణిని ప్రశ్నించాలి. ఇంట్లో, పాఠశాలలో, మీడియాలో సమానత్వం, గౌరవం, వ్యక్తిగత హద్దులు, బాధ్యత గురించి చర్చ జరగాలి. ఏ ఒక్క అంశాన్నీ అన్ని నేరాలకు ఏకైక కారణంగా ప్రకటించకుండా, ప్రతి ఘటనలోని వాస్తవాలను ఆధారాలతో విశ్లేషించాలి. ఒక చిన్నారి తనకు తెలిసిన మనిషిని చూసి భయపడాల్సిన సమాజం నాగరిక సమాజం కాదు. పిల్లల భద్రతను కొవ్వొత్తుల ర్యాలీలకు, ఆవేశపూరిత ప్రకటనలకు, మరణశిక్ష డిమాండ్లకు పరిమితం చేయలేం. నేరం జరిగిన తర్వాత కన్నీళ్లు పెట్టుకోవడం కన్నా, నేరం జరగడానికి వీలులేని వాతావరణాన్ని నిర్మించడం గొప్ప బాధ్యత. పిల్లల మాట వినే కుటుంబాలు, బాధ్యతాయుతమైన విద్యాసంస్థలు, జవాబుదారీ పోలీసులు, సమర్థవంతమైన న్యాయస్థానాలు కలిసినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. ఒక చిన్నారి ప్రాణం, గౌరవం, భద్రత కంటే ఏ వ్యక్తి కోరికా, ప్రతిష్ఠా పెద్దవి కావు. ఈ సత్యాన్ని చట్టం మాత్రమే కాదు, సమాజపు సామూహిక అంతరాత్మ కూడా అంగీకరించినప్పుడే నిజమైన నాగరికత సాధ్యమవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## దైవాంశ సంభూతులం!

వేలసంవత్సరాలుమేము
అద్భుతంగా నడిపించాం!
ఎవడిని ఎక్కడుంచాలో
అక్కడనిలబెట్టగలిగాం!
ఈ దేశంపేరేహిందూదేశం!
మధ్యలో ఏం జరిగింది?
మాకేం సంబంధం లేదు!
మహమ్మదీయులొచ్చారు
బ్రిటిష్ వాళ్ళొచ్చారు!
ఎవరెవరో వచ్చారు!
మీరుపెట్టుకున్న'రాజ్యాంగం'
మాకేవిటి సంబంధం! మీ
ప్రజాస్వామ్యాన్నేమేము
ఎప్పుడూ ఒప్పుకోలేదు !
ఎప్పటికీ ఒప్పుకోంకూడా!
మా'బ్రహ్మతల'లే కొందరు
మాకువ్యతిరేకులయ్యారు
వాళ్ళకు డెమోక్రసీ పిచ్చి!
విప్లవాలంటారుకూడా !
వాళ్ళనుమొత్తంలేపేస్తాం!
గుంటకాడ నక్కల్లాగా
ఎన్నాళ్ళు వేచి ఉన్నాం!
ఎంత ఓపిక పట్టాం!
మాచేతికొచ్చిపన్నెండేళ్లు!
మళ్ళీమనుస్మృతితెస్తాం!
మాదిబహిరంగరహస్యమే
జ్ఞానేశ్ నుతప్పించటానికా
లేనిహక్కులుకల్పించింది?
జుంవీ ల దగా మాదే!
SIR పెట్టిందీ మాకోసమే!
రాజులు,రాజగురువులు
దండ కమండలాలు
తపస్సులు మంత్రాలు
పాంకోళ్ల ముల్లోకాలు
నాలుగుపాదాలధర్మాలు
బాల్యవివాహాలు
సతీ సహగమనాలు
తెల్లచీరలుశిరోముండనాలు
కల్పవృక్షాలు కామధేనువులు

మిగితా తరువాయి సంచికలో..

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# సమాచారమే శక్తి.. పారదర్శకతే ప్రజాస్వామ్యానికి పునాది!

సమాచార కమిషన్లలో ఖాళీలు, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, ప్రజల్లో తగిన అవగాహన లేకపోవడం కూడా చట్టం ఆశించిన ఫలితాలను సాధించడంలో అడ్డంకులుగా మారవచ్చు.
అదే సమయంలో సమాచార హక్కును వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి లేదా ఇతరులను వేధించడానికి కాకుండా ప్రజా ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యతాయుతమైన సాధనంగా వినియోగించుకోవాలి. చట్టంలోని మినహాయింపులకు లోబడి మాత్రమే సమాచారం లభిస్తుంది. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రత, చట్టం ద్వారా రక్షించబడిన కొన్ని రకాల సమాచారం వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. కాబట్టి ప్రతి దరఖాస్తులో స్పష్టమైన ప్రశ్నలు అడగడం, అందుబాటులో ఉన్న రికార్డులను గుర్తించడం, అవసరమైన పత్రాల ప్రతులను కోరడం, నిర్దేశిత విధానాలను అనుసరించడం ద్వారా సమాచారాన్ని సమర్థవంతంగా పొందవచ్చు.

**సమాచారమే శక్తి.. పారదర్శకతే ప్రజాస్వామ్యానికి పునాది!**
ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికల్లో ఓటు వేయడం మాత్రమే కాదు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఎలా పనిచేస్తున్నారు? ప్రభుత్వ నిధులు ఎలా ఖర్చవుతున్నాయి? సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా? ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారు? వంటి అంశాలను తెలుసుకోవడం, ప్రశ్నించడం, అవసరమైనప్పుడు చట్టబద్ధంగా జవాబుదారీతనాన్ని కోరడం కూడా ప్రజాస్వామ్యంలో పౌరుల బాధ్యత. సమాచార హక్కు చట్టం ఈ బాధ్యతను నెరవేర్చడానికి ప్రజలకు ఒక బలమైన మార్గాన్ని అందించింది.
ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెరిగినప్పుడు అవినీతికి అవకాశాలు తగ్గుతాయి. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉన్నప్పుడు పథకాల అమలుపై సామాజిక పర్యవేక్షణ పెరుగుతుంది. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకున్నప్పుడు పాలకులు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల సమాచార హక్కు చట్టం కేవలం దరఖాస్తులు పెట్టుకునే ప్రక్రియ కాదు; ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే వ్యవస్థాగత సాధనం.
ముగింపుగా చెప్పాలంటే, సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుడి చేతిలో ఉన్న ప్రజాస్వామ్య వజ్రాయుధం. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, ప్రజాధనం వినియోగంపై వివరాలు తెలుసుకునే అవకాశం, పాలనలో పారదర్శకతను కోరే శక్తి ఈ చట్టం ద్వారా ప్రజలకు లభించాయి. అయితే చట్టం సమర్థవంతంగా పనిచేయాలంటే ప్రభుత్వ శాఖలు సమాచారాన్ని సకాలంలో అందించాలి, సమాచార కమిషన్లు స్వతంత్రంగా పనిచేయాలి, పౌరులకు చట్టంపై అవగాహన కల్పించాలి. సమాచారాన్ని కోరే పౌరుడిని ఇబ్బందిపెట్టే వ్యక్తిగా కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే భాగస్వామిగా చూడాలి. ప్రశ్నించే పౌరుడే చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలకు సమాచారం అందినప్పుడే పాలనపై నమ్మకం పెరుగుతుంది; పారదర్శకత పెరిగినప్పుడే అవినీతిపై పోరాటం బలపడుతుంది. అందుకే సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా.
ఒక్క మాటలో చెప్పాలంటే, సమాచార హక్కు చట్టం--2005 భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కీలకమైన మైలురాయి. ప్రజలే పాలకులని చెప్పే ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రభుత్వ పనితీరును తెలుసుకునే హక్కు పౌరులకు ఉండటం అత్యంత అవసరం. ప్రభుత్వ కార్యాలయాల్లో దశాబ్దాలుగా కొనసాగిన గోప్యతా విధానాలకు అడ్డుకట్ట వేస్తూ, పాలకులను, అధికారులను ప్రశ్నించే శక్తిని ఈ చట్టం సామాన్య ప్రజలకు అందించింది. పేదవాడు, కూలీ, రైతు, విద్యార్థి, నిరుద్యోగి, సామాజిక కార్యకర్త, పాత్రికేయుడు అనే తేడా లేకుండా ప్రతి భారతీయ పౌరుడికి ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని చట్టబద్ధంగా కోరే అవకాశం కల్పించింది. ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది? సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయా? అభివృద్ధి పనులు నాణ్యతతో జరుగుతున్నాయా? ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవడానికి ఈ చట్టం ఒక శక్తివంతమైన సాధనంగా నిలుస్తోంది.
సమాచార హక్కు చట్టం అసలైన విజయం కేవలం దరఖాస్తుల సంఖ్యలోనో, అందించిన సమాచారంలోనో లేదు. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను ప్రోత్సహించడం, అవినీతిని ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించడం ఈ చట్టం సాధించిన ముఖ్యమైన మార్పులు. ఒక గ్రామపంచాయతీలో జరిగిన అభివృద్ధి పనుల వివరాల నుంచి ప్రభుత్వ శాఖల్లో నిధుల వినియోగం వరకు అనేక అంశాలను ప్రజలు పరిశీలించగలగడం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది. అయితే సమాచారం బయటపడినంత మాత్రాన అవినీతి పూర్తిగా నిర్మూలించబడదు. వెలుగులోకి వచ్చిన అక్రమాలపై సమగ్ర విచారణ జరగాలి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, బాధితులకు న్యాయం అందాలి. అప్పుడే సమాచార హక్కు చట్టం ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి.
ఈ చట్టం అమలులో ఉన్న సమస్యలను కూడా ప్రభుత్వం గుర్తించాలి. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయడం, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించడం, ప్రజా సమాచార అధికారులకు తగిన శిక్షణ ఇవ్వడం, ప్రభుత్వ రికార్డులను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచడం వంటి చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, నిరక్షరాస్యులు, అణగారిన వర్గాలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించాలి. దరఖాస్తు ఎలా రాయాలి? ఎవరికి సమర్పించాలి? సమాచారం అందకపోతే ఎక్కడ అప్పీలు చేయాలి? అనే విషయాలను సులభమైన భాషలో వివరించాలి. ప్రభుత్వ శాఖలు తరచుగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ముందుగానే ప్రజలకు అందుబాటులో ఉంచితే దరఖాస్తుల అవసరం తగ్గడంతోపాటు పాలన మరింత పారదర్శకంగా మారుతుంది.
ప్రజలు కూడా ఈ హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలి. వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి కాకుండా ప్రజా ప్రయోజనాలను కాపాడటానికి, ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి, అర్హులకు న్యాయం జరిగేలా చూడటానికి సమాచారాన్ని ఉపయోగించాలి. ప్రజాస్వామ్యంలో పౌరుడి బాధ్యత ఓటు వేయడంతో ముగిసిపోదు. ప్రజాప్రతినిధుల పనితీరును పరిశీలించడం, ప్రభుత్వ విధానాలను అర్థం చేసుకోవడం, ప్రజాధనం వినియోగంపై అవగాహన పెంచుకోవడం, అక్రమాలు కనిపిస్తే చట్టబద్ధంగా ప్రశ్నించడం కూడా పౌరుడి బాధ్యతలే.



అంతిమంగా, సమాచారమే శక్తి, పారదర్శకతే సుపరిపాలనకు పునాది. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉన్నప్పుడే అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించగలుగుతారు. ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యంపై విశ్వాసం బలపడుతుంది. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలోని ఒక దరఖాస్తును ప్రజాస్వామ్య పరిరక్షణ సాధనంగా మార్చింది. అందువల్ల ఈ చట్టాన్ని కాపాడటం, దాని అమలును బలోపేతం చేయడం, ప్రతి పౌరుడికి దానిపై అవగాహన కల్పించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజలు ప్రశ్నిస్తే పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది; సమాచారం వెలుగులోకి వస్తే అక్రమాలను గుర్తించే అవకాశం ఏర్పడుతుంది; పారదర్శకత పెరిగితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ప్రశ్నించే పౌరుడే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం; సమాచార హక్కును సద్వినియోగం చేసుకునే సమాజమే అవినీతిరహిత, బాధ్యతాయుత పాలనకు మార్గదర్శకం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు కడితే క్రిమినల్ కేసులు



**శామీర్‌పేట్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** శామీర్ పేట్ తహసీల్దార్ ఆదేశాలతో మంగళ వారం రోజు శామీర్ పేట్ గ్రామంలో గల సర్వే నెం 1266 లో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ కట్ట డాలకు పాల్పడుతున్నారని తెలిసిన వెంటనే మండల గిర్దావర్ భాను చందర్, గ్రామపాలన ఆఫీసర్ శ్రీనివాస్ లు ఘటన స్థలానికి చేరుకొని అక్కడ పెట్టిన పునాది రాళ్లను తీసి వేసి అక్కడ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు . ప్రభుత్వ స్థలములో అక్రమ కట్టడాలు చేపడితే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని మండల గిర్దావర్ కోట భాను చందర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలన ఆఫీసర్ శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల సాకారం



**కల్వకుర్తి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ మార్చాల గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన 18 నూతన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని, నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులను అభినందించారు. అంతకుముందు కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన మేదర మహేంద్ర సంఘం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మార్చాల గ్రామానికి చేరుకుని ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారితో చర్చించారు. గ్రామ అభివృద్ధికిసంబంధించిన పలు అంశాలపైనాయకులు,కార్యకర్తలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైజ్ఞానిక శ్రేష్ఠతకు ప్రతీకగా సిఎస్ఐఆర్

- ఎన్‌జీఆర్ఐ 66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు
- సుదీర్ఘ సేవలందించిన ఉద్యోగులకు సత్కారం
- మహిళా శాస్త్రవేత్తల పరిశోధనా కృషిపై ప్రత్యేక సంకలనం విడుదల

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** దేశంలో భూభౌతిక పరిశోధనలకు విశేష సేవలందిస్తున్న హైదరాబాద్‌లోని సిఎస్ఐఆర్--జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ) 66వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించింది. వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధన మండలి (సిఎస్ఐఆర్) 85వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలతో కలిపి ఆదివారం, అక్టోబర్ 11, 2026న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ సాధించిన శాస్త్రీయ విజయాలు, పరిశోధనా రంగంలో చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భవిష్యత్తు పరిశోధనా ప్రణాళికలను ఈ సందర్భంగా వివరించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, పరిపాలనా సిబ్బంది సేవలను గుర్తిస్తూ వారి కృషిని అభినందించారు. భూగర్భ నిర్మాణాల అధ్యయనం నుంచి ప్రకృతి వైపరీత్యాల అంచనా వరకు, కీలక ఖనిజాల అన్వేషణ నుంచి ఇంధన వనరుల పరిశోధన వరకు ఎన్‌జీఆర్ఐ నిర్వహిస్తున్న కార్యక్రమాలు దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భూమి అంతర్భాగంలో జరిగే మార్పులను శాస్త్రీయంగా అధ్యయనం చేయడం, భూగర్భ వనరుల స్వభావాన్ని గుర్తించడం, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలను అర్థం చేసుకోవడం వంటి అంశాల్లో భూభౌతిక పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని వివరించారు.

### పరిశోధనలకు కొత్త దిశానిర్దేశం

సంస్థ సంచాలకులు డాక్టర్ ప్రకాష్ కుమార్ నాయకత్వంలో ఎన్‌జీఆర్ఐ పరిశోధనా సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు సాగుతోంది. పరిశోధనలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని విస్తరించడం, జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై పరిశోధనలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో సంస్థ పనిచేస్తోందని వివరించారు.

ప్రస్తుత కాలంలో దేశం ఎదుర్కొంటున్న పర్యావరణ, ఇంధన, వాతావరణ సంబంధిత సవాళ్లను పరిష్కరించడంలో శాస్త్రీయ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాల అంచనా, కీలక ఖనిజాల గుర్తింపు, భూఉష్ణ శక్తి వనరుల అన్వేషణ, కార్బన్ సంగ్రహణ, వినియోగం, నిల్వ వంటి అభివృద్ధి చెందుతున్న పరిశోధనా రంగాలపై ఎన్‌జీఆర్ఐ ప్రత్యేక దృష్టి సారించింది. పరిశోధనల ద్వారా లభించే శాస్త్రీయ సమాచారాన్ని ఆచరణలో వినియోగించడం, దేశ ఇంధన భద్రతకు తోడ్పడడం, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే పరిష్కారాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

భూగర్భ నిర్మాణాలు, ఖనిజ వనరులు, భూమి అంతర్భాగంలో జరిగే భౌగోళిక పరిణామాలపై పరిశోధనలు దేశానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడతాయని తెలిపారు. అదే సమయంలో వాతావరణ మార్పుల ప్రభావాలను అర్థం చేసుకోవడానికి భూమి గత చరిత్రపై పరిశోధనలు చేయడం కూడా ఎంతో అవసరమని శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు.

### వాతావరణ పరిశోధనల్లో పరోక్ష సూచికల ప్రాధాన్యత

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఎమెరిటస్ అనిల్ కుమార్ గుప్తా, 'వాతావరణ పరిశోధనల్లో పరోక్ష సూచికలు' అనే అంశంపై వ్యవస్థాపక దినోత్సవ ఉపన్యాసం చేశారు. ముఖ్య అతిథిని సంస్థ సంచాలకులు డాక్టర్ ప్రకాష్ కుమార్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన గత మూడు సంవత్సరాల్లో సంస్థ సాధించిన పురోగతిని, పరిశోధనా రంగంలో చేపట్టిన ముఖ్యమైన కార్యక్రమాలను, భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు.



ప్రొఫెసర్ అనిల్ కుమార్ గుప్తా తన ఉపన్యాసంలో భూమి గత వాతావరణ పరిస్థితులను తెలుసుకోవడానికి ప్రకృతిలో లభించే సహజ ఆధారాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. సముద్ర అవక్షేపాలు, సరస్సుల అడుగుభాగంలో పేరుకుపోయిన నిక్షేపాలు, గుహల్లో ఏర్పడే ఖనిజ నిర్మాణాలు, చెట్ల వలయాలు, మంచు పొరల నమూనాలు వంటి ప్రకృతి భాండాగారాలు గత వాతావరణానికి సంబంధించిన విలువైన సమాచారాన్ని భద్రపరుస్తాయని పేర్కొన్నారు.

### 25 ఏళ్ల సేవలు పూర్తి చేసిన ఉద్యోగులకు గౌరవం

వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా సంస్థ అభివృద్ధికి దీర్ఘకాలంగా సేవలందించిన ఉద్యోగులను ప్రత్యేకంగా సత్కరించారు. సిఎస్ఐఆర్‌లో 25 సంవత్సరాల సేవాకాలాన్ని పూర్తి చేసుకున్న ఉద్యోగులతో పాటు గత ఏడాది పదవీ విరమణ పొందిన వారిని గుర్తించి గౌరవించారు. సంస్థ పరిశోధనా కార్యక్రమాల నిర్వహణ, సాంకేతిక కార్యకలాపాలు, పరిపాలనా వ్యవస్థ బలోపేతంలో ఉద్యోగులు అందించిన సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

## పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ వృద్ధాశ్రమ భూమి కబ్జా యత్నాలను వెంటనే అడ్డుకోవాలి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ దుండిగల్ సర్కిల్ 59 బౌరంపేట్ కమాన్ (గండి మైసమ్మ ప్రధాన రోడ్డు నుంచి బహదూర్ పల్లి చౌరస్తా కు వెళ్లే దారిలో (రైట్ సైడ్) సర్వే నంబర్ 259లో ఉన్న నాలుగు ఎకరాల పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ వృద్ధాశ్రమ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. మంగళవారం ఈ భూమిని సందర్శించడానికి వెళ్లిన ట్రస్ట్ నాయకులు, సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అనుచరులుగా పేర్కొంటున్న వ్యక్తులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. సుమారు 200 మందికి పైగా వ్యక్తులు భూమిలోకి ప్రవేశించి, కత్తులు, బీరు సీసాలు, రాళ్లు తదితర వస్తువులతో దాడికి పాల్పడ్డారని నాయకులు ఆరోపించారు. భూమి తమదేనని, ఎందుకు కబ్జా చేస్తున్నారని ప్రశ్నించిన సిపిఎం వారిపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయని, నలుగురు కార్యకర్తలు ఆసుపత్రిలో చేరారని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం వృద్ధాశ్రమాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసిందని సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు ఉపయోగపడాల్సిన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ భూమికి సంబంధించి జిల్లా రెవెన్యూ అధికారుల వద్ద విచారణ కొనసాగుతున్న సమయంలోనే, నకిలీ పత్రాలు, పాస్‌బుక్‌లను సృష్టించి భూమిని స్వాధీనం చేసుకునేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అనుచరులతో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారుల విచారణ పూర్తై, భూమి హక్కులపై స్పష్టత వచ్చే వరకు ఎలాంటి వివాదాస్పద చర్యలకు పాల్పడకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డి.జి. నరసింహారావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం తీవ్రంగా ఖండించారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేయనున్న వృద్ధాశ్రమ భూమిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. పేద ప్రజలకు ఉపయోగపడాల్సిన వృద్ధాశ్రమ భూమిని కాపాడాల్సిన ప్రభుత్వం, ఈ వివాదంపై తక్షణమే స్పందించి భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్ ప్రోగ్రెస్ ట్రస్ట్ సభ్యులు శ్రీరాములు, చౌదరి, సూర్య ప్రకాష్, సోమిరెడ్డి, వెంకటరామయ్య, సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు ఏ అశోక్, జి శ్రీనివాసులు, రాజశేఖర్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్య వెంకటరామయ్య, వెంకన్న, లక్ష్మణ్, నరేష్, లింగస్వామి, శంకర్, రాథోడ్ సంతోష్, శ్రీనివాస్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘించిన ఐదు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు సీజ్

- జిల్లా వైద్యాధికారి డా.శ్రీనివాసులు చర్యలు
- బాలానగర్ మండలం హేమాజీపూర్ కేంద్రంపై వేటు!



**బాలానగర్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా, అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలపై జిల్లా వైద్యారోగ్య శాఖ కొరడా ఝుళిపించింది. ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన కేంద్రాలు యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్, నెబులైజర్ వాడకం వంటివి చేస్తున్నట్లు గుర్తించి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఏ.శ్రీనివాసులు మంగళవారం జిల్లాలో 5 కేంద్రాలను మూసివేయించారు. నియోజకవర్గ పరిధిలోని మిడ్జిల్ మండలంలో ఒకటి, అదే మండలంలోని బోయినపల్లిలో ఒకటి, కొత్తపల్లి మండలంలో ఒకటి, బాలానగర్ మండలం లిహేమాజీపూర్ లో ఒకటిలి, నవాబ్ పేట మండలం కాకర్లపహాడ్ లో ఒకటి చొప్పున మొత్తం 5 కేంద్రాలను అధికారులు సీజ్ చేశారు. ముఖ్యంగా బాలానగర్ మండలం హేమాజీపూర్ లోని ఫస్ట్ ఎయిడ్ కేంద్రంలో పరిధికి మించి చికిత్సలు అందిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో డీఎల్ఓ డా.రాజు, నోడల్ ఆఫీసర్ డా.శివకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి జి.నర్సింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి లేని చిన్నారికి మూడు లక్షల సాయం




**షాబాద్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** చదువుపై మక్కువ ఉన్న ప్రతి విద్యార్థులను ప్రోత్సహించాలి అని షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మాచనపల్లి కి చెందిన తండ్రిని కోల్పోయిన ఐదో తరగతి విద్యార్థిని బైండ్ల స్పర్శకు మంగళవారం పట్నం అవినాష్ రెడ్డి గిఫ్ట్ స్మైల్ కింద మూడు లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల పరీక్షలో 'దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలో కోరుకోమంటే ఏమి అడుగుతావు?' అనే ప్రశ్నకు 'నాకు మా నాన్న కావాలి' అని చిన్నారి రాసిన సమాధానం సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి వెళ్లింది. దీంతో స్పందించిన కేటీఆర్ సూచన మేరకు చిన్నారి వివరాలు తెలుసుకున్న అవినాష్ రెడ్డి ఆర్థిక సాయం అందించి తోడుగా నిలిచాడు. అంతకుముందు చిన్నారిని కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. చిన్నారి పరిస్థితిపై స్పందించిన కేటీఆర్, అవినాష్ రెడ్డిని అభినందించి వారం తర్వాత చిన్నారిని తన వద్దకు తీసుకురావాలని సూచించారు. చిన్నారి అక్క ఇంటర్మీడియట్ చదువుతున్న క్రమంలో ల్యాప్‌టాప్ అందజేస్తానని అవినాష్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, మాచనపల్లి సర్పంచ్ రాధా, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు గోపాల్ నాయక్, జైపాల్, రాములు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం




**కొత్తపల్లి, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** కొత్తపల్లి మండలంలోని భూనీడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన గోరకొండ వెంకటమ్మ, జముల సాయమ్మలకు ఎంపీడీవో కొండన్న చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో నిరుపేద కుటుంబాలు సొంత ఇళ్లను నిర్మించుకునే అవకాశం కలుగుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొండన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పుష్పమ్మ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు లాలూభాయ్, ప్రశాంత్, కార్తీక్, గ్రామ అధ్యక్షుడు అంజిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

## బతుకమ్మ సంబరాలకు డీఎస్పీ అడ్డు..!

- కాలనీలో ఏ కార్యక్రమం నిర్వహించినా 100కు కాల్ చేస్తున్నారని ఆరోపణ
- లోపల అధికారికి మర్యాదలు..బయట మహిళలకు అవమానాలా?
- న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిరీక్షణ
- తీరు మార్చుకోకపోతే కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామన్న కాలనీవాసులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాల్సిన వేళ..మల్కాజ్‌గిరి పోలీస్ కమీషనరేట్ పోచారం పోలీస్ స్టేషన్ కొర్రెముల పరిదిలోని బాలాజీనగర్ కాలనీలో మాత్రం వివాదానికి దారి తీసిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కమ్యూనిటీ హాల్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలను అడ్డుకోవడంతోపాటు, పోలీసు అధికారి అనే ఆహంతో తమను బెదిరింపులకు గురిచేశారని డీఎస్పీ బొమ్మినేని శ్రీరామ్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన మహిళలకు అక్కడా ఇబ్బందులు ఎదురయ్యాయని, డీఎస్పీని స్టేషన్‌లో కూర్చోబెట్టి పోలీసులు తమను వేధించారని కాలనీవాసులు ఆరోపించారు. రాత్రి 10 గంటలకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తమను అర్ధరాత్రి 12 గంటల వరకు నిరీక్షించేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థపైనే ఇలాంటి ఆరోపణలు రావడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థపై ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని విస్మరించకుండా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచడం ఉన్నతాధికారుల బాధ్యత. బతుకమ్మ వేడుకల వివాదం, మహిళల ఫిర్యాదుల స్వీకరణలో జాప్యం జరిగిందనే ఆరోపణలు, బెదిరింపులపై ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### బతుకమ్మ వేడుకలను అడ్డుకున్నారంటూ ఆరోపణలు..!

కమ్యూనిటీ హాల్ వద్ద మహిళలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడుకుంటున్న సమయంలో డీఎస్పీ బొమ్మినేని శ్రీరామ్‌రెడ్డి 100కు ఫోన్ చేసి పోలీసులను రప్పించారని, పెట్రోలింగ్ సిబ్బందితో వేడుకలను అడ్డుకున్నారని కాలనీవాసులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించుకోవాలని ప్రోత్సహిస్తున్న తరుణంలో తమ కాలనీలో మాత్రం పండుగ జరుపుకోవడానికి అడ్డంకులు ఎదురవడం ఏమిటని మహిళలు ప్రశ్నించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే పండుగలో పాల్గొనడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అర్ధరాత్రి వరకు నిరీక్షణ!

బతుకమ్మ వేడుకలను అడ్డుకున్న ఘటనపై ఫిర్యాదు చేసేందుకు కాలనీవాసులు రాత్రి సుమారు 9 గంటలకు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు తమ సమస్యను వినకుండా, "తాగి బతుకమ్మ ఆడుతారా?" అంటూ దుర్భాషలాడారని ఆరోపించారు. అంతేకాకుండా, స్టేషన్‌లో డీఎస్పీని కూర్చోబెట్టి తమను ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఫిర్యాదును స్వీకరించకుండా అర్ధరాత్రి 12 గంటల వరకు స్టేషన్ బయటే వేచి ఉండేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాల్సిన పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయని వారు వాపోయారు.




### ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించారంటూ ఫిర్యాదులో ప్రస్తావన!

గతంలో వినాయక చవితి సందర్భంగా కూడా కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని మహిళలు ఆరోపించారు. డిఎస్పీ శ్రీరామ్‌రెడ్డి ఇంటికి కాలనీ అధ్యక్షుడు బొల్ల సుదీర్ రెడ్డి వెళ్లి కాలనీవాసులతో మీకు ఏమైన సమస్యలు ఉన్నాయా అని మాట్లాడే క్రమంలో అధ్యక్షుడిని తీవ్రమైన పదజాలంతో దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారని వాపోయారు. పోలీసులతో పెట్టుకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఆరోపణలు తీవ్ర స్వభావం కలిగినవి కావడంతో వాటిపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

### కమిషనర్ జోక్యం చేసుకుంటారా..?

కాలనీవాసులు ఈ వ్యవహారంపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. డయల్ 100 కాల్ వివరాలు, పెట్రోలింగ్ సిబ్బంది విధుల రికార్డులు, పోలీస్‌స్టేషన్ సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బొల్ల సుదీర్ రెడ్డి,సిద్దార్ధ,మారుతీ,దేవెందర్ రెడ్డి,రవి,సతీష్, లింగచారి,రమణ,వెంకటేశ్వర్లు,రాకేష్ రెడ్డి,సతీష్ రెడ్డి, రజిని, స్రవంతి, హరిత, కళ్యాణి, సబిత, లక్ష్మి, భాగ్య, తేజశ్విణి, పద్మ, మాదవి, తేజ, మమత, మానస, సుప్రద, మంజుల, లత, అనూష, స్వాతి, సునీత, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్ఎస్ఎన్ కంపెనీకి 12 బ్లాకుల అనుమతులపై విచారణ జరిపించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్‌కు చందంపేట గ్రామస్థుల ఫిర్యాదు..

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎమ్ ఎస్ ఎన్ కంపెనీకి గతంలో అనుమతులు మంజూరు చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గ్రామస్థులు మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ చందంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్ ఎస్ ఎన్ కంపెనీకి సంబంధించి గతంలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీమతి పద్మ తమ పదవీకాలంలో 12 బ్లాకులకు అనుమతులు మంజూరు చేసినట్లు ఆరోపించారు. ఈ అనుమతులు గ్రామ పెద్దలకు, గ్రామ ప్రజలకు, ప్రస్తుతం ఉన్న నూతన గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు తెలియకుండా, వారి అభిప్రాయాలు తీసుకోకుండానే సొంత నిర్ణయంతో ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ అనుమతుల మంజూరులో నిబంధనలు పాటించారా లేదా అనే విషయాన్ని అధికారికంగా పరిశీలించాలని కోరారు. కావున, పూర్వ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీమతి పద్మ వ్యవహారంపై చట్టరీత్యా సమగ్ర విచారణ జరిపించి, అనుమతుల మంజూరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అలాగే ఈ వ్యవహారంలో వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి చందంపేట గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ రామకృష్ణ, శేరి స్వామి, గరిగె నర్సింలు, డోలి నరేష్, గాజుల లావణ్య, నవీన్, భూంగారి మౌనిక, గణేష్ గౌడ్, నాయకులు శేరి చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.



# బీడీ కార్మికుల జీవనభృతి కోసం భారీ ర్యాలీ, ధర్నా

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4,016 జీవనభృతి వెంటనే అమలు చేయాలి
- హామీని నిలబెట్టుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు..
- యూనియన్ నాయకులు




**నార్సింగి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ నెలకు రూ.4,016 జీవనభృతిని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీడీ కార్మికులు భారీ ర్యాలీగా వెళ్లి, అక్కడ ధర్నా చేపట్టారు. అనంతరం బీడీ కార్మికుల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను తహసీల్దార్ గ్రేస్‌బాయికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు పిట్ల రామకృష్ణ మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే బీడీ కార్మికులకు విధించిన కటాఫ్ తేదీని తొలగించి, అర్హులైన కార్మికులందరికీ జీవనభృతి అమలు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.2,016 జీవనభృతి పొందుతున్న వారికి మరో రూ.2,000 పెంచి నెలకు రూ.4,016 అందిస్తామని ప్రకటించారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం వల్ల బీడీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కటాఫ్ తేదీ పేరుతో కార్మికులకు అన్యాయం చేయకుండా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి బీడీ కార్మికుడికి నెలకు రూ.4,016 జీవనభృతిని అందించాలని కోరారు. లేనిపక్షంలో గతంలో కేసీఆర్‌కు ఎదురైన రాజకీయ పరిస్థితులే రేవంత్‌రెడ్డికి ఎదురవుతాయని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్. రమేష్, సత్తమ్మ మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు, వివక్ష లేకుండా జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా బీడీలు చుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులకు ప్రభుత్వ సాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయకుండా జాప్యం చేయడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జీవనభృతిని అమలు చేయాలని, లేకుంటే బీడీ కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని, జీవనభృతిని వెంటనే అందించి తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కార్మికులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) కామారెడ్డి జిల్లా నాయకులు ప్రకాష్, కామారెడ్డి--నిజామాబాద్ రూరల్ ఉమ్మడి జిల్లాల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్. కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం కామారెడ్డి--నిజామాబాద్ రూరల్ జిల్లాల నాయకులు బి. కిషోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీడీ కార్మికులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో కార్మికుల మెరుపు సమ్మె




**జడ్చర్ల, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ నేటి నుంచి మెరుపు సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సమయానికి కూడా పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఆగస్టు వరకు బడ్జెట్ విడుదల చేసినప్పటికీ, అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వేతనాలు చెల్లించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగీ కృష్ణయ్య, యూనియన్ నాయకులు నాగరాజు, రాజేష్, అబ్దుల్ వహీద్, విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన

- ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి
- డీఈవోకు బీజేపీ నాయకుల వినతిపత్రం
- నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరపాలని డిమాండ్



**వనపర్తి, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, సేవా నియమావళిని ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగబద్ధ సంస్థల పట్ల గౌరవంతో పాటు తమ విధులు, సేవా నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేయడంతోపాటు క్రమశిక్షణ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలను నేర్పాల్సిన ఉపాధ్యాయులు తమ ప్రవర్తనలోనూ ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలో ఉపాధ్యాయులు పాల్గొన్న అంశంపై విద్యాశాఖ అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని ఆయన కోరారు. సంబంధిత నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టాలు, సేవా నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నాయకులు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నలవోతుల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన-2027ను పక్కాగా నిర్వహించాలి

- ప్రతి ఇంటి వివరాలు నమోదు కావాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్




**వనపర్తి, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** జనగణన-2027లో భాగంగా చేపట్టనున్న జనాభా గణనలో ప్రతి ఒక్కరి వివరాలను సమగ్రంగా, కచ్చితంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులకు సూచించారు. గణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఏ ఒక్క ఇల్లు లేదా భవనం గణన పరిధి నుంచి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన--2027 రెండో దశలో భాగంగా ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జనాభా గణనలో కచ్చితమైన సమాచార సేకరణ అత్యంత కీలకమని, ఇప్పటికే గృహ జాబితా తయారీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి చేపట్టనున్న జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. శిక్షణలో వివరించే విధివిధానాలను పూర్తిగా అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జనాభా గణన నిర్వహించే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు సైతం నాణ్యమైన శిక్షణ అందించి, విధులపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలు సేకరించేలా పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. రెండు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకుని జనగణనకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఖీమ్యా నాయక్ సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జనగణన-2027 జనాభా గణనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఓ హరికృష్ణ, సెన్సస్ శిక్షణ అధికారులు సుల్తాన్, హరిత తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే అధికారులకు సహకరించాలి



**తూప్రాన్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** భూమి రీ సర్వే ద్వారా గ్రామానికి వచ్చే సర్వే అధికారులకు సహకరించాలని తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఇమ్మంపూర్ గ్రామంలో భూముల రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ రైతులతో మాట్లాడి, రీ-సర్వే ద్వారా భూముల సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డులలో ఖచ్చితత్వం పెంపొందించడం, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలను నివారించడం వంటి ప్రయోజనాలను వివరించారు. రైతులు రీ-సర్వే ప్రక్రియపై అవగాహన కలిగి ఉండి, సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బక్క స్వరూప నవీన్ గౌడ్ సంబంధిత రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** రైతులకు ప్రస్తుతం ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి మండలం వీరాయిపల్లి, ఖిల్లా ఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర భూ రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. మల్కాపూర్ గ్రామంలో రీసర్వే ప్రక్రియ మరో వారం రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. వీరాయిపల్లి గ్రామంలో గ్రామ విస్తీర్ణానికి సంబంధించిన సర్వే పూర్తయిందని వెల్లడించారు. బుధవారం నుంచి పట్టా భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులతో మాట్లాడిన ఆర్డీఓ.. భూముల రీసర్వే ద్వారా ప్రస్తుతం ఉన్న భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో రైతులకు భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## నీటి పొదుపుతోనే మామిడిలో అధిక దిగుబడి




**తెలకపల్లి, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితుల్లో ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు నీటి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని నాగర్‌కర్నూల్ డివిజన్ ఉద్యాన అధికారి కన్న జగన్ సూచించారు. మంగళవారం ఈ సందర్భంగా మండల పరిధిలోని దాసుపల్లి గ్రామ రైతు వేదికలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి, ఆయిల్‌పామ్, కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం, భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. మామిడి తోటల్లో బిందు సేద్యం ద్వారా నీటిని నేరుగా చెట్ల వేర్లకు అందించాలని, డ్రిప్పర్ల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. చెట్ల చుట్టూ ఎండిన గడ్డి, ఆకులు, ఇతర సేంద్రియ పదార్థాలతో మల్చింగ్ చేయడం ద్వారా నేలలో తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచవచ్చని పేర్కొన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా గుంతలు, కందకాలు, వ్యవసాయ కుంటల ద్వారా నిల్వ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటిని సమర్థంగా వినియోగించుకుంటూ, ఉద్యాన పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కన్న జగన్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. నర్మద, ఉద్యాన విస్తరణ అధికారి దేవేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, ప్రీ యూనిక్ ఆయిల్‌పామ్ కంపెనీ క్లస్టర్ అధికారులు జస్వంత్, ప్రసాద్ సీడ్స్ క్లస్టర్ అధికారి అజయ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్




**బిజినేపల్లి. అక్టోబర్ 13 (జనం సాక్షి) :** రైతులకు ప్రభుత్వం 24 గంటల కరెంటు కోతలు లేకుండా ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుంపల్లి అశోక్ డిమాండ్ చేశారు బిజినపల్లి మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయం ముందుమంగళవారం నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో తలుపులకు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వేసిన పంట పూర్తిగా ఎండిపోతున్నదని ముఖ్యంగా వరి వేరుశనగ మినుము పంటలు వేశారని అవి పూర్తిగా నాశనం అయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు .అదేవిధంగా కరెంట్ పై ఆధారపడి జీవిస్తున్న ల్యాండ్రీ షాపులు ఎలక్ట్రికల్ షాపులు పూర్తిగా మూసి వేసుకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని అంతరాయం లేకుండా కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కే మల్లేష్, డి మల్లేష్, జంపులేష్ రాములు తదితరులు పాల్గొన్నారు

## బీసీ సంఘం బలోపేతానికి కృషి చేయాలి

- రాష్ట్ర బీసీ అధ్యక్షుడు అరవింద్ స్వామితో వరాల రఘు భేటీ

వనపర్తి బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) : బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, బీసీల అభ్యున్నతికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాష్ట్ర బీసీ అధ్యక్షుడు అరవింద్ స్వామి, వనపర్తి బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరాల రఘు చర్చించారు. ఈ సందర్భంగా బీసీల ఐక్యత, సంఘం విస్తరణ, బీసీల హక్కుల సాధనకు చేపట్టాల్సిన కార్యాచరణపై వారు అభిప్రాయాలను పంచుకున్నారు. బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి, సంఘాన్ని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని చర్చించినట్లు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారం, వారి అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడినట్లు పేర్కొన్నారు.



# నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

- పంట నష్టానికి ఎకరాకు రూ.70 వేల పరిహారం ఇవ్వాలి..
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్

**తెలకపల్లి, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతులకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల మోటార్లు నిలిపివేసి రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కరువు పరిస్థితులపై శాస్త్రవేత్తలు తొమ్మిది నెలల ముందుగానే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం, అధికారులు ముందస్తు సహాయక చర్యలకు ప్రణాళికలు రూపొందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో సుమారు 80 శాతం పంటలు నష్టపోయాయని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే పేద కుటుంబాలు ఉపాధి లేక మళ్లీ సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎత్తిపోతల పథకాల మోటార్లు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.70 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కూలీలకు 200 రోజుల పని కల్పించాలని, మున్సిపాలిటీ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకుడు నాగపూర్ మధు, మండల నాయకులు నందిపేట భాస్కర్, శివ వంశీ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 189 మంది వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాలలో చేరడం వల్ల చేకూరే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలపై ఈ సందర్భంగా వారికి సమగ్రమైన అవగాహన కల్పించారు. వయోవృద్ధులలో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, సంఘాల ద్వారా పరస్పర సహకార ప్రాముఖ్యతను వివరించారు. వారి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లభించే రకరకాల ప్రయోజనాలను ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు. వయోవృద్ధులతో బతుకమ్మలను స్వయంగా తయారు చేయించి, వారితో బతుకమ్మ ఆటపాటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో మహిళల భద్రతకు షీ టీమ్ ప్రత్యేక నిఘా

- ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(జనంసాక్షి):** బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళల భద్రతకు ప్రాధాన్యత నిస్తూ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ బృందం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టింది. ఆసిఫాబాద్ పట్టణంలోని బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంగణంతో పాటు బెస్తవాడ, బనారవాడ, మేకల వాడ కాలనీలలో షీ టీమ్ సిబ్బంది మఫ్టీలో నిఘా ఏర్పాటు చేశారు. మహిళలను వేధించడం, ఈవ్ టీజింగ్‌కు పాల్పడటం వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతూ రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు. మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని,తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకో వాలని పోలీసులు సూచించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

- ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ర్యాలీ
- జిల్లాలో చేపట్టిన నిరసనలపై సీఎంకు వివరించిన సుగుణక్క



**ఆసిఫాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షురాలు,కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ తదితరులతో కలిసి ఈ బేటీలో సుగుణక్క పాల్గొన్నారు.సోమవారం ఢిల్లీలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క, ర్యాలీ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు వివరించారు. అలాగే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యం, ప్రజల స్పందన తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# జనగణనను పకడ్బందీగా నిర్వహించాలి



- సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి

**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 13(జనంసాక్షి) :** జనగణనను పకడ్బందీగా నిర్వహించేందుకు సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు. జనగణన-2027 జనాభా గణనకు సంబంధించి గణన విభాగాల కార్యనిర్వాహక సిబ్బంది, సాంకేతిక సహాయకులకు అక్టోబర్ 13, 14 తేదీల్లో ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్న రెండో దశ శిక్షణ కార్యక్రమానికి మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక శిక్షణను సద్వినియోగం చేసుకుని, వివరాల నమోదులో తప్పులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో కాగితాలపై నమోదు చేసిన జనగణన వివరాలను ఈసారి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా నేర్చుకోవాలని, సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. జనగణనలో ప్రతి దశలో చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి సేకరించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ఏఆర్ యువేందర్ బాబు, సిహెచ్ ఎస్‌వీఎస్ నాయుడు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్ కుమార్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఓ లాల్ నాయక్, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు మంజుల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలీసులపై దాడి కేసులో 20 మంది నిందితుల అరెస్ట్

- గంజాయి కేసు దర్యాప్తుకు వెళ్లిన పోలీసులపై రాళ్లు, కర్రలతో దాడి
- ఐదుగురు పోలీసులకు గాయాలు..
- ప్రభుత్వ పోలీసు వాహనం ధ్వంసం



**సిరికొండ అక్టోబర్ 13 (జనంసాక్షి) :** పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా, దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ అన్నారు. సిరికొండ పోలిస్ స్టేషన్ లో విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేసి, వారిని నిర్బంధించి, ప్రభుత్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేసిన ఘటనలో 20 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. అదిలాబాద్ మీడియా సమావేశం నిర్వహించారు. సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాయిపేట్ గ్రామంలో అక్టోబర్ 10వ గంజాయి కేసు దర్యాప్తులో భాగంగా వెళ్లిన పోలీసు సిబ్బందిపై గ్రామస్తులు దాడి చెయ్యగా సిరికొండ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 90/2026, చీణూా చట్టం కింద ఉన్న గంజాయి కేసు దర్యాప్తు నిమిత్తం ఇచోడ సీఐ సీహెచ్. రమేష్, కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు పోలీసు సిబ్బంది ప్రభుత్వ పోలీసు వాహనంలో బంగారుపేట గ్రామానికి వెళ్లారు. గంజాయి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో, కొందరు వ్యక్తులు గుంపుగా ఏర్పడి పోలీసులపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు వాహనంపై రాళ్లు రువ్వడంతో పాటు, పోలీసు సిబ్బందిపై కర్రలతో దాడి చేసి గాయపరిచినట్లు, వారిని బలవంతంగా సర్పంచ్ ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు.అంతేకాకుండా పోలీసులను చంపుతామని బెదిరించడం, ప్రభుత్వ పోలీసు వాహనాన్ని ధ్వంసం చేయడం, ప్రభుత్వ ఫోన్‌ను ధ్వంసం చేయడంతో పాటు మరో సెల్‌ఫోన్, క్రైమ్ నంబర్ 79/2026కు సంబంధించిన సీడీ ఫైల్‌ను అపహరించినట్లు తెలిపారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్ ఎడమ చేతికి ఎముక విరగగా, ఇచోడ సీఐ సీహెచ్. రమేష్, ఏఎస్ఐ రాథోడ్ బలిరామ్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ భీంరావుకు, ఏఆర్ కానిస్టేబుల్ గంగారాంకు బలమైన గాయాలయ్యారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ బత్తుల శివప్రసాద్ ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 92/2026 కింద దీచీూ సెక్షన్లు 109, 303(2), 137, 121, 140, 191 ఆర్/డబ్ల్యూ 190 ప్రభుత్వ ఆస్తుల నష్టం నివారణ చట్టం కింద 3 కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తును ఇచోడ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించి, దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. దాడిలో పాల్పడిన ఇతరుల పాత్ర పై దర్యాప్తు కొనసాగుతుందని, దాడిలో పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని తెలియజేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది చట్టబద్ధంగా విధులు నిర్వహిస్తున్న సమయంలో వారిపై దాడి చేయడం, విధులకు ఆటంకం కలిగించడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని పోలీసులపై దాడులకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని, నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే పాల్గొన్నారు.

# వర్షాభావంతో రైతులు విలవిల

- గుడిహత్నూర్‌ను కరువు మండలంగా ప్రకటించాలి!
- రైతులను ఆదుకోవాలని ఆర్డీవో జగదీశ్వర్‌రావుకు కాంగ్రెస్ నాయకుల వినతి



**గుడిహత్నూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** గుడిహత్నూర్ మండలంలో తక్కువ వర్షపాతం కారణంగా రైతులు పంటల సాగులో తీవ్రంగా నష్టపోయారని, గుడిహత్నూర్ మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి బాధిత రైతులను ఆదుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో జగదీశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, దీంతో రైతులు పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా నష్టపోయారని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండలంలో పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోడసం దౌలత్‌రావు, ఉపాధ్యక్షుడు మోహితే మారుతి, అధికార ప్రతినిధి ఆడే జైపాల్, మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు సమీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్ ఖాన్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీ సభ్యుడు రాచర్ల సత్యనారాయణ, యువ నాయకుడు పవార్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ పరిశీలకులుగా కడియం కావ్య



**స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి ) :** నల్గొండ - వరంగల్ - ఖమ్మం నియోజక వర్గం నుండి తెలంగాణ శాసన మండలికి జరగబోయే ఎన్నికల సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కొరకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వరం గల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యని పరిశీలకులుగా నియమించడమైనదని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కమిటీలు నియమించామని తెలిపారు.

# ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13(జనంసాక్షి ):** 257వ ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్-కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 257వ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా వివిధ రకాల వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు కంటి వైద్య శిబిరంలో ఓ పి డి, కంటి పరీక్షలు, 17 నుండి 22వ తేదీ వరకు శస్త్రచికిత్సలు, 22 నుండి 27వ తేదీ వరకు చెవి వైద్య శిబిరంలో ఓ పి డి, పరీక్షలు, 23 నుండి 28వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు, 28 నుండి 31వ తేదీ వరకు ఆర్థోపెడిక్ శిబిరంలో ఓ పి డి, పరీక్షలు, 29 నుండి నవంబర్ 1వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు, ఈనెల 28 నుండి 31 వ తేదీ వరకు ప్లాస్టిక్ సర్జరీ శిబిరంలో చీలిక పెదవులు, కాలిన గాయాల తర్వాత ఏర్పడే సంకోచాలకు సంబంధించిన వైద్య పరీక్షలు, 29 నుండి నవంబర్ 1వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు, నవంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు దంత వైద్య శిబిరంలో పరీక్షలు, వైద్య సేవలు, ఈ నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు మహిళల గర్భాశయ సంబంధిత సమస్యలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, పి.ఎ.పి. స్మియర్ స్క్రీనింగ్ సేవలు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాల గురించి తెలుసుకొని, సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు నిర్ణీత తేదీలలో ఆధార్ కార్డు,ఇతర గుర్తింపు కార్డులతో వైద్య శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకోవాలని, ఆసుపత్రిలో చేరిన రోగులతో పాటు ఒక వ్యక్తిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 7039673973 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# మానసిక వికలాంగురాలిపై అత్యాచారం కేసులో నిందితునికి జైలు శిక్ష

**టేకుమట్ల అక్టోబర్ 13 (జనంసాక్షి) :** మానసిక వికలాంగురాలి పై అత్యాచారం చేసిన కేసులో నిందితిని పై నేరం రుజువు అయినందున భూపాలపల్లి ప్రధాన న్యాయమూర్త జె . జీవన్ కుమార్ నిందితునికి 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 3000/ రూపాయలు జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు. తేదీ 28 11 2021 రోజున టేకుమట్ల మండలం, మందులోరిపల్లి గ్రామానికి చెందిన పాక్షికంగా మూగ చెవుడు గల మానసిక వికలాంగురాలు 40 సంవత్సరాలు గల మహిళ తన ఇంటి వద్ద ఒంటరిగా ఉన్నది గమనించి అదే గ్రామస్తుడైన బండి శంకర్ తండ్రి పాపయ్య, కులం గౌడ వయసు 55 సంవత్సరాలు గల వ్యక్తి మానసిక వికలాంగుల ఇంటి లోనికి అక్రమంగా ప్రవేశించి ఆమె పై బలవంతంగా అత్యాచారం చేస్తుండగా అదే సమయంలో ఆమె తల్లి వచ్చింది గమనించి సదరు నిందితుడు శంకర్ అక్కడి నుండి పారిపోయినాడు. ఈ విషయమై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టేకుమట్ల అప్పటి ఎస్సై కె.రమణా రెడ్డి కేసు నమోదు చేసినారు, తదుపరి ఇట్టి కేసును అప్పటి చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.వెంకట్ దర్యాప్తు ప్రారంభించి నిందుతున్ని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు, తదుపరి నిందితునిపై సరైన సాక్షాదారాలతో కోర్టులో చార్జ్ షీటు వేసి ఈ కేసులో విచారణ సమయంలో పబ్లిక్ ప్యాసిక్యూటరీ ఎదులాపురం శ్రీనివాస్ తన వాదనలు వినిపించారు, విచారణ సమయంలో బి.రాజు కోర్ట్ మానిటరింగ్ ఆఫీసర్ పీసీర్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో కోర్టు లైజెనింగ్ ఆఫీసర్ జి.వెంకన్న, ఎ ఎస్ఐ కోర్టు కానిస్టేబుల్స్ సిహెచ్.జ్యోతి, పి .శ్వేత లు, కోర్ట్ లో ప్రవేశ పెట్టారను. భరోసా నుండి లీగల్ సపోర్ట్ ఆఫీసర్ జి.రజిత సహకారం అందించారు, విచారణ అనంతరం నిందితునిపై నేరం రుజువు అయినందున న్యాయమూర్తి జె .జీవన్ కుమార్ నిందితునికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 3000/- రూపాయలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితునికి శిక్షపడేలా సమర్ధవంతంగా పనిచేసిన అప్పటి దర్యాప్తు అధికారులను ప్రస్తుత భూపాలపల్లి డీస్పీ , ఎ . సంపత్ రావు , ప్రస్తుత చిట్యాల సీఐ .సతీష్ ప్రస్తుత ఎస్ ఐ జి . అమూల్య, కోర్టు మానటరింగ్ ఆఫీసర్ పీసీ ఆర్ ఇన్ స్పెక్టర్ దీ. రాజు, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఏ ఎస్ ఐ జి .వెంకన్న,కోర్టు కానిస్టేబుల్స్ సిహెచ్ . జ్యోతి, పి. స్వేత భరోసా లీగల్ సపోర్ట్ ఆఫీసర్ జి .రజిత లను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీ-సర్వే

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**చెన్నూర్, అక్టోబర్ 13(జనం సాక్షి) :** భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు భూముల హద్దులను పక్కాగా నిర్ధారించి, భూ రికార్డులలో పారదర్శకత లక్ష్యంగా ప్రభుత్వం రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూరు మండలం కోనంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రతి మండలంలో తొలి విడతగా 2 గ్రామాలను ఎంపిక చేసి ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. కొన్ని సందర్భాలలో వాస్తవంగా ఉన్న భూమి కంటే రికార్డులలో ఎక్కువ విస్తీర్ణం నమోదవడం, భూమి ఎక్కువగా ఉన్నప్పటికీ రికార్డులలో తక్కువగా నమోదవడం, భూ ఆక్రమణలు, హద్దుల వివాదాలు, గ్రామాల సరిహద్దులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని. రీ-సర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ-సర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, భూముల కొలతలు నిర్వహించే తేదీకి కనీసం వారం రోజుల ముందే సమాచారం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలతో మ్యాపులు రూపొందిస్తామని, భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు జరిగినప్పుడు సంబంధిత రికార్డులు, మ్యాపుల ఆధారంగా భూమి బదిలీ వివరాలను నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. భూయజమానుల సహకారం ఉంటే నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేసి, సంబంధిత మ్యాపులను సిద్ధం చేయడంతో పాటు, నిబంధనల ప్రకారం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీకి చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని నెన్నెల మండలంలోని 2 గ్రామాలలో, తాండూరు మండలంలోని రాంపూర్ గ్రామంలో రీ-సర్వే నిర్వహించగా, సుమారు 95 శాతం వరకు సమస్యలు పరిష్కారమయ్యాయని, వారసత్వంగా వచ్చిన భూముల పంపకం, కుటుంబ సభ్యుల మధ్య భూముల వాటాల విషయంలో ఒప్పందాలు లేకపోవడం వంటి కొన్ని సమస్యలు మినహా, అనేక భూ వివాదాలను పరిష్కరించేందుకు రీ-సర్వే దోహదపడిందని తెలిపారు. అంతకుముందు మండల కేంద్రంలో కొనసాగుతున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కర ఘాట్ పనులను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని సోమనపల్లి లో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

# భూముల రీ సర్వేకు శ్రీకారం



**రాజోళి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో తూర్పు గార్లపాడు గ్రామ శివారులోని పంట పొలాలను ఆధునిక సర్వే యంత్రం ద్వారా కొలతలు చేపట్టారు. భూముల హద్దుల గుర్తింపు, భూ వివాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్వేయర్ రామకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ, జీపీఓ సుల్తానా, రాజు, నాగన్న, చైన్‌మెన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవిగా శ్రీ బంగారు మైసమ్మ

**జడ్చర్ల, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** అన్నపూర్ణే సదాపూర్ణే శంకర అంటూ భక్తులు జడ్చర్లలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా 3వ రోజు మంగళవారం శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతను అన్నపూర్ణాదేవిగా మనోహరంగా అలంకరించి పూజించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అన్నపూర్ణాదేవి అలంకరణను పురస్కరించుకొని పరిగి దామోదర్ రెడ్డి సునీత రెడ్డి, గజగౌని రమేష్ గౌడ్ సుప్రియ దంపతులు సమకూర్చిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో గోనెల నరేందర్ మహేశ్వరి, విజయ్ కుమార్ గౌతమి ప్రియాంక, మహేష్ మాధురి దంపతులతో పాటు,మిద్దె నాగరాజు, అనన్య, మహిళా భక్తులు పాల్గొన్నారు.



# హకీంపేట్‌లో వ్యవసాయ మేళ

- ఏర్పాట్లను పర్యవేక్షించిన రాష్ట్ర ఉన్నతాధికారులు
- ఆన్‌లైన్ గేమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమేహ్రా

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** హకీంపేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల ఎక్స్‌పో నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న వేదిక, ఇతర ఏర్పాట్లను అగ్రికల్చర్ ప్లానింగ్ కమిషన్ సెక్రటరీ సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎక్స్‌పోకు హాజరయ్యే ప్రజలు, రైతులు, వివిధ శాఖల ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం సందర్భంగా ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై పోలీస్ శాఖ తరపున తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు.అనంతరం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, నిర్మాణ దశలో ఉన్న కొడంగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్లను పనుల వివరాలు, ప్రస్తుత నిర్మాణ దశ, మిగిలి ఉన్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

## ఆన్‌లైన్ గేమ్ మోసం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్ పెట్టుబడుల పేరుతో మోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.కళ్యాణ్ మార్నింగ్', 'మిలన్ మార్నింగ్', 'శ్రీదేవి' పేర్లతో నకిలీ విజేతల వీడియోలు, మనీ వోచర్ల ద్వారా సైబర్ మోసం పట్ల జాగ్రత్త ఉండాలని జిల్లా ఎస్పీ స్నేహమే హ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాను ఉపయోగించుకొని ప్రజలకు అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిస్తూ, ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడుల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి ప్రకటనలను నమ్మి డబ్బులు పంపవద్దని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ప్రజలకు సూచించారు.ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో, అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టే పెట్టుబడి ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు, బహుమతులు పొందేందుకు ముందుగా రుసుములు చెల్లించాలనే సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు.కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గట్టనపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫేస్‌బుక్‌లో ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడుల ప్రకటనను చూసి సైబర్ మోసానికి గురైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 35/2026గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బాధితుడు ఫేస్‌బుక్‌లో 'కళ్యాణ్ మార్నింగ్' పేరుతో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటనను చూసి, అందులో ఇచ్చిన మొబైల్ నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తులను సంప్రదించాడు. మొదట కొంత మొత్తాన్ని పంపితే పెట్టుబడి ద్వారా ఆదాయం పొందవచ్చని నమ్మించారు. అనంతరం ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరడంతో బాధితుడు డబ్బులు బదిలీ చేశాడు.ఆ తర్వాత బాధితుడికి 'కళ్యాణ్ మార్నింగ్', 'మిలన్ మార్నింగ్', 'శ్రీదేవి' పేర్లతో గెలుపొందినట్లు చూపించే నకిలీ మనీ వోచర్లు పంపించి, సుమారు రూ.2,65,000 గెలుచుకున్నట్లు నమ్మించారు. అయితే ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లించాలని చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు.ఈ విధంగా బాధితుడి నుంచి పలు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం సుమారు రూ.1,58,300 బదిలీ చేయించుకున్నట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించి, అనంతరం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 03-03-2026న ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు.

## పథకం ప్రకారం సోషల్ మీడియా ద్వారా మోసం

దర్యాప్తులో లభించిన సమాచారం ప్రకారం, నిందితులు ఆన్‌లైన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, గేమింగ్ అప్లికేషన్లను ఉపయోగించి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు తయారుచేసి ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు.వీటిని చూసిన అమాయక ప్రజలు నిజంగానే డబ్బులు గెలుచుకున్నారని నమ్మి సంప్రదించేలా చేసి, గెలుపొందిన మొత్తాన్ని పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ తదితర



పేర్లతో డబ్బులు చెల్లించాలని కోరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితులు పంపిన డబ్బులను వివిధ బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పేమెంట్ స్కానర్ల ద్వారా బదిలీ చేసినట్లు కేసు దర్యాప్తులో గుర్తించారు.

## మరో ముగ్గురు నిందితుల అరెస్ట్

ఈ కేసులో కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తమ సిబ్బందితో కలిసి తెలంగాణలోని కామారెడ్డి పట్టణ బస్‌స్టాండ్ ప్రాంతంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక తెల్లరంగు మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసులో గతంలోనూ కొందరు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.. మిగిలిన నిందితుల కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

ఈ కేసులో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఆయన బృందం సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ ఆధారాల పరిశీలనతో దర్యాప్తు చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, నిందితుల పాత్రను గుర్తించేందుకు పోలీసులు చర్యలు కొనసాగిస్తున్నారు.సైబర్ నేరగాళ్లు ప్రజల ఆశలు, అత్యవసర అవసరాలు, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆకాంక్షలను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు. అపరిచిత వ్యక్తులు చెప్పే మాటలను గుడ్డిగా నమ్మి కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోవద్దు. ఏదైనా ఆన్‌లైన్ పెట్టుబడి లేదా గేమింగ్ ప్రకటన కనిపించినప్పుడు ముందుగా దాని నిజానిజాలను పరిశీలించాలి. అనుమానాస్పద లావాదేవీలకు దూరంగా ఉండాలి.సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు, ఇలాంటి మోసాల గురించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, పరిచయస్తులకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సూచించారు.

# దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

- ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండపం వద్ద అన్నదానం వితరణ

**తలకొండపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని,భక్తి శ్రద్దలతో నవరాత్రులు చేసే పూజలు ఫలించి భక్తులు కోరిన కోర్కెలు నెరవేరాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవంచ నరసింహారెడ్డి ఆకాంక్షించారు.దేవి నవరాత్రుల సందర్భంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



చేసి,మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆవంచ నరసింహారెడ్డి మాట్లాడుతూ..దేవీ నవరాత్రుల పర్వదినాన అన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల యువతలో సేవాభావం,ఐక్యత పెరుగుతుందని,గ్రామంలో అందరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.దుర్గామాత ఆశీస్సులు మనందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు ఎరుకలి యాదయ్య,మీసేవ మల్లేష్,పుట్ట పాండు,కటికెల శ్రీశైలం,ఈసారి శ్రీకాంత్,కమాల్,శ్రీకాంత్,నిశాంత్ రెడ్డి,కృష్ణ,మల్లేష్,ఫ్రెండ్స్ యూత్ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకమ్మ నిమజ్జనానికి ఘనంగా ఏర్పాట్లు

- నాగసముందర్‌లో నిమజ్జన ఘాట్లను పరిశీలించిన సర్పంచ్
- మహిళలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు

**ధారూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా నాగసముందర్ గ్రామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ధారూర్ మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలో బతుకమ్మ నిమజ్జన



ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్ మాట్లాడుతూ..బతుకమ్మ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. నిమజ్జనం సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జన ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ,తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.పండుగకు వచ్చే మహిళలు,ప్రజలు సురక్షితంగా బతుకమ్మ నిమజ్జనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వాకిటి శ్రీధర్..
- నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో వెంకటాచారి నివాసంలో భారత్ గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.విషయం తెలుసుకున్న జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఇంటికి, ఫర్నిచర్‌కు జరిగిన నష్టానికి బాధిత కుటుంబానికి భారత్ గ్యాస్ కంపెనీ తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే భారత్ గ్యాస్ కార్యాలయం ఎదుట తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కమలాయపల్లి గ్రామంలో ఏకపక్ష గ్రామ కమిటీని రద్దు చేయాలి

- గ్రామ కాంగ్రెస్ నాయకుల డిమాండ్



**చేర్యాల, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిని మండల ఉపాధ్యక్షుల సమక్షంలో దాదాపు 40 మంది క్రియాశీలక సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, ఈ ఎన్నికైన ఆ నిర్ణయాన్ని పూర్తిగా ధిక్కరించి, మండల అధ్యక్షులు చేర్యాల పార్టీ కార్యాలయంలో కూర్చొని తన ఇష్టానుసారంగా వ్యవహరించి ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన వారికి ఏకపక్షంగా పదవులు కట్టబెట్టడం సరికాదని, మొదటినుంచి పార్టీ జెండా మోసి కష్టపడిన అసలైన కార్యకర్తలను విస్మరిస్తే గ్రామ స్థాయిలో పార్టీ మనుగడకే ప్రమాదమని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. చేర్యాల ఆఫీసులో ప్రకటించిన ఈ ఏకపక్ష కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి వెంటనే స్పందించి స్వయంగా గ్రామానికి వచ్చి కార్యకర్తల సమక్షంలో అందరికీ ఆమోదయోగ్యమైన గ్రామ శాఖ అధ్యక్షుడిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు దిగుతామని, రాబోయే రోజుల్లో పార్టీకి తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమలాయపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సెల్‌ఫోన్ మాయలో కనుమరుగవుతున్న ఆత్మీయతలు

- మనసుకు చార్జింగ్ ఇచ్చేది ప్రేమ.. అనురాగమే!
- కల్తీ లేని బంధాలు కనుమరుగు..
- సెల్‌ఫోన్ మాయలో మానవ సంబంధాలు!
- మనుషుల మధ్య తగ్గుతున్న ఆత్మీయతలు..
- మసకబారుతున్న అనురాగాలు
- ప్రతి వస్తువుకూ చార్జింగ్ అవసరమే..
- మరి మానవ మనసుకు చార్జింగ్ ఎక్కడ..?

**కోహిర్, అక్టోబర్ 13 (జనం సాక్షి) :** ఒకప్పుడు మనుషుల మధ్య అనుబంధాలు ఎంతో ఆత్మీయంగా ఉండేవి. పలకరింపుల్లో ప్రేమ, మాటల్లో మమకారం, కలుసుకోవడంలో ఆనందం కనిపించేవి. పండుగలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు వచ్చినప్పుడు బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి సంతోషాలను పంచుకునేవారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ మానవత్వానికి నిజమైన అర్థం చెప్పేవారు. కానీ నేటి ఆధునిక జీవనశైలిలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోవడంతో ఆ కల్మషం లేని బంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రతి వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్.. ప్రతి ఇంట్లో ఇంటర్నెట్.. ప్రతి క్షణం సామాజిక మాధ్యమాల్లో గడిచిపోతున్న సమయం. పక్కనే మనిషి ఉన్నా పలకరించడానికి సమయం లేని పరిస్థితి నెలకొంటోంది. కుటుంబ సభ్యులు ఒకేచోట కూర్చున్నప్పటికీ ఎవరి చేతిలో వారి ఫోన్ ఉండటం, పరస్పరం మాట్లాడుకోవడం తగ్గిపోవడం నేటి సమాజంలో సాధారణంగా మారింది. దూరంగా ఉన్నవారితో సాంకేతికత ద్వారా మాట్లాడగలుగుతున్నా.. దగ్గరగా ఉన్నవారితో మనసు విప్పి మాట్లాడుకునే సమయం మాత్రం తగ్గిపోతోంది.

సెల్‌ఫోన్ దగ్గర చేస్తుందా.. దూరం చేస్తుందా..?

సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని సులభతరం చేసింది. ప్రపంచంలోని ఏ మూలన ఉన్నవారితోనైనా క్షణాల్లో మాట్లాడుకునే అవకాశం కల్పించింది. సమాచారం తెలుసుకోవడానికి, విద్యాభ్యాసానికి, ఉపాధి అవకాశాలకు సెల్‌ఫోన్ ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అవసరానికి మించి వినియోగించినప్పుడు అదే సాధనం మనుషుల మధ్య దూరాన్ని పెంచే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో



ఇతరుల జీవితాలను చూస్తూ సమయాన్ని గడుపుతున్న చాలామంది తమ కుటుంబ సభ్యుల భావాలను, స్నేహితుల ఆప్యాయతలను పట్టించుకోవడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గతంలో సాయంత్రం వేళల్లో ఇంటి ముందు కూర్చొని కబుర్లు చెప్పుకోవడం, పిల్లలు వీధుల్లో ఆటలాడుకోవడం, పెద్దలు తమ అనుభవాలను చిన్నవారికి వివరించడం కనిపించేది. నేడు అలాంటి దృశ్యాలు చాలా ప్రాంతాల్లో తగ్గుముఖం పడుతున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు మొబైల్ ఫోన్లకే ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో ప్రత్యక్ష పరిచయాలు, పరస్పర సంభాషణలు తగ్గుతున్నాయి. బంధుత్వాలు కేవలం పండుగ శుభాకాంక్షల సందేశాలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## మనసుకు చార్జింగ్ ఇచ్చేదెవరు?

ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు పనిచేయడానికి చార్జింగ్ ఎంత అవసరమో.. మానవ మనసుకు ఉత్సాహం, ప్రశాంతత, ప్రేమ, ఆప్యాయతలు అంతే అవసరం. సెల్‌ఫోన్ బ్యాటరీ అయిపోతే వెంటనే చార్జర్ కోసం వెతుకుతాం. కానీ మనసు అలసిపోయినప్పుడు, ఒంటరితనం ఆవహించినప్పుడు, బాధలు చుట్టుముట్టినప్పుడు మనకు ధైర్యం చెప్పే మనుషుల కోసం ఎంత సమయం కేటాయిస్తున్నాం? అనే ప్రశ్న ప్రతి ఒక్కరూ తమను తాము వేసుకోవాల్సిన అవసరం ఉంది.ఒక చిన్న పలకరింపు, ఆప్యాయంగా పలికే మాట, కష్టాల్లో ఉన్నవారికి అందించే చేయూత, కుటుంబ సభ్యులతో గడిపే కొంత సమయం.. ఇవే మనసుకు నిజమైన చార్జింగ్. డబ్బు, హోదా, సాంకేతిక సౌకర్యాలు ఎన్ని ఉన్నా ఆత్మీయతను కొనలేం. మనుషుల మధ్య నమ్మకం, ప్రేమ, పరస్పర గౌరవం ఉన్నప్పుడే జీవితానికి అసలైన సంతోషం లభిస్తుంది.

## ప్రకృతికి దూరమైతే.. మనుగడకే ముప్పు..!

మానవ సంబంధాలే కాదు.. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం కూడా క్రమంగా బలహీనపడుతోంది. చెట్లు, పచ్చని పొలాలు, స్వచ్ఛమైన గాలి, నీరు, పక్షుల కిలకిలరావాలు మనిషి జీవితంలో అంతర్భాగాలు. కానీ అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. చెట్లు తగ్గిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం, కాలుష్యం పెరగడం వంటి పరిణామాలు మానవ మనుగడపై ప్రభావం చూపుతాయి.

సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయితే మళ్లీ చార్జింగ్ చేసి పనిచేయించుకోవచ్చు. కానీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే, నీరు మరియు స్వచ్ఛమైన గాలి కొరత ఏర్పడితే, జీవవైవిధ్యం నశిస్తే వాటిని తిరిగి పూర్వస్థితికి తీసుకురావడం అంత సులభం కాదు. అందుకే ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి. మొక్కలు నాటడం, నీటిని పొదుపు చేయడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్నచిన్న చర్యలే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయి.

## మార్పు మన నుంచే ప్రారంభం కావాలి

సాంకేతికతను పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదు. దానిని అవసరానికి తగిన విధంగా వినియోగించుకోవడమే అసలైన విజ్ఞత. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో ఫోన్లను పక్కన పెట్టడం, పిల్లలకు సమయం కేటాయించడం, వృద్ధుల అనుభవాలను వినడం, స్నేహితులను ప్రత్యక్షంగా కలవడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా మానవ సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవచ్చు.రోజులో కొంత సమయాన్ని ప్రకృతితో గడపడం, మొక్కలను పెంచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అలవాటు చేసుకోవాలి. మనిషికి మనిషే తోడుగా నిలిచే సమాజాన్ని నిర్మించాలంటే ప్రేమ, అనురాగం, మానవత్వం అనే విలువలను కాపాడుకోవాలి.

# సైబర్ నేరాలపై అవగాహన

## అర్గుల్ ఎస్‌బీఐ బ్యాంక్, ఏటీఎంలో భద్రతా తనిఖీలు

**జనంసాక్షి:**
జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్గుల్ గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్ మరియు ఏటీఎంను డిచ్‌పల్లి సీఐ కె. వినోద్, జక్రాన్‌పల్లి ఎస్ఐ జి. మహేష్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ మరియు ఏటీఎంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, అలారం వ్యవస్థ, అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులకు సమాచారం అందించే అలర్ట్ వ్యవస్థ తదితర భద్రతా చర్యలను పరిశీలించారు. బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ప్రజల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఇటీవల వెలుగులోకి వస్తున్న సైబర్ నేరాల గురించి సీఐ కె. వినోద్ బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు మరియు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, తప్పుడు పెట్టుబడి పథకాలు, ఓటీపీ వివరాలు సేకరించడం వంటి పద్ధతులతో ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో వచ్చే సమాచారాన్ని వెంటనే నమ్మి స్పందించకుండా ఒక్కసారి ఆలోచించి, నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల భద్రత, బ్యాంకింగ్ వ్యవస్థలో రక్షణ చర్యలు మరియు సైబర్ నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరారు.



# కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్..
- 15 రోజుల్లో పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు..
- కార్మికుల పిల్లలకు న్యాయం చేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల అభివృద్ధి, కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు, ఎమ్మెల్యేలు ప్రేమసాగర్ రావు, గండ్ర సత్యనారాయణ రావు, తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ సమావేశంలో పాల్గొని సింగరేణి కార్మికులకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా..**

సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటించడం ద్వారా వారి శ్రమకు తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.1,754 కోట్ల లాభాల నేపథ్యంలో కార్మికులకు 34 శాతం వాటాను ప్రకటించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా అందించడం వారి కష్టానికి తగిన గౌరవాన్ని అందించడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు కూడా దోహదపడనుంది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సైతం ప్రభుత్వం శుభవార్త అందించింది. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటించడం ద్వారా వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. సంస్థ అభివృద్ధిలో రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కూడా కీలకమని గుర్తిస్తూ వారికి ప్రయోజనాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**ఒక్కో ఉద్యోగికి సగటున రూ.1,53,912**

దసరా బోనస్ 1,10,250 చొప్పున ప్రకటించిన సంగతి తెలిసిందే. కార్మికుల సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కార్మికులు, వారి కుటుంబాలు మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించేందుకు అవసరమైన సంక్షేమ చర్యలకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించింది. కార్మికుల ఆర్థిక భద్రతతో పాటు నివాస సదుపాయాల కల్పన కూడా ప్రభుత్వ లక్ష్యాల్లో భాగమని ఈ ప్రకటన స్పష్టం చేస్తోంది.

**15 రోజుల్లో పెండింగ్ ఉద్యోగాల సమస్యకు పరిష్కారం..**

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాల సమస్యపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. విజిలెన్స్ విచారణలు, పెండింగ్ కేసుల కారణంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కార్మికుల పిల్లలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, 15 రోజుల్లో ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించడం ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు నింపింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న కార్మికుల పిల్లలకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఊరట కల్పించేందుకు ఈ చర్యలు ఉపయోగపడనున్నాయి.

**కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత..**

సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తూ వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉంది. బొగ్గు ఉత్పత్తి నుంచి విద్యుత్ రంగం వరకు సింగరేణి కార్మికుల శ్రమ ఎంతో కీలకమైనది. అలాంటి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, ఉద్యోగాల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సింగరేణి కార్మికులకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వ పెద్దలతో కలిసి పాల్గొన్నారు. కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన నిర్ణయాలు, పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు సింగరేణి ప్రాంత ప్రజలకు ఎంతో ప్రాధాన్యమైనవిగా నిలవనున్నాయి. సింగరేణి కార్మికులకు లాభాల వాటా, కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్, సొంతింటి కల సాకారానికి హామీ, పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు వంటి ప్రకటనలు కార్మిక కుటుంబాల్లో సానుకూల ఆశలు కల్పిస్తున్నాయి. కార్మికుల సంక్షేమం, యువతకు ఉపాధి, కుటుంబాలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలపై సింగరేణి ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.



# రైతులకు నష్టం కలిగించే కాలువ నిర్మాణం వద్దు

**ఆర్డీవో షర్మిలకు బాధిత రైతుల విజ్ఞప్తి**

**కెనాల్ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కరీంనగర్ ఆర్డీవో షర్మిల..**

**చిగురుమామిడి అక్టోబర్ 13(జనంసాక్షి):**
మండలంలోని సుందరగిరి గ్రామంలో ఉల్లంపల్లి రహదారిని ఆనుకొని, ఇండ్ల మధ్య నుండి తవ్వ తలపెట్టిన 21ఎల్ మైనర్ కెనాల్‌ను వెంటనే రద్దు చేయాలని బాధిత రైతులు కరీంనగర్ ఆర్డీవో షర్మిలకు విజ్ఞప్తి చేశారు. కెనాల్ బాధిత రైతుల అభ్యర్థన మేరకు సోమవారం ఆమె క్షేత్రస్థాయికి చేరుకుని, కాలువ కింద నష్టపోతున్న భూములను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను ఆర్డీవో ముందు వెల్లబోసుకున్నారు. ఈ 21ఎల్ మైనర్ కెనాల్ కారణంగా 31మంది రైతులకు చెందిన సుమారు 7ఎకరాల భూమి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని రైతులు వివరించారు. ప్రస్తుతం ఈ భూములు కమర్షియల్ విలువలనే కాకుండా, ఇప్పటికే కొన్ని చోట్ల ప్లాట్లు, ఇండ్లు నిర్మించుకుని ఉన్నాయని తెలిపారు. రైతులకు ఏమాత్రం ఉపయోగపడని ఈ కెనాల్‌ను ఇండ్ల మధ్య నుండి తీయడం వల్ల తాము భారీగా నష్టపోతామని కన్నీరుమున్నీరయ్యారు. 2009లో చేసిన పాత సర్వే ఆధారంగా ఇప్పుడు పనులు చేయడం సరికాదని, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా అధికారులు వెంటనే రీ-డిజైన్ చేయాలని డిమాండ్ చేశారు.

**ఒక్క రైతు భూమి నుంచే మూడు కాలువలా..?**
జీల సంపత్ అనే బాధిత రైతు తన గోడును వెళ్లబోసుకున్నారు. తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమి నుంచే ఏకంగా మూడు కాలువలు వెళ్లేలా ప్లాన్ చేయడం ఎంతవరకు న్యాయమని ఆర్డీవోకు వివరించారు. గతంలో ఈ కాలువను రద్దు చేయాలని కోరుతూ తాము 10రోజుల పాటు 31మంది బాధితులం రిలే నిరాహార దీక్షలు చేశామని రైతులు గుర్తుచేశారు. అప్పటి ఆర్డీవో మహేశ్వర్ స్వయంగా వచ్చి, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం వల్లే తాము దీక్షలు విరమించామని తెలిపారు. ఆర్డీవో షర్మిల స్పందించి ఈ విషయాన్ని కలెక్టర్ కు నివేదించి, తమకు పూర్తి న్యాయం చేయాలని రైతుల పక్షాన బాధిత కుటుంబాలు వేడుకున్నాయి. భూములను పరిశీలించిన అనంతరం ఆర్డీవో షర్మిల మాట్లాడుతూ రైతుల సమస్యను, క్షేత్రస్థాయి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ కనకయ్య, ఇరిగేషన్ ఈఈ రాములు నాయక్ డిఈ ప్రశాంత్, బాధిత రైతులు మంతెన శ్రీనివాస్, రవి వర్మ, జీల రాజేశం, జీల ఐలయ్య, జీల మల్లేష్, జీల రవి, మంతెన బాబు, వంతడుపుల తిరుపతి, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు ముమ్మర ఏర్పాట్లు

**గడువులోగా పనులను పూర్తి చేయాలి • కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల పనులు పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 13 (జనంసాక్షి):**
వచ్చే ఏడాది జూన్, జూలై నెలల్లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు. రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి, మంజీర, హరిద్ర నదుల త్రివేణి సంగమ ప్రాంతంలో ఉన్న పుష్కర ఘాట్‌తో పాటు, నవీపేట మండలం యంచ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లను మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. కందకుర్తి వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి, పుష్కర ఘాట్ నిర్మాణం, ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు .గోదావరిలో నీటి ప్రవాహం కారణంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కొన్ని పనుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులను వేగవంతం చేసి, మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని ఆర్డీఓలు, తహసీల్దార్లు వారానికి కనీసం రెండుసార్లు పర్యవేక్షించాలని సూచించారు. అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం వంటి పనులను సమాంతరంగా చేపట్టి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని, గ్రామ పాలన అధికారులు, లష్కర్లు నిరంతరం పర్యవేక్షిస్తూ నిఘా ఉంచాలని సూచించారు. పనుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు.



**యంచలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి**
నవీపేట మండలం యంచ వద్ద నిర్మించనున్న పుష్కర ఘాట్‌తో పాటు పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రవాణా, పార్కింగ్, మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పిండ ప్రదానం, కేశఖండనం నిర్వహించుకునేందుకు అనువుగా షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా, పుష్కర ప్రాంతాల్లో భద్రతతో కూడిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ పర్యటనలో బోధన్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకటరమణతో పాటు దేవాదాయ, పంచాయతీరాజ్, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ

**గుడ్ల సరఫరా టెండర్ల సాంకేతిక బిడ్ల పరిశీలన పూర్తి**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఅక్టోబర్ 13 (జనంసాక్షి):**
కామారెడ్డి జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా చేసేందుకు నిర్వహించిన టెండర్లలో భాగంగా మంగళవారం సాంకేతిక బిడ్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన ఈ పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా టెండర్లలో పాల్గొన్న వివిధ సంస్థలు, సరఫరాదారులు సమర్పించిన సాంకేతిక బిడ్లు, వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్దేశించిన అర్హత ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా టెండర్లలో పాల్గొన్న సంస్థల అర్హతలను కమిటీ సభ్యులు సమీక్షించారు. అదనపు కలెక్టర్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొ న్నారు. జిల్లాలోని సంక్షేమ, గురుకుల వసతి గృహాలకు గుడ్ల సరఫరా ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తదుపరి టెండర్ల ప్రక్రియను కూడా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో భాగంగా గుడ్ల సరఫరా ప్రక్రియ సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు.

# ట్రంప్‌పై పెట్టుబడి.. మస్క్‌కు రూ.66 లక్షల కోట్ల లాభం

**అమెరికా నేత ఎద్దేవా..!**



**వాషింగ్టన్(జనంసాక్షి):**
భారత్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు అనుమతుల జాప్యంపై ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ చేస్తోన్న విమర్శలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పుడు ఆయనపై అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్ ఎదురుదాడి చేశారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో మస్క్ 290 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారని దుయ్యబట్టారు. "ఆ ఖర్చుకు ఫలితం లభించింది. ఆ తర్వాత ఆయన సంపద 696 బిలియన్ డాలర్లు (రూ.66 లక్షల కోట్లు) పెరిగి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారారు" అని సాండర్స్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. "కానీ మస్క్ ఇక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్)లో రిపబ్లికన్ల పట్టు కొనసాగించేందుకు మస్క్ 366 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారు. మస్క్‌ను ఆపండి.. కుబేరుల రాజ్యానికి (ఒలిగార్కీ) ముగింపు పలకండి" అని సాండర్స్ మండిపడ్డారు. భారత దేశంలో తన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించకుండా కొందరు ఒలిగార్క్‌లు (సంపన్నులు) అడ్డుకుంటున్నారని మస్క్ ఆరోపించిన సంగతి తెలిసిందే. తద్వారా వారు భారత్‌లో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకోవాలని చూస్తున్నట్లు విమర్శించారు. భాజపా ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ముమ్మరం చేయడానికి అవసరమైన నిధుల్ని రిలయన్స్‌తో సంబంధం ఉన్న కంపెనీ సమకూర్చిందంటూ మీడియా కథనాలను షేర్ చేశారు. ఇప్పుడు మస్క్‌ను ఉద్దేశించి సాండర్స్ అలాంటి విమర్శలే చేయడం గమనార్హం.

# కోతుల బెడద.. తప్పేదెలా..!?

**రక్షించండంటూ ప్రజావాణిలో ఫిర్యాదు**

**మల్యాల అక్టోబర్ (జనంసాక్షి):**
మల్యాల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తీవ్రమవుతున్న కోతుల బెడదను అరికట్టాలని సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మాజీ ఎంపీటీసీ రమేష్, వేణు పలువురు యువకులు ఫిర్యాదు చేశారు. కోతులు ఇళ్లల్లోకి చొరబడి చిందరవందర చేస్తు ప్రజలపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, గతంలో చాలామంది పిల్లలు వృద్ధులపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయాని అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకొని కోతుల నుండి రక్షణ కల్పించాలని కోరారు. నర్సరీల ద్వారా కోతులకు ఆహారంగా ఉపయోగపడే పండ్ల మొక్కలను పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూమిలో గుట్టల ప్రాంతంలో గుంతలు తవ్వడం కాకుండా పండ్ల చెట్లను నాటాలని విజ్ఞప్తి చేశారు.



# హూతీల దెబ్బకు..

**ప్యాలెస్‌లు మార్చుతున్న సౌదీ యువరాజు..!**

**రియాద్(జనంసాక్షి):**
దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా సౌదీ అరేబియాపై హూతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడుతున్నారు. దీంతో సౌదీ ప్రభుత్వం ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఎప్పుడు ఏ రాజభవనంలో ఉంటున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రత్యేకంగా ఎంపిక చేసిన భద్రతా బృందం ఆయన్ను రక్షించేందుకు ఎప్పటికప్పుడు బంకర్లు, పటిష్ఠ భద్రత ఉన్న వేర్వేరు ప్యాలెస్‌లకు తరలిస్తోంది. సౌదీలోని విమానాశ్రయాలు, ఇంధన మౌలిక సదుపాయాలు, నౌకామార్గాలే లక్ష్యంగా హూతీలు దాడులు చేస్తున్నారు. ఇటీవల రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో దాదాపు 13 మంది మృతి చెందగా.. 300 మందికిపైగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఎంబీఎస్‌కు అందిస్తోన్న మరింత పెంచారు. అలాగే బహిరంగ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గతవారం సౌదీలో రక్తదాన కార్యక్రమం జరిగింది. ఆ తర్వాత నుంచి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించడం లేదని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. భద్రతాకారణాలరీత్యా ఆయన్ను ఒక రాజభవనం నుంచి మరొక రాజభవనం నుంచి తరలిస్తున్నారు. ఈ ప్యాలెస్‌లలో కట్టుదిట్టమైన భద్రత ఉండటమే గాకుండా.. క్షిపణి దాడులను తట్టుకునేలా బంకర్లు ఉన్నాయి. హూతీల వద్ద బాలిస్టిక్ క్షిపణులతోపాటు ప్రయాణ సమయంలోనే దిశ మార్చుకోగల అధునాతన మిసైల్స్ కూడా ఉన్నాయి. ఇవి సౌదీ అరేబియా ఉపయోగిస్తున్న పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్‌లు, ఇతర రక్షణ వ్యవస్థలకు సవాల్ విసురుతుండటంతో సౌదీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. హూతీల దాడి ఎంబీఎస్‌పై ఒత్తిడి పెంచుతోంది. సౌదీని చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థగానే ఉంచకుండా వైవిధ్యతను తీసుకురావాలని ప్రతిష్టాత్మక ప్రణాళికతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఆ ప్రణాళికకు హూతీల దాడులు సవాలు మారాయి. పర్యాటకంగానూ సౌదీ ఆశయాలను, పెట్టుబడి ప్రాజెక్టులను ప్రమాదంలో పడేస్తున్నాయి. ఇలాంటి కాపాడుతుందనుకున్న మిత్రదేశం అమెరికా హ్యాండివ్వడం, మక్కా ఒప్పందం అక్కరకు రాకపోవడంతో సౌదీ పరిస్థితి ఇప్పుడు గందరగోళంగా మారింది.



# ఆయిల్ పామ్ వైపు.. అడుగులు!

- సంప్రదాయ వరి విడిచి.. ఉద్యాన పంటల బాట
- అంతర పంటలతో రైతులకు రెట్టింపు ఆదాయం
- 'భూ భారతి' రీ-సర్వే పక్కాగా జరగాలి
- వరదవెల్లి, రత్నంపేటల్లో కలెక్టర్ గరిమ అగ్రవాల్ పర్యటన

**బోయినపల్లి, అక్టోబరు 13 (జనంసాక్షి):**
వర్షాభావ పరిస్థితులు, తగ్గుతున్న భూగర్భ జలాల నేపథ్యంలో రైతులు సంప్రదాయ వరి సాగును వీడి ప్రత్యామ్నాయ, ఉద్యానవన పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. బోయినపల్లి మండలం వరదవెల్లి, రత్నంపేట గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ పర్యటించి ఆయిల్ పామ్ తోటలు, అంతర పంటలు, భూమి రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఆయిల్ పామ్‌లో 'అంతర' లాభాలు!**
వరదవెల్లికి చెందిన రైతు కడుదుల రాజు-అంజలి దంపతులు తమకున్న 8 ఎకరాల్లో వరిని తగ్గించి, 3.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. అందులో అంతర పంటలుగా బెండ, టమాటా, మిర్చి, కాలీఫ్లవర్ తో పాటు పండుగల సీజన్ లక్ష్యంగా బంతి, పట్టుకుచ్చులు (పూల తోటలు), వేరుశెనగ పండిస్తున్నారు.
వారి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ పంటల దిగుబడి, ఆదాయ వివరాలను ఆరా తీశారు. వరి వేస్తే ఎకరానికి రూ.50 వేలు వచ్చేదని, ఉద్యాన పంటల ద్వారా ఇప్పుడు ఎకరానికి దాదాపు రూ.లక్ష ఆదాయం వస్తోందని రైతు వివరించడంతో కలెక్టర్ వారిని అభినందించారు. తక్కువ నీటితో, బిందు సేద్యం (డ్రిప్) ద్వారా అధిక లాభాలు గడిస్తున్న రాజు దంపతులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు.

**రూ.లక్షల ఆదాయం ఇచ్చే తోటలు**
అనంతరం అదే గ్రామంలో రైతు తరిగొప్పుల మురళికి చెందిన 4.20 ఎకరాల్లో 'వీబీజీ రామ్‌జీ' పథకం ద్వారా కూలీలతో



తవ్వించిన గుంతల్లో కలెక్టర్ ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఆయిల్ పామ్ సుదీర్ఘకాలం పాటు స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుందని, సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. రత్నంపేటలో రైతు కౌటగాని పద్మ తోటలో నిర్మిస్తున్న 'పామ్ పాండ్' పనులను పరిశీలించారు. 'జలసిరి' కింద భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

**రైతుల సమక్షంలోనే 'భూ భారతి' రీ-సర్వే**
వరదవెల్లిలో 'భూ భారతి' పథకంలో భాగంగా రోవర్ యంత్రంతో నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. సర్వే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే, పూర్తి పారదర్శకతతో చేపట్టి పక్కాగా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో సర్వేకు ముందే జీపీఓలు, పంచాయతీ కార్యదర్శులు రైతులకు ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, తహసీల్దార్ షరీఫ్ మొహిద్దిన్, ఇన్చార్జి ఎంపీడీఓ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

# బెడిసికొట్టిన బెల్ట్ షాపుల వ్యవహారం..!

## సీఐ విచిత్ర తీర్పు.. గ్రామస్తుల అవాక్కు

- బండమీదిపల్లివాసుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన వివాదం
- ఎక్సైజ్ సీఐ వెంకటేష్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. పాలమూరు విశ్వవిద్యాలయం సమీపంలోని బండమీదిపల్లి గ్రామంలో విచ్చలవిడిగా వెలిసిన అక్రమ బెల్ట్ షాపులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు, బాధితులు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అయితే, గ్రామస్థుల విన్నపానికి సానుకూలంగా స్పందించాల్సింది పోయి ఎక్సైజ్ సీఐ వెంకటేష్ బాధితులపైనే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం జిల్లా వ్యాప్తంగా పెను దుమారం రేపుతోంది. గత పదేళ్లుగా నడుస్తున్న బెల్ట్ షాపులను ఇప్పుడు ఎలా తొలగిస్తామని, వాటిని తొలగిస్తే రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుందన్నట్లుగా సీఐ మాట్లాడటంపై గ్రామస్థులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్య నియంత్రణ చూడాల్సిన అధికారులే ఈ రకంగా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తూ మాట్లాడటం వెనుక అసలు నిజాలు బయటపడ్డాయి.

**మామూళ్లకు అలవాటు పడే..**

ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపుల నిర్వాహకులతో పూర్తిగా కుమ్మక్కయ్యారని, వారి నుంచి ప్రతి నెలా పెద్ద ఎత్తున అందుతున్న మామూళ్లకు అలవాటు పడే ఈ అక్రమ దందాను ప్రోత్సహిస్తున్నారని బాధితులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ గ్రామాల్లో పేద కుటుంబాలు నాశనమవుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్వయంగా బెల్ట్ షాపులను నడిపిస్తోందా అనే రీతిలో సీఐ వ్యాఖ్యలు ఉండటంపై జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది.

**ఎక్సైజ్ సీఐ సస్పెన్షన్‌కు డిమాండ్**

ఈ క్రమంలో బండమీదిపల్లి గ్రామస్థులంతా ఏకమై జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, బెల్ట్ షాపుల నిర్వాహకులకు కొమ్ము కాస్తున్న ఎక్సైజ్ సీఐ వెంకటేష్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఆయనపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ సీఐపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలతో పాటు రహదారుల దిగ్బంధనానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

# పోసానిపేటలో వ్యవసాయ భూమి అక్రమ లేఅవుట్?



**రిజిస్ట్రేషన్లు చేయవద్దంటూ లేఖ?**

సర్వే నంబర్ 255లోని భూములకు సంబంధించి క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు చేయవద్దని అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి లేఖ పంపినట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ భూముల్లోని ప్లాట్లను కొనుగోలు చేయడం, విక్రయించడం చేయవద్దంటూ పోసానిపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సర్వే నంబర్ 255లో నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల విక్రయాలు

- అనుమతులు లేకుండా ఆరు దుకాణాల నిర్మాణం
- రెండుసార్లు నోటీసులు జారీ చేసిన స్పందన కరువు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** సంగారెడ్డి జిల్లా పోసానిపేట శివారులోని టీచర్స్ కాలనీ పక్కన, బుక్క రాజయ్యకు ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 255లో వ్యవసాయ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లుగా చేసి విక్రయించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. దివంగత పులుగు కిష్టయ్య భార్య పులుగు లక్ష్మీబాయి, మన్‌సాన్‌పల్లి మల్లికార్జున్ కుటుంబ సభ్యులకు సంబంధించినదిగా చెబుతున్న 3 ఎకరాల 8 గుంటల భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చకముందే, అనుమతి పొందిన లేఅవుట్ లేకుండా విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



గ్రామపంచాయతీకి చెల్లించాల్సిన రుసుములు చెల్లించకపోవడం, భూమిని తనఖా పెట్టకపోవడం, పిల్లల పార్కు ఏర్పాటు చేయకపోవడం, అంతర్గత రహదారులు వేయకపోవడం, నీటి వసతి కల్పించకపోవడం వంటి నిబంధ నలను ఉల్లంఘించినట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. అంతేకాకు ండా, అవసరమైన అనుమతులు లేకుండానే సుమారు ఆరు దుకాణాల నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు.

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు**

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి తదితర అధికారులకు వినతిపత్రా లు సమర్పించినట్లు ఫిర్యాదుదారులు తెలిపారు. ఫిర్యాదులపై విచారణ అనంతరం అక్కడి దుకాణాలు, భవనాల యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రెండుసార్లు నోటీసులు ఇచ్చినా సంబంధిత వ్యక్తుల నుంచి అధికారులకు వివరణ అందలేదని పేర్కొన్నారు.

**అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే అక్రమ నిర్మాణాల ను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై త్వరలో సంబంధిత పత్రాలు, ఆధారాలతో పాత్రికేయులను ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ 255లో భూమి విభజన, విక్రయాలు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు, అధికారుల నోటీసులు, రిజిస్ట్రేషన్లపై ఆంక్షల వాస్తవ పరిస్థితిని సంబంధిత శాఖలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# బతుకమ్మ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- లైటింగ్, పారిశుద్ధ్యం, భద్రతకు ప్రాధాన్యం
- నిమజ్జన ప్రాంతాల్లో ఈతగాళ్లు, వైద్య శిబిరాలు
- అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జిల్లాలో బతుకమ్మ ఉత్సవాల ను వైభవంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, పట్టణాలు, కరీంనగర్ నగరంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళాభివృద్ధి, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులను భాగస్వా ములను చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, పారిశుద్ధ్యం, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు, వైద్య, యువజన క్రీడల శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మానేరు నది, మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట చెరువులు, కాకతీయ కాలువ ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జలకుమారితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐలమ్మ విగ్రహ ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి : ఐలమ్మ జయంతోత్సవ కమిటీ కన్వీనర్ సాయికృష్ణ



**హుజూరాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఐలమ్మ జయంతోత్సవ కమిటీ కన్వీనర్ నిమ్మటూరి సాయికృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం భూస్వామ్య వ్యవస్థపై పోరాడిన ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆమె విగ్రహాన్ని ధ్వంసం చేయడం మహిళల ఆత్మగౌరవంతోపాటు బడుగు, బలహీన వర్గాల మనోభావాలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేసే వారిపై కఠిన శిక్షలు విధించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని, ఈ ఘటనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందిస్తూ, ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సాయికృష్ణ పిలుపునిచ్చారు.



# పేట ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

## 3.5 కిలోల బరువున్న రొమ్ము గడ్డ తొలగించిన డాక్టర్లు

నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 13(జనం సాక్షి):నారాయణపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో మంగళవారం డాక్టర్లు అరుదైన శాస్త్ర చికిత్స విజ యవంతంగా నిర్వహించా రు. అరుదైన ఫిలోడ్స్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గురుమిత్కాల్ గ్రామానికి చెందిన శంకరమ్మ గత ఎనిమిది సంవత్సరాలుగా కుడివైపు రొమ్ములో గడ్డతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆమె నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించగా, వైద్యులు పరీక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నారు. మంగళవారం ఉదయం జనరల్ సర్జరీ విభాగం వైద్య బృందం ఆమెకు విజ యవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ శస్త్ర చికిత్సలో 3.50 కిలోల బరువున్న గడ్డను తొలగిం చి, తదుపరి పరీక్షల నిమి త్తం బయాప్సీ పరీక్షకు పంపించారు. పరీక్షల ఫలి తాల ఆధారంగా గడ్డ స్వభా వాన్ని నిర్ధారించనున్నారు. ఈ శస్త్రచికిత్సలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆదిత్య డాక్టర్ వినీల డాక్టర్ రత్న, డాక్టర్ రహీం, డాక్టర్ వివేక్ పాల్గొన్నారు. అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ నీలవర్ణ, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సాయికుమార్ సేవలందించారు. స్టాఫ్ నర్సులు ప్రవళిక, స్వప్న, కిరణ్, గోపి శస్త్రచికిత్సకు సహకరించారు. ఈ సంద ర్భంగా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్ మాట్లా డుతూ, నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుప త్రిలో అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల వైద్య బృందా న్ని అభినందించారు.

# నేదునూరులో బిడిఆర్ ఫామ్ హౌస్ కూల్చివేత!

- ధరణి లొసుగులతో డబుల్ రిజిస్ట్రేషన్లు
- అమాయకులకు కోట్లలో బురిడీ
- అక్రమ కట్టడాలపై అధికారుల ఉక్కుపాదం



**కందుకూరు, అక్టోబర్ 13 (జనంసాక్షి):** కందుకూరు మండలం నేదునూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 643లో అక్రమంగా నిర్మించిన బి.డి.ఆర్ (దీణ=) ఫామ్ హౌస్‌ను పంచాయతీ, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

కందుకూరు మండలం దెబ్బడగూడ గ్రామానికి చెందిన టంకరి విజయలక్ష్మి ఔ/శీ టంకరి నరసింహారెడ్డి దగ్గర , మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాట్రావత్ రాజేష్,కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన దినేష్ తో కలిసి సర్వే నంబర్ 643లోని ఏడు ఎకరాల భూమిలో 2019-20 ప్రాంతంలో 'బి.డి.ఆర్ ఫామ్ లేఅవుట్' చేశారు. అందులోని 24 ప్లాట్లను మహేశ్వరం ఎస్.ఆర్.ఓ (ా=ా) ఆఫీస్ ద్వారా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ కూడా చేశారు.

**ధరణి రాకతో మొదలైన మోసం**

2021లో ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకురావడంతో, అంతకుముందు అమ్మిన భూములు మ్యూటేషన్ కాకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న సదరు వ్యక్తులు అక్రమాలకు తెరలేపారు. రికార్డుల్లో భూమి ఇంకా విజయలక్ష్మి పేరు మీదే ఉండటంతో, గతంలో తాము అమ్మేసిన ప్లాట్లనే మళ్లీ రెండోసారి వేరే వ్యక్తులకు అమ్మి కోట్లు కొల్లగొట్టారు. ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు వారిని ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతూ మోసానికి పాల్పడ్డారు. దీంతో కొంతమంది బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్ (Injunction Order) కూడా తెచ్చుకున్నారు.

**కలెక్టర్ ఆదేశాలతో కూల్చివేత**

కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, సదరు వ్యక్తులు ఎమ్మార్వో ఆఫీస్ ద్వారా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచిన సర్వే నంబర్ 643లోని ఒక ఎకరం స్థలంలో అక్రమంగా బి.డి.ఆర్ ఫామ్ హౌస్ నిర్మించి ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారు. ఇక్కడకు వచ్చిన కొనుగోలుదారులు వీరి మోసాలను గ్రహించి వెనక్కి తగ్గి, ఈ అక్రమాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి, డిపిఓ (DPO)కి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ పూర్తి విచారణ జరపాలని డిపిఓను ఆదేశించారు. విచారణలో అది అక్రమ నిర్మాణమని తేలడంతో పంచాయతీ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి ఆ ఫామ్ హౌస్‌ను నేలమట్టం చేశారు.

**'భూభారతి' ద్వారా న్యాయం చేయాలి: బాధితుల వేడుకోలు.**

లేఅవుట్‌లో డబుల్ రిజిస్ట్రేషన్లు చేయడమే కాకుండా, చివరికి లేఅవుట్ రోడ్లను కూడా మోసపూరితంగా అమ్మివేశారని మండిపడ్డారు. ఈ సందర్భంగా బాధితులు సపావత్ అనసూయ, బదావత్ సరోజ, విస్లావత్ సునీత, వి.జ్యోతి, డి. ప్రవీణ్ కుమార్, డి. సునీత, పుష్పాంజలి, నవనీత్ కిషోర్, ప్రీతి కుమారి, రేనా కుమారి జిల్లా కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి కి పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తూ – ఈ " బిడిఆర్ లేఅవుట్ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, నూతనంగా వస్తున్న 'భూభారతి' ద్వారా మోసపోయిన అమాయకులకు న్యాయం చేయాలని, మోసానికి పాల్పడిన వ్యక్తుల ఆస్తులను జప్తు చేసి, వారికి సహకరించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు.



# పండుగల వేళ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

## మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వేములవాడ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తూ పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. ప్రజలంతా పండుగలను పరిశుభ్రమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని, నిర్దేశిత ప్రదేశాల్లోనే చెత్త వేయాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### బతుకమ్మలతో నిరసన.. ట్రాఫిక్ జామ్

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 13 (జనంసాక్షి) :** కరీంనగర్ డంపింగ్ యార్డ్ పొగ నుంచి రక్షించాలని కోరుతూ బైపాస్ వద్ద బతుకమ్మ ఆడిన అనంతరం మహిళలు నిరసన తెలిపారు. మహిళలు చేసిన ఈ నిరసన కాస్త ఉద్రిక్తతకు దారితీసింది. ఎన్టీఆర్ విగ్రహం వద్ద రాజీవ్ రహదారిపై మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకొని రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సమస్య: డంపర్ యార్డ్ నుంచి వచ్చే పొగతో ఊపిరి పీల్చుకోలేకపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రాస్తారోకో కారణంగా వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.





# ఆక్రమణలపై ఉక్కుపాదం

## ఎంఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపు

- మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్లలో ప్రత్యేక డ్రైవ్‌లు
- ప్రజా స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు
- కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతోపాటు అక్రమ నిర్మాణాల తొలగింపుపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) అధికారులు దృష్టి సారించారు. కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ ఆదేశాల మేరకు మంగళవారం మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అనధికార నిర్మాణాలు, రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు.

**మల్కాజిగిరి జోన్‌లో..**

బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్‌లో ప్రైవేట్ భవనం వద్ద అనధికారంగా ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను అధికారులు తొలగించారు. ఫతేనగర్ నుంచి గౌతమ్‌నగర్ వరకు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. యోగేంద్ర పార్థి ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేశారు.

**ఉప్పల్ జోన్‌లో..**

ఘట్‌కేసర్ పరిధిలోని ఎస్‌వీ నగర్ నుంచి రాంపల్లి ఎక్స్‌రోడ్, నాగారం డివిజన్ వరకు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. కాచవాని సింగారంలో అక్రమంగా నిర్మించిన ఎనిమిది ర్యాంపులను తొలగించారు. ఉప్పల్ ఎక్స్‌రోడ్ నుంచి నాగోల్ వైపు, ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లోని డీ-మార్ట్ ప్రాంతం వరకు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగించారు. బోడుప్పల్ పరిధిలోని పీర్జాదిగూడ సర్కిల్-10, శంకర్‌నగర్ లో రహదారిని ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను తొలగించారు.

**ఎల్‌బీ నగర్ జోన్‌లో..**

నాగోల్ పరిధిలోని బండ్లగూడ, నాగోల్ డివిజన్‌లోని అప్కో కాలనీలో అనధికారికంగా చేపట్టిన నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అక్రమంగా నిర్మించిన పెంట్‌హౌస్, గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణాలకు సంబంధించి గ్రౌండ్‌ఫ్లోర్ గోడలు, రెండో అంతస్తుపై నిర్మించిన పిల్లర్లను తొలగించారు. సరూర్‌నగర్ పరిధిలోని అష్టలక్ష్మి కమాన్ నుంచి డీవీఎం కాలేజ్, సిరీస్ రోడ్డు వరకు ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో సుమారు 1.5 మీటర్ల మేర ఆక్రమణలను తొలగించి, 15 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌బీ నగర్ పరిధిలోని కర్మన్‌ఘాట్ గ్రీన్ పార్క్ కాలనీలోనూ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

**ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యం**

ప్రజా ఆస్తుల పరిరక్షణ, రహదారులపై సాఫీగా రాకపోకలు, పాదచారుల భద్రత, క్రమబద్ధమైన పట్టణ అభివృద్ధి ఎంఎంసీ ప్రధాన లక్ష్యాలని కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు.

రహదారులు, ఫుట్‌పాత్‌లు, ఇతర ప్రజా వినియోగ ప్రాంతాలను ఆక్రమించడం వల్ల పాదచారుల రాకపోకలకు, ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అనుమ తులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం, రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం వంటి చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపు అనంతరం ఆయా ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశిం చారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ తదితర విభాగాలు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ, ప్రజా స్థలాలను ఆక్రమించకుండా సహకరించాలని కమిషనర్ కోరారు.

# కోదాడ నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి రూ.52.50 కోట్లు మంజూరు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల కృషితో నాలుగు ప్రధాన రహదారులకు నిధులు
- రహదారుల విస్తరణ, పటిష్టీకరణకు పరిపాలనా అనుమతులు
- జీవో ఆర్టీ నంబర్ 533 జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం





**కోదాడ, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** కోదాడ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.52.50 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిల ప్రత్యేక చొరవ, కృషితో నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ, పటిష్టీకరణ పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ మంగళవారం జీవో ఆర్టీ నంబర్ 533ను జారీ చేసింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్లాన్ ఎండీఆర్ నిధుల కింద మొత్తం రూ.52.50 కోట్లతో నాలుగు రహదారుల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**మంజూరైన రహదారి మార్గాలు**

పాత జాతీయ రహదారి-9 నుంచి కొండాపురం వరకు 12.2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, పటిష్టీకరణకు రూ.27 కోట్లు, బేతవోలు నుంచి ఆచార్యులగూడెం వరకు 5.6 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.13.50 కోట్లు మంజూరయ్యాయి. అదేవిధం గా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కిష్టాపురం రోడ్డు వరకు 2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.4.50 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రామలక్ష్మీపురం వరకు 3.1 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. ఈ నాలుగు రహదారుల అభివృద్ధి పనులతో ఆయా గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, ప్రజలు వైద్య, ఇతర అవసరాల కోసం ప్రయాణించేందుకు సౌకర్యవంతంగా మారనున్నాయి. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రభుత్వ స్థాయిలో కృషి చేశారు .మంజూరైన రహదారి పనులకు సంబంధించి తదుపరి చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

**రూ.52.50 కోట్ల నిధుల మంజూరుపై హర్షం**

కోదాడ నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.52.50 కోట్ల నిధులు మంజూరు కావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 13 (జనం సాక్షి);** జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో భూముల రీ సర్వే కొనసాగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల సరిహద్దు సర్వే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చేపట్టాలని, భూములకు సంబంధించిన సమాచారం పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారి, డీఐలు భూముల రీసర్వే చేపడుతున్న గ్రామాలలో పర్యటించి, ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా, పకడ్బందీగా సేకరించాలని ఆదేశించారు. ఇట్టి సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, సర్వేయర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ బకాయిల కోసం 'చలో సెక్రటేరియట్'

## రాష్ట్రవ్యాప్తంగా 6 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన

- బకాయిలు అందక 283 మంది మృతి చెందారు
- ఒక్కొక్కరికి రూ.50-60 లక్షల వరకు బకాయిలు
- పెండింగ్ మొత్తాలను వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విజ్ఞప్తి




**కరీంనగర్ కల్చరల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన పెన్షన్ సంబంధిత బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 6 వేల మంది పాల్గొన్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి బిక్షపతి తెలిపారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన వారికి జీపీఎఫ్, జీఐఎస్, టీజీఎల్ఐ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యుటీతోపాటు డీఏ బకాయిలు పూర్తిస్థాయిలో అందలేదని నాయకులు పేర్కొన్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని, కొంతమేర చెల్లింపులు జరిగినా మిగిలిన మొత్తాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 25,943 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారని, ఈ ఏడాది మరో 9,719 మంది పదవీ విరమణ చేయనున్నారని తెలిపారు. బకాయిలు అందక, మెరుగైన వైద్యం పొందలేక 283 మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మృతి చెందినట్లు పేర్కొంటూ, వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారం కోసం ఏడాదిగా ఉద్యమాలు చేస్తున్నామని, తమ ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం రూ.6 వేల కోట్లు మంజూరు చేసినప్పటికీ బకాయిల సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని నాయకులు తెలిపారు. సెప్టెంబరు 30న వినతిపత్రం ఇచ్చినా స్పందన లేకపోవడంతో చలో సెక్రటేరియట్ చేపట్టినట్లు వివరించారు. పెండింగ్ బకాయిలను వడ్డీతో సహా ఏకమొత్తంగా చెల్లించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# శేరిలింగంపల్లి కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియామకం

## ఉత్తర్వులు జారీ చేసిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ శాసనమండలి ఎన్నికలలో శేరిలింగంపల్లి కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నియామకం చేస్తూ మంగళవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ మరియు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా వేగవంతం చేయడానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్లను (పరిశీలకులను) నియమించారు. ఈ నియామకాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా పరిధిలోని 52- శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నియామకం ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఇతర కీలక భాగస్వాములను సమన్వయం చేస్తూ విజయవంతంగా పూర్తి చేయడమే కోఆర్డినేటర్ల ప్రధాన లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పట్టభద్రుల ఓటర్ల నమోదును విస్తృతంగా చేపట్టాలని టీపీసీసీ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శేరిలింగంపల్లి నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు అప్పగించడం పట్ల స్థానిక పార్టీ శ్రేణులు, హర్షం వ్యక్తం చేశారు.

# భూవివాదంలో రైతు మృతి.. నిందితుడిని అరెస్ట్ చేయాలి

- టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీకుమార్ డిమాండ్
- భూమి రిజిస్ట్రేషన్ వివాదమే కారణమని ఆరోపణ
- బెదిరింపులతో మనస్తాపానికి గురై రైతు ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడి
- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని విమర్శ




**హుజూరాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** భూవివాదం నేపథ్యంలో రైతు కన్నబోయిన ఓదెలు మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజనీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం వెంకట్రావుపల్లికి చెందిన రైతు కన్నబోయిన ఓదెలు 2018లో పత్తి కృష్ణారెడ్డి సోదరుడు విష్ణువర్ధన్‌రెడ్డి నుంచి 1 ఎకరం 4 గుంటల భూమిని సాదాబైనామా ద్వారా రూ.10.40 లక్షలకు కొనుగోలు చేశారు. కుటుంబ, న్యాయపరమైన వివాదాల కారణంగా రిజిస్ట్రేషన్ ఆలస్యమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో 2022లో రెవెన్యూ అధికారుల సహకారంతో ఆ భూమిని కృష్ణారెడ్డి తన పేరుపై నమోదు చేసుకున్నారని ఆరోపించారు. గతంలో చెల్లించిన మొత్తానికి బదులుగా రూ.2.70 లక్షలే ఇస్తానంటూ బెదిరించినట్లు పేర్కొన్నారు.

ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓదెలు గత నెల 2న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ 3న మృతి చెందారని రజనీకుమార్ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఎస్‌హెచ్‌ఓకు వినతి పత్రం అందజేశామని, కరీంనగర్ పోలీసు కమిషనర్, ఏసీపీలకు కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీఆర్‌పీ మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, బొడ్డు దేవదాస్, బొడ్డు సుమన్, ఇమ్మడి ఉదయ్‌కుమార్, తామన్ రామన్‌కుమార్, మృతుడి కుమారుడు కన్నబోయిన కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్



- ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీ
- జిల్లాలో చేపట్టిన నిరసనలపై సీఎంకు వివరించిన వైద్యుల అంజన్ కుమార్

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి) :** ఢిల్లీలోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగినటువంటి సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాయకులతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు అరికెల వేణుగోపాల్, అర్బన్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సయ్యద్ అజ్మతుల్లా ఉసేని, ఐవైసీ జనరల్ సెక్రెటరీ శ్రావణ్ రావులను మర్యాదపూర్వకంగా తదితరులతో కలిసి ఈ బేటీలో వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు. సోమవారం ఢిల్లీలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యుల అంజన్ కుమార్, ర్యాలీ వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు వివరించారు. అలాగే కరీంనగర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల భాగస్వామ్యం, ప్రజల స్పందన తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేకంగా ఒక్కొక్కరితో ఫోటో సెషన్ నడిచిందని వైద్యుల అంజన్ కుమార్ తెలిపారు.

# పెద్దమ్మ కాలనీలో ఇంట్లో చోరీ

## ఐదు తులాల వెండి అపహరణ

**శామీర్ పేట్, అక్టోబర్ 13( జనం సాక్షి) :** ఇంటి తాళాలు పగుల కొట్టి దొంగతనం చేసిన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దమ్మ కాలనీలో చోరీ ఘటన కలకలం రేపింది. ఇంటి యజమానులు ఊరికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి యజ మానులు ఊరికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించారు.

ఇంట్లోకి వెళ్లి చూడగా ల్యాప్ టాప్, టీవీ, సౌండ్ బాక్సులు, టేబుల్ ఫ్యాన్తో పాటు ఐదు తులాల వెండిని అపహరించినట్లు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

# సమాజ సేవలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం : డా.లక్ష్మణ్

## ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

**సికింద్రాబాద్, అక్టోబర్ 13 (జనం సాక్షి):** సమాజ సేవలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ నియోజకవర్గం మధురానగర్‌లో బౌద్ధనగర్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు, నగర పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక రెడ్డి, సికింద్రాబాద్ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సారంగపాణి పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుక

## ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల లాభాల వాటా

- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం: భట్టి విక్రమార్క

**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి కార్మికులకు దసరా కానుకగా రూ.596 కోట్ల లాభాల వాటా పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. సంస్థ ఈ ఏడాది ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతాన్ని కేటాయించగా, 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 అందనున్నాయి. 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 చొప్పున బోనస్ చెల్లిస్తామని మంగళవారం ప్రజాభవన్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, జీవో 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని, మారుపేర్లు, మెడికల్ ఇన్వాలిడేషన్, ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలిస్తామని చెప్పారు. ఏరియా ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం, కార్మికులకు భద్రతా కిట్లు, ప్రజలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందిస్తామన్నారు.

సింగరేణి అభివృద్ధికి తాడిచర్ల-2, కోయగూడెం-3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్‌సైడ్, నైని బ్లాకేల సాధనపై దృష్టి సారించామని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరలను సర్దుబాటు చేయడంతోపాటు విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుపైనా కృషి చేస్తామని పేర్కొన్నారు. సింగరేణిని పదేళ్లపాటు పాలించి కార్మికుల సమస్యలను పరిష్కరించని బీఆర్ఎస్ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలు చేయడం హాస్యాస్పదమని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించని సమస్యలపై ఇప్పుడు ఎలా పోరాడతారని ప్రశ్నించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, సింగరేణి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి
- జీవో 59, 76 దరఖాస్తులకు ఈ నెలాఖరులోగా పరిష్కారం
- రీసర్వే, ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** రైతులకు కనీస మద్దతు ధర అందించడంతో పాటు, వెట్టిచాకిరీ నిర్మూలన, పెండింగ్ రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారం, భూముల రీసర్వే, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలు, అవగాహన కార్యక్రమాల్లో ఆయన పలు సూచనలు చేశారు.

### పత్తి కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు

2026-27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో జిల్లాలో పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 51,400 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సుమారు 5,14,000 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ రెండో పక్షం నుంచి పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉండటంతో పెద్దపల్లి, సుల్తానాబాద్, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీల పరిధిలో గుర్తించిన జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు వేదికల్లో ఏఈఓలు కనీస మద్దతు ధర, పత్తి నాణ్యతా ప్రమాణాలు, అనుమతించిన తేమ శాతం, కొనుగోలు కేంద్రాలు, కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు, స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు పత్తిని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రంగా తీసుకురావాలని తెలిపారు. వాస్తవ దిగుబడికి అనుగుణంగా అర్హులైన రైతులకు కొనుగోలు పరిమాణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, భూమి రికార్డుల సమస్యలతో కౌలు రైతులు, ఎన్‌డీఎస్ భూముల సాగుదారులు మద్దతు ధర ప్రయోజనాలను కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, విద్యుత్, అగ్నిమాపక భద్రత కల్పించడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు.

### వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం

వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై రూపొందించిన స్వేచ్ఛా రథాన్ని జెండా ఊపి ప్రారంభించి, అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెట్టిచాకిరీ ఘటనలు ఎక్కడైనా గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందించేందుకు టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 080-69434343ను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా, స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితు లు కల్పించేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

### జీవో 59, 76 దరఖాస్తులకు గడువులోగా పరిష్కారం

జీవో 59, 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత రికార్డులు, అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని, క్షేత్రస్థాయి విచారణ అవసరమైన వాటిని స్వయంగా పరిశీలించి అర్హులకు నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని సూచించారు. భూముల రీసర్వేను రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని, భూముల వివరాలు, రికార్డుల్లో లోపాలను గుర్తించి సరిచేయాలని ఆదేశించారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు వివరాలు, అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం ధ్రువీకరించాలని, అర్హుల పేర్లు తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు, సమీక్షల్లో అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు, సంబంధిత శాఖల అధికారులు, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, తహసీల్దార్లు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు, సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం

- నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి
- పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి
- గంజాయి, అక్రమ రవాణాపై నిఘా పెంచాలి
- మహిళలు, బాలలపై నేరాల దర్యాప్తు వేగవంతం చేయాలి
- నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి



**గోదావరిఖని, జనంసాక్షి:** పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీసు అధికారులతో నిర్వహించిన సెప్టెంబర్ నెల నేర సమీక్షలో కేసుల దర్యాప్తు, నిందితుల అరెస్టులు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్ల దాఖలుపై సమీక్షించారు.

పోలీసు అధికారులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని, సంఘటనాస్థలాలను సందర్శించి వీడియో రికార్డింగ్, సాక్షుల విచారణ, ఆధారాల సేకరణతో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని తెలిపారు. నైట్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతోపాటు గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా తయారీ, అక్రమ ఇసుక రవాణా, పేకాటపై నిఘా పెంచాలన్నారు. ఎన్‌డీపీఎస్, నకిలీ విత్తనాల కేసుల్లో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, నేరాల ద్వారా సంపాదించిన ఆస్తుల స్వాధీనానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీవ్రమైన నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులను వేగంగా పరిష్కరించాలని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల నియంత్రణకు స్థానిక పోలీసులు, సీసీఎస్ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చలికాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జన శోభాయాత్ర ముగిసేవరకు నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని, మండపాల్లో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రతి మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయడంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు, కీలక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ కె.శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం
- పుష్కర ఘాట్ వద్ద 10 రోజుల్లో కాంక్రీట్ పనులు ప్రారంభించాలి
- నాలుగు రోజుల్లో రోడ్డు డిజైన్లు ఖరారు చేయాలి
- మార్చి 2027 నాటికి సమీకృత కార్యాలయ భవనం పూర్తి చేయాలి
- 50 పడకల ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం



**మంథని, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మంథని ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గోదావరి పుష్కర ఘాట్ రహదారి, హెలిప్యాడ్, సమీకృత డివిజన్ కార్యాలయాల భవనం, 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామగిరి మండలం పన్నూరు క్రాస్‌రోడ్డు వద్ద రహదారి పనుల పురోగతిని సమీక్షించారు. గోదావరి పుష్కర ఘాట్ వద్ద రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, మరో పది రోజుల్లో కాంక్రీట్ పనులు ప్రారంభించాలని సూచించారు. నాలుగు రోజుల్లో రోడ్డు డిజైన్లను ఖరారు చేయాలని, నిర్మాణ సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. రహదారికి అడ్డుగా ఉన్న చెట్లు, పొదల తొలగింపును వేగవంతం చేయడంతోపాటు, పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను ఆర్డీఓ పరిష్కరించాలని తెలిపారు. పుష్కరాల సందర్భంగా భక్తులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నాలుగు లేన్ల రహదారి విస్తరణ, డివైడర్ నిర్మాణం చేపట్టాలన్నారు.

మంథని-రామగుండం రహదారిపై హెలిప్యాడ్‌ను పుష్కరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సూచించారు. పన్నూరు క్రాస్‌రోడ్డు వద్ద డబుల్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసి, రోగులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సమీకృత డివిజన్ కార్యాలయాల భవనాన్ని మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని, అదనపు నిధుల ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని స్పష్టం చేశారు. మంథని మున్సిపల్ కార్యాలయ భవనంలో మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, మంథని ఆర్డీఓ సురేష్, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, కమిషనర్ మనోహర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావ పరిస్థితులపై ఫోకస్

- పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు
- చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయం
- 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి వచ్చేలా యుద్ధప్రాతిపదికన చర్యలు
- నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, పశుగ్రాసం కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పశువులకు అవసరమైన గ్రాసాన్ని అందుబాటులో ఉంచడంతో పాటు, మూగజీవాలకు నీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా నీటి లభ్యత ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి, 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమీషనర్ దివ్య దేవ రాజన్, గ్రామీణ అభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం శ్రీనివాస్, నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖ (ఐ అండ్ సీఏడీ) ఈఎన్‌సీ రమేష్ బాబు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్‌సీ మధుసూదన్, వీబీజీ రాంజీ అధికారులు పాల్గొన్నారు.

**శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు**

నీటి వసతి ఉన్న చెరువులు, కుంటల పరిధిలోని శిఖం భూములను గుర్తించి, ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు అనువైన స్థలాలను గుర్తించే బాధ్యతను నీటిపారుదల మరియు కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు అప్పగించారు. గుర్తించిన భూముల్లో సాగుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టి, నిర్ణీత గడువులోగా పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఆదేశించారు.

# విద్యతోనే సమాజాభివృద్ధి

- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ విద్యారంగం
- విద్యకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట
- ఉపాధ్యాయులే భావి తరాల నిర్మాతలు..
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంలో భాగస్వాములు కావాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క







హైదరాబాద్ (జనంసాక్షి) : విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ, భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం-ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను ఉన్నతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో విద్య ఎంతగా అభివృద్ధి చెందితే, ఆ సమాజం అన్ని రంగాల్లో అంతగా పురోగమిస్తుందని శాస్త్రీయ అధ్యయనాలు సైతం నిరూపించాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరిస్థితుల సర్వేలోనూ విద్యకు ఉన్న ప్రాధాన్యం స్పష్టమైందన్నారు. వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలు అభివృద్ధి సాధించడానికి విద్య కీలకమైన మార్గమని సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజాన్ని ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని, విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల నియామకాలను కూడా పూర్తి చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యాబోధన అందించడంతోపాటు విద్యార్థుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికి అదనంగా వారానికి మూడు రోజులు పాలు లేదా రాగిజావ అందించే కార్యక్రమాన్ని కూడా విస్తరిస్తున్నామని చెప్పారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,000 నుంచి 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, మైదానాలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు సైతం పాఠశాలల ప్రాంగణాల్లో నివాస సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రాథమిక విద్యకే పరిమితం కాకుండా ఉన్నత విద్యారంగ అభివృద్ధిపైనా దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో అవసరమైన నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా విద్యకు ప్రోత్సాహం అందించేందుకు మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి, ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సాంకేతిక విద్యలోనూ సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఐటీఐ కళాశాలలను ఆధునికీకరించడంతోపాటు పాలిటెక్నిక్ విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, కంప్యూటరైజ్డ్ సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# పీఎంయూ కేంద్రీకృత టెండర్లను రద్దు చేయాలి

- మాజీ మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పీఎంయూ టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును కలిసి, ప్రభుత్వం మార్చిన టెండర్ నిబంధనల వల్ల వేలమంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలను విన్న అనంతరం హరీశ్ రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గురుకులాలను చిన్నచూపు చూస్తూ పేద విద్యార్థులకు పెట్టే భోజనంపై కూడా కక్కుర్తి పడుతూ, 800 కోట్ల టెండర్లలో కమీషన్ల దందా నడుపుతోందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. గురుకులాల్లో పేద విద్యార్థులకు ఇచ్చే స్కూల్ యూనిఫాంలు, నోట్ బుక్కులు, ట్రంక్ పెట్టెల ఇతర వస్తువుల కొనుగోళ్ల టెండర్లలో దాదాపు రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని గతంలోనే తాము ఆధారాలతో సహా నిరూపించామని హరీశ్ రావు గుర్తుచేశారు. ఆ దోపిడీతో కూడా కాంగ్రెస్ పాలకుల కడుపు నిండలేదని.. ఇప్పుడు చివరకు పేద విద్యార్థుల కడుపునింపే నిత్యావసర సరుకులపైనా 20 శాతం కమీషన్లు దండుకోవాలని చూడడం వీరి కక్కుర్తికి నిదర్శనం అని మండిపడ్డారు. స్థానిక వెండర్లను తప్పించేందుకు జీవో 17 పేరుతో మొదట జిల్లా యూనిట్ అని, ఆ తర్వాత రూ. 3 కోట్ల నుంచి రూ. 5 కోట్ల భారీ ఈఎండీలు పెట్టి వారిని పోటీ లేకుండా చేశారని ఆక్షేపించారు. వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించినా లెక్కచేయకుండా, ఇప్పుడు మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చేసి పీఎంయూ విధానం ద్వారా రూ. 800 కోట్ల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి, అదీ గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టిన సంస్థకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. గతంలో నిబంధనల ఉల్లంఘన కారణంగా తెలంగాణ సివిల్ సప్లైస్‌లో రూ. 65 కోట్ల డిపాజిట్ జప్తునకు గురై బ్లాక్‌లిస్టులో ఉన్న నాకాఫ్ సంస్థకు, అలాగే ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిషేధానికి గురైన కంపెనీకి ఈ టెండర్‌ను ఎలా కట్టబెడతారని హరీశ్ రావు ప్రశ్నించారు.

# ఎలివేటెడ్ కారిడార్‌తో తగ్గనున్న ట్రాఫిక్

- జనవరిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు
- ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే పైవంతెనలకు గ్రీన్‌సిగ్నల్
- కేంద్ర మంత్రి గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ.. పలు ప్రాజెక్టులపై కీలక చర్చ



న్యూఢిల్లీ, అక్టోబర్ 13 (జనంసాక్షి) : తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయనతో సమావేశమై పలు ప్రతిపాదనలపై చర్చించారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ రెండంతస్తుల ఎలివేటెడ్ కారిడార్‌ను వార్షిక ప్రణాళికలో చేర్చేందుకు గడ్కరీ అంగీకరించారు. ఈ మార్గంలోని 54 కాలనీల్లో నివసిస్తున్న పది లక్షల మందికి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయని మంత్రి వివరించారు.

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65ను 6ం2 వరుసలుగా విస్తరించేందుకు నవంబర్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని గడ్కరీ హామీ ఇచ్చారు. కృష్ణా నదిపై సోమశిల-సంగమేశ్వరం మధ్య నిర్మించనున్న తీగల వంతెన శంకుస్థాపనకు అంగీకరించారు. దీని నిర్మాణంతో తిరుపతికి 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గనుంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి-765పై ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేలు, సేతుబంధన్ పథకంలో మూడు రైల్వే పైవంతెనలకు ఆమోదం తెలిపారు. హైదరాబాద్-అమరావతి నూతన జాతీయ రహదారి ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలో 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి నుంచి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పుల్లూరు నుంచి నల్లగొండ వరకు పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తామన్నారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరిగే భారత రహదారుల మహాసభకు హాజరయ్యేందుకు గడ్కరీ అంగీకరించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టికి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు!

- టీజీఆర్ఎస్ఏ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించుకున్నట్టుగా టీజీఆర్ఎస్ఏ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి పేర్కొన్నారు. అయినప్పటికీ ఇంకా కూడా కొన్ని సమస్యలు మిగిలే ఉన్నాయన్నారు. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళ వారం హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్ లో టీజీఆర్ ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లచ్చిరెడ్డి, తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, ప్రధాన కార్యదర్శి బిక్షం, కోశాధికారి మల్లేష్, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి చైతన్య గారు, అసోసియేట్ అధ్యక్షులు సుధాకర్ రావు, చంద్ర శేఖర్ మోర, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శులు,ఆర్గనైసింగ్ సెక్రెటరీస్, వివిధ జిల్లాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

# తెలంగాణ-లివర్‌పూల్ భాగస్వామ్య బలోపేతం

- హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం పర్యటన




హైదరాబాద్, అక్టోబర్ 15 (జనంసాక్షి) : యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లివర్‌పూల్ నగరానికి చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం అక్టోబర్ 14, 2026న హైదరాబాద్‌లో తన మూడు రోజుల పర్యటనను ముగించింది. ఈ పర్యటన ద్వారా తెలంగాణ, లివర్‌పూల్ ప్రాంతాల మధ్య ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్, పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యం, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు తదితర రంగాల్లో ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతమైంది. ఈ ప్రతినిధి బృందంలో లివర్‌పూల్ సిటీ కౌన్సిల్, లివర్‌పూల్ సిటీ రీజియన్ కంబైన్డ్ అథారిటీ, ఎన్ హెచ్ఎస్ యూనివర్సిటీ హాస్పిటల్స్ లివర్‌పూల్ గ్రూప్‌కు చెందిన ఉన్నతాధికారులు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, పరిశోధనా సంస్థలు, వ్యాపార సంస్థలు, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగస్టు 2026లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యునైటెడ్ కింగ్‌డమ్‌లో జరిపిన పర్యటన నేపథ్యంలో ఈ సహకార కార్యక్రమాలు మరింత ముందుకు సాగాయి. అక్టోబర్ 13, 2026న తెలంగాణ ప్రభుత్వం మరియు లివర్‌పూల్ సిటీ కౌన్సిల్ మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందంకుదరడం ఈ పర్యటనలో కీలక మైలురాయిగా నిలిచింది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, విజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి, పర్యాటకం, సంస్కృతి, క్రీడలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సహకారానికి ఈ ఒప్పందం మార్గం సుగమం చేస్తుంది. ప్రతినిధి బృందం జీనోమ్ వ్యాలీని సందర్శించి తెలంగాణలోని ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ రంగాల అభివృద్ధిని పరిశీలించింది. బయోఫార్మాస్యూటికల్, ఫార్మాస్యూటికల్, వ్యాక్సిన్, వైద్య సాంకేతికత, పరిశోధనా సంస్థల ప్రతినిధులతో సమావేశమై పరిశోధన భాగస్వామ్యాలు, క్లినికల్ సహకారం, విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అంశాలపై చర్చించింది. అలాగే, ప్రతినిధి బృందం టీ-హబ్‌ను సందర్శించిన సందర్భంగా టీ-హబ్ మరియు నాలెడ్జ్ క్వార్టర్ లివర్‌పూల్/సియోంటెక్ మధ్య అవగాహన పత్రంపై సంతకాలు జరిగాయి. హైదరాబాద్-లివర్‌పూల్ ఇన్నోవేషన్ బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. దీని ద్వారా ఇరు ప్రాంతాలకు చెందిన స్టార్టప్‌ల మధ్య అనుసంధానం, కొత్త మార్కెట్లకు ప్రవేశం, ఆవిష్కరణల ఆధారిత వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు ఏర్పడతాయి. ఆరోగ్య సంరక్షణ రంగంలో కిమ్స్ మరియు యూనివర్సిటీ హాస్పిటల్స్ లివర్‌పూల్ గ్రూప్ పరిశోధన, వైద్య సేవల సహకారం, విద్య, శిక్షణ, సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లాయి. లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫౌండేషన్ ద్వారా క్రీడలు, ఆరోగ్యం, సమాజాభివృద్ధి రంగాల్లో సహకార అవకాశాలను కూడా పరిశీలించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, గచ్చిబౌలిలోని ఎఫ్ఐఎఫ్ఏ--ఎఐఎఫ్ఎఫ్ఏ తెలంగాణ టాలెంట్ అకాడమీ, ఫుట్‌బాల్ క్లబ్‌లు, కోచ్‌లు, కార్పొరేట్ సీఎస్ఆర్ భాగస్వాములతో ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలలో క్రీడా వైద్యం, క్రీడాకారుల ప్రతిభాభివృద్ధి, ఉన్నతస్థాయి క్రీడా శిక్షణపై చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించడానికి, పరిశోధనా భాగస్వామ్యాలను బలోపేతం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ఆవిష్కరణలు మరియు పారిశ్రామిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఎస్, తెలంగాణ, లివర్‌పూల్ ప్రాంతాల మధ్య ఉన్న పరస్పర అనుకూల సామర్థ్యాలను వివరించారు. ఈ పర్యటనలో జరిగిన చర్చలు అర్థవంతమైన సంస్థాగత భాగస్వామ్యాలకు, ఆచరణాత్మక ఫలితాలకు దారితీస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ--లివర్‌పూల్ భాగస్వామ్యాన్ని దీర్ఘకాలికంగా బలోపేతం చేయడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక వృద్ధికి ఇరు ప్రాంతాల్లో కొత్త అవకాశాలను సృష్టించేందుకు ఈ పర్యటన కీలక ముందడుగుగా నిలిచింది.

# చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

- 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్
- ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ
- మీసేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు
- ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి) : ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు రాజ్ ఠాకూర్, విజయ రమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

**2011 నుంచి మీ సేవ సెక్యూరిటీ పేపర్**

తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370